ప్రథమముద్రణ : 1963

వెల : ఆరు రూపాయలు

ము ద్ర ణ :

విక్టరీ ప్రెస్, విజయవాడ-1

పుస్తకప్రపంచంలో అటువంటి ఆదర్శజీవి ఇక మనకు లేకపోవడము మన దుర దృష్టము. కాని, వారు నెలకొల్పిన ఆశయాలను తప్పక పాటిస్తూ, వీలైతే, ఒకఅడుగు ముందుకుకూడా వెళ్ళడానికి ప్రయత్నిస్తారు, ఇప్పటి ఆదర్శగ్రంధ మండలి నిర్వాహకులు అని, నా విశ్వాసము.

ఇదివరకులాగే, ఈ సంపుటము మొదటిప్రతినీ, కైలాసవాసి ఐనా, మన అందరి హృదయమందిరములలోనూ చిరనివాస మేర్పరచుకున్న నెచ్చెలి కొంపెల్ల జనార్దనరావుకు అందిస్తున్నాను, చంద్రునకో నూలుపోగుగా.

ఆచంట జానకిరామ్

కాని, ఇటీవల నేర్చుకున్నాను, ఇటువంటి భంగపాటువల్ల బాధపడి ప్రయోజనములేదని. రావలసిన శుభములు నా ఒక్కని ప్రయత్నమువల్లనే రాగలిగితే ఎన్నడో వచ్చిఉండేవి. అటువంటి మంచికి, నా ఉద్దేశంలో, నే నెంతగా అర్హుడనైనా, ఆ శుభములు చేకూరడము నా ఒక్కనిపైననే ఆధారపడిఉండలేదుగా ! పరిస్థితుల ప్రభావము కొంతా, వ్యక్తుల దృఢమనోభావాలు కొంతా మన సంకల్పాలకు అడ్డుతగులుతాయి. ఒకసారి చేతులుకాల్చుకున్నాక తెలుస్తుంది, అలా సంకల్పించడము నిష్ప్రయోజనమని. కొందరు తమచుట్టూ ఒక గిరిగీసుకుంటారు. వారు, మనకోసం, ఆ గిరిదాటి వస్తే బాగుంటుంది అనుకుంటాము మనము. వారు అలా దాటలేరు- ఒకవేళ, దాటాలని వారికున్నా. ఇది తెలిశాక, మనము ఆశింపము కూడా. అలా ఆశింపకపోవడమే మనశ్శాంతికి మంచిమార్గము.

ఐతే, ఏ మాటకు ఆమాటే చెప్పాలి: లోకానికి నేను ఇచ్చిన దానికంటే లోకమే నాకు ఎక్కువ ఇచ్చింది. ఇందుకు ఏ మాత్రమూ సందేహములేదు. అందువల్లనే రవీంద్రుడు ఈ మాటలను నాకోసమే అనినట్లు ఊహించుకున్నాను, అనేకసార్లు, ఈమధ్య:

"రోజులు గడిచిపోతున్నవి.
నేను ఒక్కడనూ కూర్చొని చింతిస్తున్నాను:
ఈ జీవితములో నాకెన్ని కానుకలు వచ్చినవి?
వీనిలో, వినియోగింపలేక, ఎన్నిటిని వృథాచేశాను!
నాకు రావలసినది ఎంత వచ్చినది?
నేను ఇయ్యవలసినది ఎంత ఇచ్చాను?

'క్రిందటి కెరటపు కౌగిలింతనుండి తేరుకుంటూనే అడుగుతుంది చెలియలికట్ట: "మళ్ళా ఎప్పుడొస్తావు కెరటమూ?" అని. రెట్టించిన ప్రేమతో మళ్ళా విరుచుకుపడుతుంది, కెరటము, అని తెలుసు; కాని, ఈ క్షణిక వ్యవధీ భరించడమెలా?'

* * *

'కొలనులో జలకమాడుతూంటే, వికసించిన తామరపువ్వు వయ్యారంగా నావైపు వ్రాలి, రహస్యంగా, నా చెవిలో అంటుంది: 'నిజంచెప్పు, నాకంటె ఆ మెముఖమే అందముగా ఉంటుంది కాదూ? ...కాదూ? నీ మనసులోనిమాట చెప్పు; నేను ఏమీ అనుకోనులే!' అని.

* * *

'...పొన్నలూ పొగడపువ్వులూ తెల్లగులాబీ ఎర్రగులాబీ, ఇందీవరాలూ ఎర్రతామరలూ, ఏ ఋతువులో పూసినవి ఆ ఋతువులో అర్పిస్తాను, నీకు, ప్రతి ఉదయమూ, నేబ్రతికినన్నాళ్ళు, నీకు. నీవు చిరునవ్వుతో అందుకుంటావుకదూ!

....చివరకు, ఒకనాటి ఉదయము నేను రాలేకపోతాను, నీవద్దకు. అప్పుడు నీవే వస్తావుకదూ, నా వద్దకు? తప్పక వస్తావు కదూ !!'

* * *

"చిత్రకారునితో, రాకుమార్తె :

'కాని, నీ కళ్ళకు కనిపించేది నేనుకాదు; నా అంతరాత్మ.

నీవు చిత్రించేది నన్నుకాదు; పురూరవునికి ప్రాణమిచ్చిన ఊర్వశి ఊపిరిని!' "

* * *

తప్పక తెల్లవారుతుంది; ఈ చీకట్లు మాయమవుతవి.

అప్పుడు, గంభీరమైన నీ కంఠస్వరము వినిపిస్తుంది. ఆకాశ వీధులను ప్రవహించివచ్చే అపరంజి కిరణపరంపరగా.”

ఈ కృషితోపాటు నాకు చాలా ఇష్టమైన స్నేహసంపద, సౌందర్యసంపద, మంచితనము, నిజాయతీ అనే నేటి చతుర్విధ పురుషార్థములనుగురించీ జనులకు విశదీకరించే సదవకాశమూ కలిగినది. ఈ సందర్భములో జరిగిన ఒక సభలో నన్ను సభవారికి పరిచయంచేస్తూ అంతవరకూ నా రచనలద్వారానే నన్నెరిగియున్న సహృదయులు ఒకరు ఇలా అన్నారు: “మంచిగంధమూ మల్లె పువ్వుల సౌరభమూ వెన్నెలా పన్నీరూ ఇవి కలిపితే, ‘జానకిరామ్ హృదయము’ అన్నమాట!” అని. అల్లాగే, మరో సభలోను అదే మొదటిసారిగా ప్రత్యక్షముగా నన్ను కలుసుకొనిన సభాధ్యక్షులు నన్ను గురించి ఇలా అన్నారు: “స్నేహానికీ సౌందర్యానికీ పర్యాయపదము జానకిరామ్ పేరు!” అని.

ఇటువంటి మన్ననలవలన వ్యక్తిగా నేను ఏ మాత్రమూ గర్వింపను. ఇటువంటి ఆప్యాయత నా కన్నులను చెమ్మగిలచేసి, వర్ణింపనలవికాని కృతజ్ఞతతో నింపివేస్తుంది నన్ను. నే ప్రకటించే ఆశయాలను కొందరైనా ఈ విధంగా గుర్తిస్తున్నారు, అని సంతోషిస్తాను.

నాకు తెలుసు, ఏ ఒక్క మనిషీ లోకాన్ని మార్చలేడని. అందులోనూ, స్వాతంత్ర్యము వచ్చాక, అనేక కారణాలవల్ల అనేకవిధాల అధోగతికి పాలవుతున్న మన ఆంధ్రజనానీకము

గతమాభరణ ప్రయోజనమ్
పరిశూన్యమ్ శయనీయమద్య మే॥

కాని, ఇన్నేళ్ళ అనుభవంలోనూ అటువంటి నిస్పృహ నన్ను పూర్తిగా వదలివేసింది. ఆ స్థానంలో రవీంద్రుని ఈ అమృత వచనము సుస్థిరస్థానాన్ని ఏర్పరచుకున్నది:

"ఎంత మధురమైనదీ ఈ ప్రపంచము!
మధురాతి మధురము ఈ ధూళి!!

ఎన్నిసార్లు జపించుకుంటున్నానో ఈ మంత్రాన్ని నేను:

ఎంత మధురమైనదీ ఈ ప్రపంచము!
మధురాతి మధురము ఈ ధూళి!!

ఈ భావనయే నామనుగడకు అర్థాన్ని కల్పిస్తున్నది.

నానాటికి అతిశయించే క్రొత్త కాంతులను విరజిమ్ముతూ నవరత్నముల కానుకవలె సత్యము స్ఫురిస్తూ ఉంటుంది, నా అంతరంగమున, రోజుకు రోజుకు."

ముందు ఏమి కానున్నదో, ఇకముందు ఈ జీవితము ఎలా పరిణమిస్తుందో అనే ఆలోచన ఏ మాత్రమూ లేదు, నాలో ఇప్పుడు. రవీంద్రుడు ప్రకటించిన పరమవిశ్వాసము నా భావిజీవితాన్ని ఉత్సాహముతో ఎదురుచూచే ఆత్మబలము నిస్తుంది నాకు:

"నా నిత్యజీవితములో అనుక్షణమూ నా ప్రతి ఆలోచనలోనూ నా ప్రతి చేష్టలోనూ నా ప్రతిఅనుభవములోనూ నా కన్నెదుట జరిగే బహుముఖమైన సౌందర్యసాక్షాత్కారణలోనూ, ఆ దైవమే చైతన్యమయుడై, శతసహస్రరూపమున ప్రతిబింబిస్తాడు. 'నేను ఉన్నాను' అనే భావమే సాక్ష్యము అతని ప్రేమ శాశ్వతమని నిరూపించడానికి!"

సాగుతున్న యాత్ర

"మరి, ఇప్పుడేమి చేయదలచుకున్నావు?" అని ప్రశ్నించాడు రావ్, నా చిరకాలమిత్రుడు, 1938, డిసెంబర్ నెలలో, ఒకానొకరోజున, ఢిల్లీలో వారిఇంట నన్ను. ఆల్మోరాఅమ్మాయి, నిర్మల, అతనిభార్య — అప్పుడెప్పుడో, నేను వారితో కలసి, అలహాబాద్ వద్ద, యమునానదీవిహారంచేసి వచ్చాక, వారివద్ద సెలవుపుచ్చుకుంటూండగా, నాచేతిలో పన్నెండుజతల సన్నని గాజులు, జాజిరేకులకంటే సన్ననిగాజులు, ఉంచిన ఆ నిర్మలే — చేరువనే కూర్చొని, పిల్లకు జడవేస్తూ, మా మాటలు వింటున్నారు, ఆమె.

"ఏముంది? ఏదో ఉద్యోగంకోసం ప్రయత్నించాలికదా, మరి! .... ఈస్టిండియన్ రైల్వేలో టికెట్ కలెక్టర్ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాను" అన్నాను, నేను.

నిర్మల ఫక్కున నవ్వారు. "మీరా! టికెట్ కలెక్టరా! 'బాబూ! బీద వాళ్ళం, డబ్బు ఇచ్చుకోలేం' అంటే, మీజేబులో పైకముతీసి, టికెట్ కొనిపెట్టి, గేట్ దాకా సాగనంపి వస్తారు, మీరేమిటి, టికెట్ కలెక్టర్ పనేమిటి!" అని, మళ్ళీ నవ్వారు, ఆమె.

రావ్ అన్నాడు: "కాదుగానీ, నాకో ఆలోచన తోస్తోంది. క్రొత్తగా వెలసిన ఆల్ఇండియా రేడియోసంస్థవారికి నీవంటివారు ఎంతైనా ఉపయోగపడవచ్చును. కంట్రోలర్ ఆఫ్ బ్రాడ్‌కాస్టింగ్, లయొనెల్ ఫీల్డెన్, నాకు స్నేహితుడు. ఆయనను చూద్దాము, రా నాతో." అని, నా దుస్తులకేసి చూస్తూ, "ఇంకా అడయార్ దుస్తులేనా? తెల్లలాల్చీ, తెల్లపైజామా, జరీఖండువా. అవి ఇక్కడ చలామణీకావు!" అంటూ నిర్మలను ఉద్దేశించి, అన్నాడు: 'చూడు! నా షర్వానీ, కాఫీ రంగుది, ఇస్త్రీచేయించి ఉంచుతావా, ఇతనికి సరిగ్గా సరిపోతుంది, టోపీకూడా ఇస్త్రీచేయించు. మధ్యాహ్నమే ఫీల్డెన్‌వద్దకు తీసుకువెళతాను, మన జానకిరామ్‌ను. ఇప్పుడే ఫోన్ జేస్తాను" అన్నాడు రావ్.

"నేను టోపీ పెట్టుకోనే, ఎప్పుడూ" అన్నాను నేను.

హైర్‌పర్చేస్ కంపెనీ వారికి అప్పగించివేసి, మిట్టమధ్యాహ్నం, మవుంట్ రోడ్‌లో కాలినడకను వెళ్ళిపోయాను. పట్నంలోనే కొంత ఉద్యోగప్రయత్నం చేశాను.

నాకు, అప్పుడూ ఇప్పుడూ కూడా, ఎవరైనా గొప్పవ్యక్తికి అంతరంగిక కార్యదర్శిగా ఉండాలనే గొప్ప కుతూహలము. అదేమిటో వెర్రినమ్మకము, నా చాకచక్యంవల్లా నా కృషివల్లా వారి గుణగణాలు లోకానికి మరింత ఎక్కువగా వెల్లడికాగలవనే వెర్రినమ్మకము. ఈ అభిప్రాయంతో తిన్నగా, జిడ్డు కృష్ణమూర్తి ఉపదేశాలను ప్రచారంచేసే సంస్థఉన్న వసంతవిహార్‌కి వెళ్ళి, ఆఫీస్ మానేజర్‌గా ఉన్న ద్వారకనాద్ తిలంగ్‌ను దర్శించాను. ఆయన చాలా బాగా చదువుకున్నారు, ఆక్స్‌ఫర్డ్ ఎమ్. ఏ. నేను అడయార్‌లో విద్యార్థిగా ఉన్నప్పుడు మాకు ఇంగ్లీష్ సాహిత్యంగురించి ఉపన్యసించేవారు, తిలంగ్. నన్ను చాలా ప్రేమతో పలుకరించి, యోగక్షేమాలడిగారు. కాని, శ్రీ కృష్ణమూర్తికి అంతరంగిక కార్యదర్శిగా ఉండడముకోసము వచ్చానని చెప్పేసరికి, ఆయన అన్నారు: "నీవంటి బుద్ధిమంతుడూ, కార్యదీక్ష కలవాడూ ఆయనకు కార్యదర్శిగాఉంటే చాలా బాగుంటుంది, నిజమే. కాని, మరి, నేను ఉన్నానుగా — నేను ఉన్నంతకాలమూ ఇద్దరకు పని ఉండదు, ఇక్కడ" అన్నారు. తలవంచుకు వచ్చివేశాను.

ఆ సాయంత్రము, స్నేహితుడు, ప్రఖ్యాత చిత్రకళావేత్త, వి. ఆర్. చిత్రాను చూడడానికి వెళ్ళాను, ఇల్లా కలకత్తా వెళుతున్నానని చెప్పడానికి. నా సంగతి విని, "అన్నట్టు అంతదూరం వెళుతున్నావు, లక్నోకూడా వెళ్ళరాదా? లక్నోలో నా స్నేహితుడు అసిత్‌కుమార్ హాల్‌దార్ చిత్రకళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్నాడు. నీవంటి కళాప్రియుడూ రచయితా విమర్శకుడూ అతనికి చాలా అక్కరకు రావచ్చు. నేను ఉత్తరం వ్రాస్తాను అతనిపేర. తప్పక వెళ్ళిచూడు," అన్నాడు చిత్రా. లక్నో! ఇదివరకు ఒకపర్యాయము చూచాను, ఆ ఊరు. సుందర నగరము. హిందూ, మొగల్, పాశ్చాత్య సంస్కృతీ లక్షణాలు అన్నీ, ఒకేచోట, ప్రక్కప్రక్కనే కనిపిస్తూంటాయి, లక్నోలో. అద్భుతమైన జంత్రగాత్ర ప్రవీణతకు పుట్టినిల్లు, లక్నో. కాని, నేను లక్నో వెళ్ళలేకపోయాను.

ములో మా బస. గణనాద్ సేన్ నాన్నగార్కి ఆప్తస్నేహితుడు. నేనంటేనూ చాలా ఆప్యాయము, వారికి. ఆయన గొప్పవైద్యుడు. ఆయనకున్న ఆయుర్వేద విజ్ఞానాన్ని, ఆయన మంచిహస్తాన్నీ పాటించి వంగదేశీయులేగాక, ఇతర ప్రాంతాల వారున్నూ వేలకువేలు గ్రుమ్మరిస్తారు, ఆయన వైద్యంకోసము.

నాన్నగారితోను రుక్మిణమ్మ పిన్నిగారితోనూ కలసివెళ్లాము అక్కయ్యా నేనూ వర్కింగ్ కమిటీ సమావేశం చూడడానికి. ఆ సభ చరిత్రాత్మకమైనది.

ఆ సభలోనే అనుకుంటాను, సుబాష్ చంద్రబోస్ కి జవహర్ లాల్ నెహ్రూకి ఘర్షణ జరిగినది. అప్పుడే నేను సుబాష్ చంద్రబోస్ ను మొదటిసారీ, ఆఖరుసారీకూడా, చూస్త. సభాప్రాంతంలో ఏదో కారణమువల్ల గల్లంతై, వాలంటీర్లూ ప్రజలూ కొట్టుకోడానికి సిద్ధమయ్యారు. ఆ మిషమీద పోలీసులు చెయిజేసుకోబోతున్నారు. పచ్చగడ్డివేస్తే భగ్గుమనే స్థితిలో ఉన్నది, వాతావరణం. ప్రేక్షకులు ఊపిరిబిగబట్టి చూస్తున్నారు, ఏమి అవుతుందోనని. ఆ నిమిషాన కాలినడకను అక్కడకు వచ్చారు ఒక వ్యక్తి. తెల్లని ఖద్దరుదుస్తులు, అందమైన ఖద్దరుటోపీ, పదహారువన్నెల బంగారుఛాయ దేహకాంతి. ఆ కళ్ళలో విపరీతమైన ఆకర్షణా శక్తి! లక్షమందిలో ఆ వ్యక్తిని విడమరచి గుర్తింపవచ్చును. వేయికంఠస్వరాలలో విడిగా వినవచ్చు, ఆయన కంఠస్వరము. బెంగాలీ భాషలోనే అన్నారు, ఒక్కమాటే: "ఏమిటిది?" అని. ఒక్కక్షణం ఆగి మళ్లా అన్నారు: "చేయవలసినపని చాలా ఉన్నది, ఇలా కాలయాపనచేస్తే ఎలాగ?" అని.

అంతే! మత్తుమందు చల్లినట్టు అల్లరి అణగిపోయింది. ఈవైపు వాలంటీర్లూ ఆవైపు ప్రజా ఎవరితోవను వారు వెళ్ళిపోయారు, గప్ చిప్ మనకుండా.

అప్పుడు రుక్మిణమ్మ పిన్నిగారు అన్నారు, మాతో: "అతనే, సుభాష్ చంద్రబోస్, చూశారా, ఆ ఠీవి ఆ దర్జా అద్భుతమైన ఆ ఆత్మవిశ్వాసమూ!" అని.

....అక్కయ్యా నేనూ భగల్ పూర్ తిరిగి జేరేసరికి ఢిల్లీనుంచి ఆర్డర్ వచ్చి ఉన్నది మా బావ మీర్ చందానీని ఢిల్లీకి బదిలీచేస్తూ. మరునాడే, మా ఢిల్లీ ప్రయాణము.

విషయంగురించీ అంతకుముందు ఒక ఏడేళ్ళ బెంగుళూర్‌లో నా విజ్ఞానశాస్త్రి పరిశోధనగురించీ ఇంకా అంతకుముందు నా అడయార్ చదువుగురించీ.

నా చరిత్ర ఓపికతో విని అతిస్నిగ్ధదరహాసంతో అడిగారు, ఫీల్డెన్: "నీవు దివ్యజ్ఞానసమాజ సభ్యుడవా!" అని.

"సభ్యుడను గాను; కాని, నేను పెరిగిన వాతావరణం అంతా ఆ వాతావరణే: జేమ్స్ కజిన్స్ మా గురువు, బెసెంట్ మాకు మార్గదర్శకురాలు—ఆమె నా రచనలు కొన్ని చదివి ఆనందించారు కూడాను" అన్నాను.

ఫీల్డెన్ నవ్వుతూ అన్నారు: "ఒహో! నీవు కవివికూడానా! నీ రచనలు ఏమైనా తెచ్చావా?" అని.

త్రివేణి సంచికలు వారిచేతికిచ్చాను.

ఆసక్తితో చదివారు ఆయన: 'కన్నీరు' అనే రచన, 'దివ్యమందిరము' అనే రచన, కృష్ణశాస్త్రి గేయానికి నా అనువాదమూను.

పుస్తకాలు నా చేతికిస్తూ రావ్‌ను ఉద్దేశించి అన్నారు ఆయన: "మాకు ఇటువంటివారే కావాలి. పెద్ద పెద్ద పరీక్షలిచ్చి కేవలం విజ్ఞానవంతులూ మేధావులూ ఐనవారికంటె ఇలా జీవితపు ఒడుదుడుకులకు ఎన్నో అనుభవించి, ఆశ, నిరాశ రుచిచూచి, భావిజీవితాన్నిగురించి కొంత ఉత్సాహంతో, కొంత భయంతో చూసేవారే కళానిలయమైన ఈ సంస్థకు అక్కరకు వస్తారుసుమా!" అని.

నావైపు జూస్తూ అన్నారు, ఫీల్డెన్: "నిన్ను ఆల్ ఇండియా రేడియో ఢిల్లీ కేంద్రంలో ప్రొబేషనర్‌గా తీసుకుంటాము. కాని, జీతము చాలా తక్కువ, ఏబది రూపాయలే, అంగీకారమేనా?" అని.

నేను వెంటనే అన్నాను: "నాకు చాలు, అసలు ఈ వ్యాపకము నాకు చాలా ఇష్టమైనది. ఇందు పాల్గొనాలని నాకు ఆసక్తీ, అభిలాషా ఎక్కువ!"

అంతకు కొన్నాళ్ళముందే జరిగిన తమ గుంటూరు సంగీతసభలనుగురించీ ఆంధ్రులకు ఆయనవాణియందుగల ప్రత్యేకమైన ఆసక్తిని గురించీ.

ఆరోజులలో.అఖ్తరీబాయ్ పదహారేళ్ళబాలిక. సుశ్రావ్యమైన కంఠస్వరము, ఆమెది. సౌజన్యశీలి, ఆమె. హిందూస్థానీవాణిలోనే ఉన్నదేమో ఆ ఆర్ద్రత—ఎంతో హృద్యంగానూ మనోహరంగానూ ఒక్కొక్క మాటా ఒక్కొక్క భావమూ, పూర్తిగా అనుభవిస్తూ, గానముచేసేది ఆమె. ఉమ్రాజియా బీగమ్ లలితసంగీతము పాడేవారు. ఆవిడ ప్రోగ్రామ్ ఉన్నరోజు ఉదయం ఒక నూరు టెలిగ్రాములూ ఉత్తరాలూ వచ్చిఉండేవి. ఆమెను "మేరే సలామ్ లేలేవ్!" అనే పాట పాడమని కోరుతూ, శ్రోతలవద్దనుంచి. అద్భుతమైన భక్తిరసానందము కలిగించేది, ఆ చిన్నపాట. మక్కా—ముసల్మానులకు అతి పవిత్రస్థలము. మక్కాను సందర్శింప కలిగితే జన్మతరించినట్టే! మక్కా—సందర్శనము జీవితపరమావధి, వారికి. తాను స్వయంగా ఆయాత్రపై వెళ్ళలేని ఒక భక్తుడు, ఆవేపు వెళుతూన్న ఒక ఒంటెలను తోలువానిని ప్రాధేయపడుతూ అనేమాటలు అవి: "దయఉంచి నా సలాములు తీసుకువెళ్ళు, మక్కాకు!" అని. ఈ 'సలామ్ పాట' రేడియోలో ఉమ్రాజియా బీగమ్ వినిపిస్తూంటే, ఇళ్ళల్లో, వీధుల్లోఉన్న వేనకువేల జనం అట్టే ఆగి వినేవారు. కొందరు కన్నీరు రాల్చేవారుకూడా, భక్తిపారవశ్యంచేత. అంతటి అనుభూతిని కలిగించేది, ఉమ్రాజీయా ఆ పాటద్వారా,

నేను పనిలో ప్రవేశించిన మూడవనాడే ఆల్ ఇండియారేడియోవారు దక్షిణప్రాంతాలకు ప్రత్యేక ప్రసారం ప్రారంభించారు, ఢిల్లీ కేంద్రమునుంచి. భారతీయ బ్రాడ్కాస్టింగ్ విధానంలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమన్నమాట.

సాయంత్రం సరిగ్గా ఆరున్నరకు, నేను మైక్రోఫోన్ ఎదుట కూర్చుని అన్నాను: "ఆల్ ఇండియా రేడియో, ఢిల్లీకేంద్రము, దక్షిణప్రాంతాలకు ప్రత్యేక ప్రసారము, కుమారికమల గానము" అని.

ఆ మాటలు అంటూఉంటే, ఒకవింత విద్యుచ్ఛక్తి నాలోని ప్రతి అణువునూ వింతగా స్పందించింది.

సాగుతున్న యాత్ర

ఉదయకాంతుల పసిడితీగొకటి మెరసినది
మృదుపుష్ప గర్భమున రేకొకటి విరిసినది
లలిత సుందర దివ్య లావణ్య నవజీవ
మధుమాస సుధలలో హృదయమే పొంగినది!

అంతరాయాలు విడమరచి చెపుతూ, వినేవారికి కొంత ఉల్లాసము కలుగజేస్తూ ఉండేవాడను. సత్య సన్నంగా బక్క పలాచగా ఉంటుంది. రుక్మిణి కాస్త లావు. సత్య ముఖము కోలగా ఉంటుంది. రుక్మిణి ముఖము గుండ్రము. రుక్మిణి దేహ చ్ఛాయ పదహారు వన్నెల బంగారపు చాయ, ఏనుగు దంతపు తెల్లదనంతో కాస్త గులాబీఎరుపుకలిగిఉంటుంది సత్య మేనికాంతిలో.సత్య చంద్రకాంతపు పువ్వులాంటి ఎరుపూ ఊదా కలసిన రంగుపరికిణీ పైన తెల్లజరీచీరవల్లెవాటుగా వేసుకుంటుంది. రుక్మిణి నెమిలిపింఛపు రంగులో బెంగుళూరు పట్టుచీర కట్టుకుంటుంది. సత్యకు పల్చని వెడల్పయిన మువ్వల వడ్డాణమూ ఒంటిపేట బంగారపు గొలుసూ ఇష్టము. రుక్మిణికి కంటే కాసులపేరూ ఇష్టము. కృష్ణుడు తన ఇంటికి వస్తున్నాడని సత్య అతనికోసం మామిడికోరు పెరుగు పచ్చడి చేస్తుంది — ఈ ధోరణిని చెప్పుకు పోతూ ఉండేవాడను. స్నేహితులు ఆనందిస్తుండేవారు. అన్నట్టు, సత్య, నక్షత్రంలా, కనిపించీ కనిపించకుండా, చిన్నకల్యాణపుబొట్టు పెట్టుకుంటుంది — బుగ్గనుకూడా! రుక్మిణి అరకాసంత కుంకుమ బొట్టుతోగాని కనిపించదు, ఎప్పుడూను!!

ఉలూచి నాకు సత్యాదేవంత ప్రియమైన ప్రబంధనాయిక. అందులోనూ, నాగకన్యక కూడానా మరి, నాలోనేను నిర్మించుకున్న ఉలూచీరూపము ఎంతో ఆకర్షణీయముగా అమరింది. ఆమె కన్నులలో వింత ధగ ధగ కనిపించేది, నాకు. శలాకలా ఉండే ఉలూచి గిరగిరా తిరుగుతూ నదీగర్భములోంచి పైకివచ్చి, స్నానమాడుతూన్న అర్జునుని అమాంతగా నాగలోకములోకి ఎత్తుకుపోవడము నాకు ఎంతో నచ్చింది. తరువాత, ఆమె సంభాషణ చాలా హృద్యంగా ఉంటుంది.

అసలు, నాకు విజయవిలాసముతో పరిచయము కలిగించిన పుణ్యము ఆప్తులూ, స్నేహితులూ ఐన తాపీ ధర్మారావుకు చెందినది. ఏడాదిక్రితము మద్రాస్‌లో వారిని తరుచు కలుసుకుంటూ ఉండేవాడను — కేవలమూ, సాహిత్యగోష్ఠి కోసము. సాహిత్య విషయాలలో ఆయన వజ్రాలగని వంటివారు. వారు చెప్పగా, ఎన్నెన్ని క్రొత్త క్రొత్త విషయాలు వినినా, ఇంకా ఎన్నో ఎన్నో క్రొత్త సంగ

ఉలూచి కన్నులకు కట్టినట్టు కనిపించింది, నా ఎదుట, ఆ ఉదయాన, యమునానదీ తీరాన ....

....ఎవరో పిలుస్తున్నారు నన్ను — అవును, మాఆఫీస్ జవాను. అక్కయ్యపంపించి ఉంటుంది—ఆవేపు యమున ఒడ్డున కూర్చున్నాడు, అతనే, వెళ్ళమని.

స్టేషన్ డైరెక్టర్ నన్ను వెంటనే రమ్మనారట. చప్పుచప్పున స్నానం చేసి, ఆఫీస్ దుస్తులు తగిలించుకొని హాజరయ్యాను, వారిముందు, వీలైనంత త్వరగా. ఆ మధ్యనే ఆఫీస్‌లో కొన్నిమార్పులు జరిగి క్రొత్త ఆయన మాకు అధిపతిగా వచ్చారు. వీరు దక్షిణదేశమువారు—నాన్నగారిని బాగా ఎరుగుదురు. ఆఫీస్ ఆవరణలోనే వారిబస. అందుచేతనే ఇంత పెందరాళే నాకు కబురుచేశారు. ఏమిటో ఆ ముఖ్యవిషయము........

తోటలోనే నన్ను కలుసుకొని, అడిగారు, ఆయన. "ఏం? నాతో చెప్పావు కాదేమి?" అని.

ఏమిటో నాకు అర్థము కాలేదు. ఆయన ఆ ఉదయపు హిందూస్థాన్ టైమ్స్ నాచేతికిచ్చారు, చూడమని. వార్తలలో ముఖ్యవార్తగా కనిపించింది, మద్రాస్ శాసనసభ ఉపాధ్యక్షురాలు, శ్రీమతి రుక్మిణీ లక్ష్మీపతి అఖిలభారత శాసనసభాధ్యక్షులసభకు హాజరయ్యే నిమిత్తం ఢిల్లీ వచ్చి ఉన్నారని.

"అదా! ఆమె ఈ ఊరు వస్తారని నాకే తెలియదు!" అన్నాను, నేను.

డైరెక్టర్ అన్నారు: "సరే! ఆమె మన రేడియోలో మాట్లాడాలి. ఏ విషయమునుగురించి మాట్లాడితే బాగుంటుందో నేవే ఆలోచించి, ఏర్పాటు చెయ్యి. వీలైతే ఈరాత్రే, తప్పితే, విధిగా రేపురాత్రి 9-30 కు ఆమె ప్రసంగము!" అన్నారు.

నేను ఆలోచిస్తుంటే, ఆయన మళ్లా అన్నారు: "డ్యూటీ ఆఫీసర్‌కు ఫోన్ చేస్తాను. ఆఫీస్ కార్ తీసుకువెళ్లి, పని ముగించుకురా!" అని.

"ప్రొఫెసర్ శేషాద్రి కొడుకూ, నీవూ, మరికొందరూ మనప్రాంతాల వారూ, క్రొత్తగా వెలసిన ఢిల్లీ కేంద్రములో జేరి ఆ సంస్థకు గొప్పపేరు తెస్తున్నారట, ప్రారంభంలోనే. కాని, నీవు ఎరుగవు. కాస్త జాగ్రత్తగా ఉండాలి. అమితమైన ఉత్సాహాన్ని అందరూ అంతటి ఔదార్యంతో చూడరు. ఇంగ్లీష్‌లో ఒక లోకోక్తి ఉన్నది: 'మెల్లిగా పరుగెత్తు సుమా!' అని. ఈ ఆరంభఉత్సాహము ముప్పు తేవచ్చును. అసహనము మానవస్వభావముతోనే ఉన్నది. ఇచ్చటి ఇప్పటి వాతావరణ మీ వంటివారికి అంత అనుకూలంగాలేదు. అప్పుడే, విమర్శలు బయలుదేరినవి. ముందువచ్చిన చెవులకంటె తరువాత మొలచిన కొమ్ములు వాడికదా?, అంటూ. కాస్త పదిలంగా ఉండండి. కృషిచెయ్యవలసినదే. కాని, అట్టహాసమూ అనవసర ఆర్భాటమూ అపకారము," అన్నారు ఆయన. నిత్యమూ ఎందరినో చూస్తూ ఉంటారు ఆయన. ఎక్కడెక్కడనుంచో వార్తలూ అభిప్రాయాలూ జేరుతూ ఉంటాయి. చాలా నిజము: కృషి ఎంతైనా చేయాలి. అట్టహాసం మాత్రం ఏ మాత్రమూ పనికిరాదు.

నాకు ఆ సలహా ఇచ్చిన ఆయననూ, వారి సలహాను నేను ఇప్పటికీ మరవలేను.ఆయన గొప్ప రాజకీయవేత్తగా తరువాతతర్వాత మంచిపేరుపొందారు.

రుక్మిణమ్మగారి ప్రసంగం ప్రసారమైనపిదప రెండు మూడు రోజులు నన్ను మా ఆఫీస్‌లో అందరూ చాలా అభినందించారు.ప్రసంగంలోని విలువనుబట్టి కొంత,డెప్యుటీస్పీకర్‌కుమారుణ్ణిఅనే గొప్పవల్ల కొంత నాకీ పొగడ్తలు.కానీ ఇందువల్ల నేను గర్వపడేలోపుగానే ఉన్నట్టుండి నిర్మలాకాశంలోంచి భూమిమీదికి వ్రాలిన పిడుగులాగ కంట్రోలర్ ఆఫీసునుంచి ఒకకాగితం వచ్చింది. నాతో కలసి, పని నేర్చుకుంటూన్న ఒక ముగ్గుర్ని మరికొన్నినెలలు పనిలో ఉంచుతూ నాకూ మరిద్దరికీ ఆ నెలాఖరుతో మా ప్రొబేషన్ అంతముచేస్తూ పైవారు పంపిన ఆర్డర్ అది. నేను నిర్ఘాంతపోయాను.

నా చేతికిచ్చిన కాగితమును తీసుకుని తిన్నగా డైరెక్టర్‌వద్దకు వెళ్లాను. ఆయన చాలా ఆశ్చర్యపడుతూ "ఇదేమిటీ! ఎప్పుడొచ్చిందీ కాగితం? నాకు తెలి

సాగుతున్న యాత్ర

ఆఖరురోజున తతిమ్మావారికి ఉత్తరాలు వచ్చాయి. ఫిబ్రవరి 12 వ తేదీన మద్రాసులో, జరుగనున్న ఇంటర్వ్యూకి హాజరుకమ్మని, నాకు మాత్రము అటు వంటి తాకీదు రాలేదు. అప్పటి నా కంగారు వర్ణింపలేను.

డైరక్టర్‌ను వెళ్ళిచూడగా ఆయన సానుభూతితో అన్నారు: "ఇప్పటి వారిపద్ధతే అంత! మొగలాయి దర్బార్ అరాజకత్వము! అంతే, వీరిచర్యలు! నాకు అర్థమగుటలేదు. ఏ నిబంధనలు అనుసరించి నిన్ను ఇంటర్వ్యూకి పిలువలేదు?"

....మరునాడు వేకువనేలేచి, సిద్ధమయ్యాను. మంచిచలి! ఐనా లెక్క-చెయ్యలేదు నేను. ఆఫీస్‌దుస్తులు గాక నాకు ఇష్టమైన నా అడయార్ దుస్తులే వేసుకుని స్టేషన్‌కు బయలుదేరాను. త్రోవలో గులాబీతోటవద్ద ఆగి కెంపులకంటే ఎర్రనిగులాబీలు, వెల్వెట్ కంటే, మృదువుగా నిగనిగలాడేవి, అతిసుకుమారమైన ప్రేయసిపెదవి విప్పి ఏదో రహస్యం చెప్పబోతున్నట్టు వికసిస్తూ వికసిస్తూన్నవి ఒకపది పువ్వులు, మరీ అందమైనవి ఏరి, గుత్తికట్టించుకు తీసుకున్నాను. స్టేషన్‌లో ఫీడ్లెన్ కార్ ఆగీఆగడంతోనే డవాలీ జవాను ఈవేపు పరుగెత్తుకువచ్చి తలుపు తీసేటంతలో, కార్‌లోంచి క్రిందికి అడుగుపెడుతూన్న ఆయన ఎదుట నుంచున్నాను, రెండుచేతులతోటి ఎర్రగులాబీలను అందిస్తూ. నన్నుచూచి నాచేతులలోని పువ్వులనుచూచి ఫీడ్లెన్ పరమానందభరితులయ్యారు.

"ఎంతచక్కని పువ్వులు! నాకోసమే తెచ్చావా? ఇంత అందమైన పువ్వులు ఎక్కడ దొరికాయి, నీకు ఇంత ప్రొద్దున్నే! .... ఎంత బాగున్నాయి, నీ దుస్తులు! ఈ చలిలోకూడా నీ అడయార్‌దుస్తులు మానలేదా!" అంటూ పువ్వులందుకొని, నాభుజంమీద తన కుడిచేతి నానించి ముందుకు నడువసాగారు ఆయన.

కంట్రోలర్ వెనుకనే స్టేషన్‌డైరెక్టరూ తదితర సిబ్బందీ వచ్చారు. తాను ఎక్కవలసిన కంపార్ట్‌మెంట్‌వద్దకుచేరి "ముందు పువ్వులను పదిల పరచి వస్తాను!" అంటూ లోనికివెళ్ళి గులాబీపువ్వులను సజ్జలో ఉంచివచ్చారు ఫీడ్లెన్. మళ్ళీ నాచెంతచేరి అన్నారు ఆయన."రైలు వెళ్లేవరకూ ఎందుకు ఉంటావు అనవ

సాగుతున్న యాత్ర

ఉద్యోగవిషయంలో మళ్ళీ మళ్ళీ అనుకుంటూనే ఉన్నాను రైలు ప్రయాణం అంతసేపూను. "ఎన్నివడుదుడుకులు! ఎన్నివడుదుడుకులు!! ఘుమ ఘుమలాడుతూ కొమ్మను ఎంత అందముగా వున్నదీ సంపెంగపువ్వు! అందుకో బోతే మాత్రము దూరమవుతుంది! ఇంతేనా జీవితమంతా! జీవితమంతా ఇంతేనా? ఎన్నాళ్లో ఈవెర్రి అన్వేషణ! ఇట్టే చేయిచాచి అంది పుచ్చుకోవచ్చు పుష్పాన్ని అనుకుంటాము, ఆశతో చేయి చాస్తాము—మంత్రించిన పువ్వులా పుష్పము పైకి పైకి ఎగసిపోతుంది. పోనీ! ఈ పుష్పము మనకోసముకాదు అని నిరాశచేసు కోనూలేము. ఆశించాలి, తప్పదు. ఆశించి ప్రయత్నించాలి, తప్పదు. అదే జీవితము: ఆశ, ప్రయత్నము; నిరాశా ప్రయత్నమూ మళ్లా ఆశా! ఇల్లాగే మరి. ఇంతకీ మనజీవితంలో మన ప్రయత్నమెంత—అదృష్టమెంత? అదృష్టమున్నా మన ప్రయత్నము తప్పేదేమో!....చివరకు భవభూతి అంతటి అనుభవముతో అనినదే నిజమేమో:

సలిలము జొచ్చినం గనక
శైలము జేరిన వైరి వీకులం
గెలిచిన రాజసేవ దిలకించిన
వేదము లభ్యసించినం
గళల తెరంగెరింగిన ఖగత్వము
దాల్చిన గర్మ నిష్కృతా
కలన నభావ్యమైన పనిగాదు,
వినాశము లేదు భావికిన్!

వినాశములేదు భావికిన్! ఎంతనిజము!

పదిలంగా పవ్వళింపజేస్తారు. క్షణంలో, నిద్రపోతుంది సీత. అల్లా, రాముని వక్ష స్థలాన తలపెట్టుకొని, అట్టే నిద్రపోతుంది. అపుడు రాములవారు అనుకునే మాటలు :

"ఈమె నా ఇంటి మహాలక్ష్మి! నా కన్నులకు అమృతమువంటిది. మంచిగంధపు మైపూతకంటేకూడా చల్లగా, ఎంత హాయిగా ఉన్నదీ ఈమె స్పర్శ! మంచిముత్యాల హారంలా ఎంత అందముగా కవుగిలించుకున్నదీ, ఈమెచెయ్యి, నామెడను! .... సీత! నా సీత!! ఎంతప్రియతమైనదీ సీత!! ఎంతప్రియత మైనది!! ఈమెలో ప్రియముకాని అంశమేది! అంతా, అంతా, ప్రియమైనదే — ఒక్క ఆమె వియోగము తప్ప!!" అని.

— ఆ క్షణమే వస్తాడు, దుర్ముఖుడు; వెంటనే కలుగుతుంది, వారికి వియోగము. అదే భవభూతి నాటక ప్రతిభ.

కాని, ఎంతగొప్పగా వర్ణించాడు, భవభూతి, వారిద్దరి గొప్పప్రేమా!.... అంతకు కొంచముముందే, సీతాఅమ్మవారి ప్రియవచనములు వింటూ, శ్రీరాములు అంటారు :

మ్లానస్య జీవకుసుమస్య వికాసనాని
సన్తర్పణాని సకలేన్ద్రియ మోహనాని
ఏతాని తాని వదనాని సరోరుహాక్ష్యాః
కర్ణామృతాని మనసశ్చ రసాయనాని.

"ఎంతప్రియముగా మాట్లాడుతున్నావు, సీతా! నీ మాటలలో ఎంత హాయి ఉన్నదీ! పూర్వవియోగ గాథల జ్ఞాపకంవల్ల వాడిపోయిన నా జీవితపు ప్రసూనాలు చల్లని హిమబిందువులు తాకినంతనే వికసించే కొండపువ్వులులాగ క్రొత్తప్రాణంతో వికసిస్తున్నాయి. ఇంతవరకూ మగతగమ్మి నిద్రాణులై ఉన్న ఇంద్రియాలకు నవచైతన్యమును కలిగిస్తున్నవి, నీ ప్రియవచనాలు. నా చెవుల

ఎంతో నిజాయితీ ఉండవచ్చు; కొండంత మంచితనమున్నా. విశ్వప్రపంచాన్నీ కవుగిటిలో బంధించుకోవాలి అనే వెర్రి ఆప్యాయమూ ఉండవచ్చును. కాని, అవన్నీ వేరూ, ప్రయోజకునికి ఉండే లక్షణాలు వేరూ!

ఏమైతే నేమి— ఒంటరిగా నేను ఢిల్లీ వెళ్లాను. ఒంటరిగానే ఉంటూ, ఉద్యోగప్రయత్నము చేశాను. ఆ ఉద్యోగప్రయత్నపు పరిణామమును గురించే ఇప్పుడు మద్రాస్‌కు వచ్చినది. ఒంటరిగా; ఇల్లూలేదూ; వాకిలీ లేదూ.

మద్రాస్‌లో నాకు చాలా స్నేహితులైన శాస్త్రిగారింటికి వచ్చాను, చనువుగల అతిథిగా. అంతకుముందు, నా ఇన్సూరెన్స్ ఉద్యోగము ఫెళ్ళుమని వెలిగే రోజులలో, మద్రాస్ వచ్చినప్పుడల్లా, వీరి ఇంటనే, తరుచు బసచేస్తూండే వాడను. వారు చాలా స్నేహప్రియులు, భార్యా భర్తాకూడా. నిత్యమూ వారింటికి వస్తూండేవారు, ఎందరో స్నేహితులు— దంపతీయుతంగా. ఈ, వారి స్నేహితు లున్నూ నన్ను తమ స్నేహితునిగా భావించి, చాలా ఆదరించేవారు. ఎంతో కలసి మెలసి ఉండేవారము, ఒక జట్టుగా. కాని, ఎక్కడకు వెళ్ళినా పాదచారులమై వెళ్లేవారముకాము. మా బృందము ఒక ఏడెనమండుగురకూ మూడుకార్లు ఉండేవి, నాకారుతోసహా. సాయంత్రమైతేసరి, కార్ షికార్లు, సముద్రతీరమువైపు ఎంతో ముచ్చటగా ఉండేది. వెన్నెలరాత్రులు ఇక చెప్పనే అక్కరలేదు. సముద్రపు కెరటాలపైన కరుగబోసిన వెండి, బంగారులా వెన్నెల మెరుస్తూఉండగా చూచి ఆనందిస్తూ, వెన్నెల భోజనము! ఒక్కొక్క పర్యాయము, ఒక్కొక్క ఇంటివారు ఏర్పాటుచేసేవారు. అప్పుడప్పుడు, ఈ ఉల్లాస సమావేశాలలో, ఇప్పుడు లోక ప్రఖ్యాతిగడించిన, అద్భుత గాయకి సుబ్బులక్ష్మి,ఆమె భర్త సదాశివమూ పాల్గొంటూ ఉండేవారు. మూర్తీభవించిన సౌజన్యరాశి ఆమె, తన మృదువచనాలతో ఎంతో ఆదరించేవారు. ఆమెలా కాకపోయినా, అంతో ఇంతో, పాడగల ఇల్లాండ్రు ఉండే వారు మా బృందములో. వారిని ఎలా ఎలాగో లాలించి, వారిచేత పాడించేవారు, సుబ్బులక్ష్మి. తానూ గానముచేసేవారు - ఆ సముద్రపు ఒడ్డున, చంద్రుడే తన ఆకాశప్రయాణాన్ని రవంతసేపు ఆపి, చెవియొగ్గి వినేటంతహాయిగా!

"ఖాసా—సాకా", "సాకా—ఖాసా" అని రెండు మూడుసార్లు వల్లించి "భేష్! నాకు నచ్చింది ఈ పేరు!" అంటూ, ఆ సాయంత్రమే, ఆ మారుపేరుతోనే ఆ శీర్షికను ఉపక్రమించారు. నేను చేసిన నామకరణము స్థిరమైంది. ఇప్పటికీ, వారి "సైడ్ లైట్స్" ఆ పేరుతోనే వస్తున్నాయి. ఒక కొన్ని ఏళ్ళవి, ఒక పుస్తకంగా కూడా కూర్చబడి శాశ్వతరూపమును దాల్చినవి.

ఖాసావారి "సైడ్‌లైట్స్" ప్రసరించినది, తొలుదొల్త నా మీదనే! "ఈ ఊరిలో ఒక ఆకుపచ్చని కార్ ఉన్నది. ఆ కార్ లక్షణము ఏమిటంటే: ఎంత వేగంగా వెడుతున్నాసరే, ఎదుట రోడ్‌మీద అందమైన చీర కనిపిస్తేచాలు,టక్కున ఆగిపోతుంది ఆ కార్!" అని ఒక విసురు విసిరారు. "ఆ కార్‌లో తరుచు మీరూ ఉంటూ ఉంటారని వ్రాయలేదేమి?" అన్నారు, ఆయనతో ఆ విమర్శ చదువుతూ, మాలో ఒకరు!!

మరొక పర్యాయం "ఈ ప్రేమించడం" అంటూ చలాకీగా వ్రాస్తూ, మరో విసురు విసిరారు, ఖాసా సుబ్బారావు. "మనలో కొందరికి ప్రేమించడము అనేది ఒక అలవాటైపోయింది! ఈ అలవాటు ఎంత తీవ్రంగా పరిణమించినదీ అంటే— వీరిలో హృదయము ఉండవలసినంత మేరా, గుచ్చుకుపోయిన బాణాలే ఉండిపోయాయి" అని వ్రాశారు.

మిక్కిలి ప్రీతిపాత్రుడు, ఖాసా సుబ్బారావు. ఎటువంటి పరిస్థితులలోనూ మంచితనాన్ని పాటిస్తారు, ఆయన. మంచితనమూ నిజాయితీ—ఈ రెండూ రెండు చక్షువులవంటివి ఆయనకు. నిజాయితీకోసము ఆయన, అవసరమైతే తనకు ఆప్తస్నేహితులనతగినవారినికూడా త్యజించకలిగిన శక్తికలవారు. ఈ నిజాయితీని గమనించే, ఆయనతో పూర్తిగా వైరుధ్యంకలవారున్నూ ఒక్కొక్కప్పుడు ఆయనవద్దకే వెళతూ ఉంటారు, ఆయన సలహాకోసము. ఆయన మాటకు, ఆయన ఆలోచనకు, అంతటి విలువను ఇస్తారు, ఆయనతో భేదాభిప్రాయముకలవారున్నూ.

ఆయన: "చూచావా, నీవు ఈ సమయంలో రావడము ఎంత మంచిదైనదో!" అని. ఐతే ఒకటి: ఇలా, నమ్మిన స్నేహితులవిమర్శకు ఎంతో విలువ నిస్తారే గాని, ప్రతివిషయంలోనూ, చిన్నవిషయమైనా సరే, పెద్దవిషయమైనా సరే, తుది నిర్ణయముమాత్రము వారిదే: ఆ నిర్ణయాన్ని బ్రహ్మరుద్రులు మార్చలేరు.

ఇంగ్లీష్‌లో ఒక ప్రజ్ఞానిధి అన్నారు: "తాను కట్టిన మహాసౌధము, ఉన్నట్టుండి, నేలమట్టముగా కూలిపోయినా, అందుబాటులోఉన్న ఆయుధ పరికరాలన్నీ పూర్తిగా అరిగిపోయిఉన్నా, మళ్ళా పునాదులు త్రవ్వి, మళ్ళా మొదటినుంచీ, ఇటుక ఇటుకగా పేర్చుకుంటూ వచ్చి, మళ్లా అంతటిదీ, అంతకంటేకూడా గొప్పదీ, ఐన మహాసౌధాన్ని తిరిగి నిర్మింపకలవాడే మనిషి!!" అని. ఖాసా సుబ్బారావు అటువంటి మనిషి.

* * * *

ఇంక పదిరోజులకు మా సెలెక్షన్ అనగా, నేను క్రొత్తగా రేడియో కేంద్రము ఏర్పాటుగానున్న భవనానికి వెళ్లాను. చిత్రం! ఒక ఆరేళ్ళక్రితము నేను మోటార్‌కార్ కొనుక్కోబోతూ, డ్రైవింగ్ నేర్చుకుని లైసెన్స్ తీసుకున్న పోలీస్‌కమీషనర్ ఆఫీస్ ఉండిఉన్న భవనమే ఇది. ఆ మాటే అన్నానుకూడా, క్రొత్తనిలయానికి డైరెక్టర్‌గా వచ్చిన ఆయనతో. ఆయన నవ్వుతూ అన్నారు: "ఈ పనిన్నీ ఒక మోస్తరుగా శక్తివంతమైన వాహనాన్ని నడుపడమే—ఎటొచ్చీ, కార్ డ్రైవింగ్‌లో ఎంతో కొంత విరామముంటుంది. ఈ ప్రాపకంలో నిమిషం విరామం ఉండదు, సుమా!" అని. వెంటనే ఆయన నన్ను లక్షపనులకు నియోగించారు. సంతోషముతో పూనుకున్నాను నేను, ఆయన నియమించిన పనులన్నీ నిర్వహించడానికి. ఆ నిమిషం ఆయనా సందేహించలేదు, నేనూ సందేహించలేదు, నా సెలక్షన్ పర్యవసానం ఏమవుతుందో అని—నేను సెలక్షన్‌లో ఆరితేరినట్టే భావించాము ఇద్దరమూను,మాలో మేము.

సెలక్షన్‌రోజు చాలా హడావిడిగా వుంది. ఢిల్లీనుండి కంట్రోలర్ ఆఫ్ బ్రాడ్‌కాస్టింగ్, లయొనెల్ ఫీల్డెనూ, బొంబాయినుంచి కేంద్ర నియంతా వచ్చారు.

చెప్పాను—నాకు తోచినది, ఎంతో ఉత్సాహంతో ఉద్రేకంతో. మనప్రాంతపు సంస్కృతినీ, మన సాహిత్యసంపదనూ, విలువ గణింపరాని మన సంగీతసంపదనూ అందరకూ ఏ ఏ విధాల అందుబాటులోకి తేవాలో. ఆకాశాన్ని అంటే నా ఆదర్శాలు వారిలో కొందరికి ఆశ్చర్యం కలిగించినవి.

తరువాత, ఒకరిద్దరు సభ్యులు కొన్నిప్రశ్నలు వేశారు, తగిన సమాధానాలే చెప్పాను. ఒక్క విషయంలో మాత్రము పొరపాటు చెప్పాను: ముత్తుస్వామి దీక్షితులవారినిగురించి సరిగా చెప్పలేకపోయాను.

నా ఇంటర్‌వ్యూ పూర్తై, నేను ఇవతలకు వచ్చివేశాక, తరువాతఅభ్యర్థిని పిలిచేలోపుగా, నేనే, మళ్లా లోనికి వెళ్ళవలసివచ్చింది, అత్యవసరమైన ఆఫీస్ పనిమీద. అప్పుడు అధ్యక్షులైన ఫీల్డెన్‌తో కస్తూరి శ్రీనివాసన్ అంటున్నారు ఉత్సాహంతో, నన్నుగురించే, "వెరిగుడ్ ! వెరిగుడ్ !!" అంటూ. ఇతర సభ్యులున్నూ వారిఅభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు. ఆ నిమిషాన అకస్మాత్తుగా అక్కడ అవతరించిన నన్ను చూచి ఫీల్డెన్ ఎంతో కుతూహలంతో చిరునవ్వు నవ్వారు. తొలుదొల్త ఆయన ఒక్కరూ చేసిన సెలక్షన్‌ను వీరందరూ ఇంతగా ఆమోదించడము ఆయనకు సంతోషకారణమైనదని నేను భావించాను, ఆ చిరునవ్వు చూచి.

....ఈమధ్యనే, పూజ్యులు కస్తూరి శ్రీనివాసన్ ఇహలోకాన్ని విడిచి వెళ్ళడానికి కొన్నినెలలు ముందు, నేను వారిని దర్శించడము తటస్థించింది. నాకు బాల్యస్నేహితుడూ, చిరకాలమిత్రుడూ ఐన డాక్టర్ షెల్వాంకర్, లండన్‌లో హిందూపత్రికా ప్రత్యేకవిలేఖరిగా ఉంటూ, సెలవుమీద స్వదేశానికి వచ్చినపుడు నన్ను కలసికొని, నన్ను కస్తూరి శ్రీనివాసన్‌వద్దకు తీసుకువెళ్లాడు తనతోకూడా. నన్ను వారికి పరిచయం చేయడముతోనే నేనన్నాను: "నాకు రేడియో ఉద్యోగము ఇప్పించినది మీరేనండి !" అని.

"అలాగా ! నాకు జ్ఞాపకంలేదు....ఎప్పటిమాటో ! అవును: అప్పుడు నేను ఫీల్డెన్‌తో సెలక్షన్‌కమిటీలో ఉన్నాను కదూ !" అన్నారు. అప్పుడు నేను

మయ్యేవి కావు. ఇందుకు కారణము, మా ముగ్గురి ప్రధానఆశయమూ ఒకటే అగుట. బహుముఖమైన ఆంధ్రసంస్కృతిని ఇంటింటా వ్యాపింపజేయాలి అనీ, విశ్వప్రయత్నముచేసి ఐనా, రేడియోవిధానముద్వారా, జనులలోని అజ్ఞానాన్ని తొలగించి, ప్రాజ్ఞులుచేస్తూన్న సత్యాన్వేషణ, సౌందర్యాన్వేషణ, సౌభాగ్యాన్వేషణ అనే త్రివర్గమైన మహాకృషిలో ఉడుతాభక్తితో మేమున్నూ తోడ్పడాలి అనే, మా ముగ్గురి ఆశయమున్నూ.

మా ఇన్నేళ్ళకృషి, ఈ త్రివర్గాన్వేషణకే అంకితమైనది.

మాధవశర్మను చూస్తే మాత్రము అతను ఇంతగా ప్రేమను గురించిన యాతనను అనుభవించే మనిషి అనిపించదు. అటువంటివారిలో సాధారణంగా, కనిపిస్తుంది, ఒకమోస్తరు అతిసుకుమారత్వము. మాధవశర్మలో ఆ నిస్పృహా యతా, ఆ అలసత్వమూ, దేనికోసమో వెతుక్కుంటూన్నట్టు కనిపించే బెంగా చూడము, మనము. అతనిలో, ధీరత్వముతోపాటు ఒక గొప్ప నిజాయితీ భావము కనిపిస్తుంది నాకు. నాకులేని, ఎన్నడూ నేనుఅందుకోలేని, మనోధైర్యాన్ని అతను ఇదివరకే సాధించాడు అనిపించేది, ఆరోజులలో నేను అతనిని చూచి నప్పుడల్లా.

కాని, వట్టి ప్రేమికునిగా నేను చెప్పాలనుకుని, ఆరాటపడుతూన్న భావా లనే, ఎంత అందంగా, ఎంత సూటిగా, ఎన్నడూ మరువరానివిధంగా, ఎంతటి ఉదాత్తను కలిగిస్తూ అనగలుగుతున్నాడు, కవిగా, మాధవశర్మ:

ఆ పతనాతిమోహనము, ఆ సుకుమార
కరమ్మె నీదె! ని
ద్రాపరతంత్ర మీాతనువు స్పర్శసుఖజ్ఞము
గుర్తు పట్టె! నా
లోపలి చూపులోపల వెలుంగు స్వరూపము
నీవ సుమ్మె నీ
రూపముగాని రూపము నెరుంగను
స్వప్నములందు సైతమున్.

"నాలోపలి చూపులోపల వెలుంగు స్వరూపము నీవసుమ్మె, నీ రూపముగాని రూపము నెరుంగను స్వప్నములందు సైతమున్"—అంటూ, నాలో నేను మననముచేసుకుంటూ, నేను అనుకునేవాణ్ణి 'ఆమె' తప్పకుండా ఈ మాటలు నామాటలుగా, వింటుంది కదా!" అని!!

సాగుతున్న యాత్ర

రేడియోకేంద్ర కార్యక్రమాలు ప్రారంభించడానికి ఇంకా నాలుగునెలలున్నా ఊపిరి సలుపకుండా పనిచేయవలసివచ్చేది. ప్రసంగాలు ఏర్పాటు చెయ్యాలి. నాటకాలనూ నాటికలను సమకూర్చాలి. తెలుగులో మంచి నాటకాలూ నాటికలు బహుతక్కువ. క్రొత్తవి, రేడియో ప్రసారానికి అనుకూలమైనవి వ్రాయాలి, వ్రాయించాలి. ఒక నాలుగునెలల తర్వాత ప్రసారము కానున్న కార్యక్రమం గురించి వ్యక్తులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలి. మాట్లాడ కలిగినా, మాట్లాడడానికి ఆసక్తిలేనివారిని ఎలాగో అలా ఒప్పించి, వారివద్దనుంచి మాట్లాడేందుకు అనుమతించినట్లు ఉత్తరం తెప్పించాలి. ఆఫీస్‌లో నిరంతరం, టెలిఫోన్‌లో ఎవరితోనో, రాగల కార్యక్రమాలను గురించి మాట్లాడుతూనే ఉండాలి. ఒక్కొక్కప్పుడు, విచిత్రమైన అనుభవాలు కలుగుతూండేవి.

ఒకసారి టెలిఫోన్ తీసి మద్రాస్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మార్ష్ బాంక్స్‌ను పిలిచాను, నేను. నేను ఫలానా అని చెప్పి, "షేక్స్పియర్ నాయకులలో ఉత్తమనాయకునిగురించి ఒక పదిహేను నిమిషాలు ప్రసంగిస్తారా, రాగల జులై 14వ తేదీన" అని అడిగాను, నేను. "ఏమిటి—ఎవరు మాట్లాడేదీ?" అని మార్ష్ బాంక్స్ అడిగారు నన్ను, ఆశ్చర్యపడుతూ, నేను ఏదో తప్పుపని చేసాను అనే భావముకలిగిస్తూ. నేను మళ్లా వివరించాను నా ప్రశ్నను. మార్ష్‌బాంక్స్ అన్నారు, అప్పుడు: "ఇలా టెలిఫోన్‌ద్వారా ఆహ్వానించడము క్రొత్తపద్ధతే! నాకు అలా టెలిఫోనుఆహ్వానాలు అలవాటులేదు!!" అని, కాస్త రోషంగానే. ఆయన రిసీవర్ పెట్టివేయబోతున్నారు. నేను చప్పున అన్నాను: "క్షమించండి, ఒక్క నిమిషం. ఇది ఆహ్వానం కాదు. మద్రాస్‌లో క్రొత్తగా రేడియో కేంద్రము నెలకొల్పుతున్నామని మీకు తెలుసు అనుకుంటాను. ఆ ప్రసారాలలో జరుగనున్న ఇంగ్లీష్ ప్రసంగాలనుగురించి ముందుగా ఏర్పాటుచేసే పని నాకు ఒప్పగించారు. మీకు షేక్స్పియర్ నాటకాలంటే చాలా ఆసక్తి అనీ, ఆవిషయంలో మీరు కొంత పరిశోధనకూడా చేశారనీ, మిత్రులద్వారా విన్నాను. అందుచేత, ఇలా మీతో టెలిఫోన్‌లో మాట్లాడడానికి సాహసించాను. మీరు చాలా ముఖ్యమైన పనిలో ఉన్నారని తెలుసు. కాని, నాకు కొన్ని నిమిషాలు అవకాశమిస్తే, స్వయంగా మీవద్దకు వచ్చి ఈ విషయంగురించి ప్రస్తావిస్తాను," అన్నాను.

నన్ను చాలా ఆదరించేవారు. బేజ్‌లీ మంచి అనుభవజ్ఞుడు. ఆయనతో సంభాషణ వల్ల ఇదివరకు నాకు ఏమీ తెలియని మనదేశపరిపాలనలోని విశేషాలు ఎన్నో తెలుసుకోకలిగాను, నేను.

ఇతరులతో టెలిఫోన్‌లో మాట్లాడుతూంటే, కొన్ని కొన్ని మర్యాదలను తప్పక పాటింపమంటూ ఉండేవారు మా డైరెక్టర్. "ఈ రేడియో సంస్థ గవర్నమెంట్ ఆఫ్ ఇండియావారిది. కనుక మీరు ఎవరిని టెలిఫోన్‌లో పిలచినా, "గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా రేడియో, మద్రాస్ కేంద్రము నుంచి, ఫలానావారు మాట్లాడుతూంట, అని, ప్రారంభించాలి" అన్నారు. ఆప్రకారమే నేను ఒకసారి, శాసనసభ్యునిగా మద్రాస్‌కు వచ్చిఉన్న శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావును టెలిఫోన్‌లో పిలిచాను. నా పిలుపు విని ఆయన అన్నారు: "అబ్బో! చాలా ఉన్నదే!!....ఒక్కక్షణం ఉండు" అంటూ, రిసీవర్ చెంతనే ఉన్న మరి ఒకరికి ఇచ్చినట్లు చప్పుడైంది. ఆ మరిఒకరు, సన్నని కంఠస్వరంతో అన్నారు:

"ఎవరూ మాట్లాడేది?" అని. నేను మళ్లా, ఆర్భాటంతో నాకితాబులతో సహా నాపేరు చెప్పేసరికి, అవతలగొంతువారు ఫక్కున నవ్వి "నేను కమలాదేవిని, కాళేశ్వరరావుగారు, నీ పటాటోపం విని నవ్వుతున్నారు" అని, మళ్ళా, ఎంతో ఆదరణతో "ఎలా ఉన్నావు? నన్ను చూడడానికి ఎప్పుడు వస్తావు?" అంటూ అడిగారు. నేను వెంటనే వెళ్ళి వారిద్దరినీ చూచాను.

కమలాదేవి చటోపాధ్యాయను చూచివచ్చిన కొంతసేపటికి మిత్రుడు గూడవల్లి రామబ్రహ్మం నన్ను చూడడానికి వచ్చారు. నేనంటే ఆయనకు ప్రాణము. నాకూ వారంటే చాలా ఇష్టము. రేడియో ఆఫీస్‌లో కొంచెముసేపు ఉండి, నేను ఆఫీస్‌పని ముగించుకున్నాక, నన్ను తన కార్‌లో ఎక్కించుకొని బీచ్‌కు తీసుకువెళ్లారు. సముద్రపుటొడ్డున విశ్రమించి మాట్లాడుకుంటూ ఉండగా, ఆయన నన్ను చూస్తూ అన్నారు: "నీవద్దకు ఒక ముఖ్యమైన పనిమీద వచ్చాను, చేసిపెడతావా?" అని. నేను వెంటనే అన్నాను, అవశ్యం చేస్తానని. "ఎల్లుండి మా "మాలపిల్ల" సినీమా శతదినోత్సవము. ఫలానా థియేటర్‌లో గొప్పగా

"ఇల్లాగే ప్రేమసీమలో ఏదో అందరానిదానికోసము ఆరాటపడతావు నీవు, ఇల్లాగే ఈ సినీమా సీమలో ఏదో అందరానిదానికోసము ఆరాటపడతాను నేను. మన ఇద్దరికీ ఈ ఆరాటము తప్పదు కాబోలు!" అని.

కాని, అతనుతీసిన "మాలపిల్ల" ఆరోజులలో, ఉత్తమతరగతికి చెందిన చిత్రమే అని చెప్పాలి. శతదినోత్సవసభకు అధ్యక్షతవహించిన కమలాదేవి చటోపాధ్యాయకూడా ఆమాటే అన్నారు:

"ఈ చిత్రపు ఇతివృత్తము నాకు చాల ఇష్టమైనది. ఇటువంటి ఉత్తమ చిత్రాలద్వారా అత్యవసరమైన సంఘసంస్కరణ చేకూరగలదని ఆశిస్తున్నాను. ఇందు నటించిన కాంచనమాల, డాక్టర్ గోవిందరాజుల సుబ్బారావు తమ పాత్రలను చాలా చక్కగా పోషించారు. వారికిన్నీ చెలికత్తెగా నటించి, తన తీయని కంఠస్వరంతో మన కందరికీ ఎంతో ఆనందాన్నిగూర్చిన సుందరమ్మకూ నా అభివందనము. శ్రీ గూడవల్లి రామబ్రహ్మంగారి యత్నము ఎంతో విజయవంతమైనది!" అన్నారు ఆమె.

ఇంటికి వస్తూ సభవారు తన కంఠసీమ నలంకరించిన మనిషంత గులాబీ పూమాలను నాచేతికిస్తూ, కమలాదేవి అన్నారు: "నేను రాజకీయరంగులలోనో, ఏ సంఘసంస్కరణ ఉద్యమంలోనో మునిగితేలుతూ ఉంటాను. నా కెందుకీ దండ! నీవు నిత్యకవివి. ఈ దండ నీదగ్గరే ఉండాలి!!" అని బలవంతంచేసి, దండను నా కిచ్చారు, వారు వెళ్ళిపోయారు........

హోటల్‌లో నా గదిలో బల్లపైన ఆ గులాబీదండ ఉంచి, ఇలా పడక కుర్చీలో విశ్రమిస్తూ నేను మళ్లా ఒకసారి జ్ఞాపకంచేసుకున్నాను, ఆ పువ్వులకేసి అలాగే చూస్తూ, ఎప్పటిదో నా పూర్వజన్మ వృత్తాంతాన్ని స్మృతిపథానికి తెచ్చుకుంటూ. మళ్ళా ఒకసారి, పాటిబండ మాధవశర్మ, కవిగా, నా హృదయానికి మాటలను సమకూర్చారు.

౫

నీ మురళీరవమ్ము విని నీ కడకున్
జనుదెంచి చూతునా
స్వామి! యిదేమి నాగళము సన్నవడెన్
చెమరించె దేహమున్
సామి వినిర్గతాశ్రువులు జాలయి పారెను
ఫుల్లగల్లమున్
హ్రీమధురమ్ముగా పులకరించినదీ
మృదుమాలతీ గతిన్
స్వామి! పునః పునారచిత చంద్రకచారు
పురః ప్రసారముల్
నా మనమున్ హరించె పరిణద్ధకలాపి
కలాపకైశిక
శ్రీ మహనీయతల్ సతుల లే యెదలన్
హరియించుటల్వినా
ఏమిఘటించు నీకు కికురించుట
నీపని యయ్యోనే ప్రభూ!

"సంపత్"

నేనేగనుక యువకవినైతే, నాయెడనే గనుక సరస్వతీదేవి ప్రసన్నురాలయితే, నేను వాణిని అర్థించేది: ఎప్పటికీ, నా కవితలో నిత్యయవ్వనము స్ఫురించాలనీ, నా మాటలో నిత్యవసంతము ప్రతిబింబించాలనీ. ఇరవై యేళ్ళక్రితము, "సంపత్" అనే, శ్రీ రాఘవాచారి కవిత, ఇది. మరి ఇప్పుడూ ఇలా పద్యము

తీరిచి ముగ్గువెట్టి నవనీతలమున్
మలుపచ్చి ముత్యపున్
పేరుల నందగించె రజనీరమణీకచ
సక్తసూసక
శ్రీ రమణీయమై వొలిచె శీతమయూఖుడు
షోడశాంశుడై!

కాని, ఆ సందర్భములో రాధ కొంత తొట్రుపాటుతో, వెలిబుచ్చే భయాన్నిమాత్రము నేను పూర్తిగా ఆమోదింపలేకపోయాను. ఇంత ఆత్మవిశ్వాసము లేని ప్రేయసా, రాధ, అనిపించింది, నాకు—చెప్పొద్దూ!!

వలపులు మున్మురించు రసవన్నవ
హృచ్చషకమ్ము నీకునై
నింపితి, త్రావిపొమ్ము నవనీతదయా
గుణశాలి! ఆవలన్
వలచిన నుండునో మరి రవంతయు
నుండక యెండిపోవునో
మొలచిన కూర్మి కన్ను గవ మూసిన
నేమగునో జగత్ప్రభూ!!

వట్టి బేల రాధ, నిజమే. కాని, అంతటి నిస్పృహ అవసరములేదేమో! యుగయుగాలుగా నిలచి, శాశ్వతమైన రాధికా ప్రేమ కాస్త ఆలస్యాన్ని సైరింప లేదూ?— అనుకున్నాను, నేను.... కాని, "నవనీత దయా గుణశాలి"— ఎంత బాగున్నదీ మాట!

ఐతే, ఇలా సాహిత్య మీమాంసలో పడి ఉండిపోడానికి అవకాశము లేదు అవతల; "యెల్లి స్వయం వరంబు" అన్నంత హడావుడిగా పనులు జరిగి

మనవారికి క్రొత్త. అందువలన, వచ్చిన వ్యాసాలకు చాల మెరుగుపెట్టవలసి ఉండేది. విషయంకూడా ఏమాత్రం లోపంలేకుండా ఉండాలి. విషయపరిశీలనకు ఇదివరకు నేను చదువుకున్న చదువు నాకు చాలా ఉపకరించినది. ప్రసంగాలలో కొన్ని ఆర్థిక విషయాలను గురించి, కొన్ని రాజకీయ శాస్త్రవిషయాలను గురించి కొన్ని భౌతిక, రసాయన శాస్త్రాలను గురించి, కొన్ని సాహిత్యమును గురించి, కొన్ని నిత్యజీవితపు సమస్యలను గురించి వీనిని అన్నిటినీ పరిశీలించి ప్రసారానికి అనువుగా తయారుచేయడానికి కావలసిన జ్ఞానమూ ఇంతో అంతో అనుభవమూ నేను అడయార్‌లోను విజయనగరములోనూ బెంగుళూరులోనూ సంపాదించు కున్నాను. అందుకు తోడుగా, ఎన్నో పుస్తకాలూ ఎన్నో పత్రికలూ శ్రద్ధతో చదు వడమున్నూ అలవాటైనది. ప్రాజ్ఞులతోటి సహవాసమున్నూ చాలా చాలా సాయ పడినది.

ప్రసంగములు చెప్పేవారు ఆయా విషయాలలో నిపుణులు అనతగిన వారే. కాని, వారున్నూ ఏదో విషయంగురించి చెప్పవలసినంత విశదంగానూ, ప్రస్ఫుటంగానూ ప్రస్తావించి ఉండకపోతే ఆ సంగతి వారికి చెప్పి, కావలసిన మార్పులు చేయించాలి—వేలాది జనము వారి ప్రసంగమును వింటారు కాబట్టి, ఈ పని చాలా బాధ్యతగల పని. ప్రసంగములో తీవ్రమైన వాదానికి అవకాశమిచ్చే అభిప్రాయము ఉండరాదు— వెంటనే ఆ అభిప్రాయాన్నిగురించి వ్యతిరేక అభి ప్రాయమును తెలియజేసే అవకాశము లేదుకాబట్టి. చర్చలు వేరే ఉంటవి: ఒక విషయాన్నిగురించి విభిన్న అభిప్రాయాలను వ్యక్తపరచేందుకు ఒకానొక ప్రసంగ ములో అతి తీవ్రమైన వివాదాంశము ఉంచరాదు. ఇందుకు, ముందు జాగ్రత్త అవసరము. ఇదిన్నీ చాలా బాధ్యతగల పని. తెలివీ ఉండాలి. నేర్పూ ఉండాలి. హేమాహేమీలను తప్పుపట్టడం సాహసముకాదూ, మరి!

ఒక పర్యాయము, ఈ పనిలో నాకు ఒక వింత అనుభవము కలిగింది. మహనీయులు శ్రీ వి. ఎస్. శ్రీనివాసశాస్త్రి ప్రసంగము ఒకటి యేర్పాటుచేశాము— "నేటి మన విద్యావిధానము"ను గురించి. అప్పుడు పూనాలో ఉంటూన్న ఆయన ఏకారణమువలన ఐనా తాను స్వయంగా రాజాలకపోతే తన ప్రసంగపు

గారితో ఇలా అన్నాను:"ఇది ఏమంత పెద్ద మార్పుగాదు. బాగా ఆలోచించి సూచించినదే ఈ సవరణ. దయచేసి, మీరు అంగీకరించాలి. ఈ విషయమునుగురించి శ్రీ శాస్త్రిగారికి వ్రాసి, వారి అనుమతిని పొందడానికి వ్యవధిలేదు. మార్పులేనిదే ప్రసారానికి వీలుపడదు. ఇంతమాత్రంచేత లక్షలాది జనానికి ఆశాభంగముకలుగజేయరాదు, మీరు" అన్నాను. ఆయన కొంతసేపు ఆలోచించి అన్నారు: "శ్రీ శాస్త్రిగారి రచనను దిద్దడానికి కావలసిన అర్హత నాలోలేదు. నీ బాధ్యతపైన నీవు ఆ సవరణచేస్తే చెయ్యి—పూర్తిగా నీ బాధ్యతపైననే సుమా!", అని. నేను "సరే! నా బాధ్యతపైననే ఈ చిన్న సవరణచేస్తున్నాను—మీతో చెప్పి మరీ చేస్తున్నాను!" అన్నాను. ఆ సవరణతోనే ప్రసంగము ప్రసారమైనది.

తర్వాత కొంతకాలానికి శ్రీ శాస్త్రిగారిని ముఖాముఖి సందర్శించినప్పుడు ఈ సంగతి వారికి మనవిచేశాను కాస్త జంకుతూనే. వారన్నారు:"నేనూ మార్పును గమనించాను. మంచిపని చేశావు. ప్రస్తుత పరిస్థితులలో ఆ సవరణ అవసరమే. బహిరంగసభలో ఉపన్యసిస్తూ మన నిశ్చితాభిప్రాయాలను వ్యక్తపరచడము వేరూ. రేడియో ప్రసంగము వేరూ. మంచిపని చేశావు!" అన్నారు.

తరువాత, తరువాత, శ్రీ శ్రీనివాసశాస్త్రిగారిచేత ఇంకా కొన్ని ప్రసంగాలు ప్రసారము చేయించాను నేను. వయోవృద్ధులైనా, ఎంతటివోపిక, వారికి! ఎంతటి శ్రద్ధ! ఒక అక్షరము తప్పుదొర్లదు. ఒక్క కామా లోపించదు.

శ్రీ శ్రీనివాసశాస్త్రికి శ్రీరాముడు అభిమాన వ్యక్తి. రామాయణమునందలి కొన్ని విశేషాలను గురించీ "పురుషోత్తముడై"న శ్రీరామచంద్రుని గురించీ అద్భుతమైన ప్రసంగాలు చేశారు, వారు. ఈ వారి రేడియో ప్రసంగాలు ప్రఖ్యాతిగాంచినవి, తదుపరి. ఇవి ప్రసారమయే సందర్భములో నేను శ్రీ శాస్త్రిని పువ్వులలో పెట్టినంత భద్రంగా తీసుకువచ్చేవాడను, నా కార్‌లో, రేడియో స్టేషన్‌కు. ప్రసంగము పూర్తి ఐనాక, పదిలముగా ఇంటికి తీసుకువెళ్ళేవాడను. అప్పుడు వారు నన్ను తమతో సమానునిగా భావించి జరిపే ఇష్టాగోష్ఠి ఎంతో హృద్యంగానూ ఎంతో జ్ఞానదాయకంగానూ ఉండేది. భీష్మాచార్యులతోటి సహవాసంలా ఉండేది, వారితో ఉన్నంతసేపూను.

సాగుతున్న యాత్ర

మేము ఉన్నంతసేపూ నిలబడే ఉండిపోయింది కాంచనమాల. ఇది నా అలవాటుకు విరుద్ధము. ఎదుట ఉన్న కుర్చీలో కూర్చోమని చాలా బలవంతము చేశాను. ఆమె కూర్చోలేదు. అడిగిన మాటలకు సమాధానమూ చెప్పదు. ఎంత సేపూ ఆ లేడిచూపులే!

"రేడియోవారు ప్రసారము చెయ్యబోయే మొదటి నాటకము, ఈ అనార్కలీ. ఇందు ప్రధాన పాత్ర మీరు చక్కగా ఒప్పించగలరనే విశ్వాసమున్నది మాకు!" అంటాను, నేను.

కాంచనమాల ఊరికే నాకేసి చూస్తుంది. ఒకసారి నావైపు, ఒకసారి శేషాచారివైపు; మరీ మరీ, ఎదుట కూర్చున్న తన భర్తవైపు-ఆ బెదరిన లేడి చూపులతోనే.

కొంతసేపటికి ఆమె భర్త అన్నారు: "మీ స్నేహితులు శ్రీ గూడవల్లి రామబ్రహ్మంగారున్నూ మరీ మరీ చెప్పారు. ఈమెకు మాత్రము, ధైర్యము చాలడములేదు. నేనూ చాలా ప్రయత్నించాను. చూద్దాము. ఏమాత్రము వీలున్నా.... నేను మీకు మళ్ళా కనిపిస్తాను" అన్నారు.

కాని, మా అనార్కలీ నాటకములో కాంచనమాల నటించలేదు.

....చిత్రము, ఈ సినిమా జగత్తు! వెండితెరపైన ఒక్క మెరుపుమెరిసి అలా మాయమయిపోయింది ఆమె, మెరుపులాగే! ఎంత చక్కగా అలంకరించినది, నటించినన్నాళ్ళూ, ఆనాటి మన చిత్రాలను, కాంచనమాల! ఆమెకు ఆమే సాటి !!

కాలప్రవాహంలో జారిపడిపోయిన కొన్ని అమూల్యములైన వస్తువులలో ఒకటి, కాంచనమాల నటనా వైదగ్ధ్యము.

ఆ రోజులలో హిందీ సినిమాలలో చాలా ఆకర్షవంతముగా నటించేది సబితాదేవి. ఆమె నటనా చమత్కృతిన్నీ నాకు చాలా ఇష్టము. ఆమె కన్నుల

సాగుతున్న యాత్ర

మేనిని సోకినన్ వలపు మెత్తని
నాయెద పుల్కరించి యే
వో నవగీతులల్లుకొనబోయిన
స్వాప్నిక సౌఖ్యరేఖలో
తేనెలకోసమై వలపు తెట్టువ
గట్టును లేతవెన్నెలన్

అది, కవి ప్రకృతిలో కలిసిపోయే వర్ణన. ఇక వ్యక్తిగతమైన, అతి గాఢమైన అనుభవము :

...కలయని కూరుముల్, మనసుకట్టని
వేవలపుం దుమారముల్
పొలయని భావముల్, యతుకుపోసెడి
వెన్నెల లివ్వి, కన్నె చూ
పుల పచరించు లేమెరుగు మొత్తములై
సెలకట్టి వచ్చెనో
తళతళ వెన్నెలై వలపుదారుల
బోసిన వెల్గునారు!లై

పిచ్చి ప్రేమికుడు! సృష్టిలోని తీయదనమంతా తన అనుభవాల ప్రకటన కోసమే అనుకుంటాడు కవి!!

నేనూ ఆ తెగలోవానినే ఏమో, నాకు కవిత్వము రాకపోయినా,.... ఏమో!

రేడియో నాటకములద్వారాను. కొన్నికొన్ని సన్నివేశాలు ఎంతో గొప్పగా చిత్రింప వచ్చు, తరిఫీదుపొందిన కంఠస్వరంతో. కాని, ఇందుకు ఎంతో సాధకము కావాలి. మద్రాస్ కేంద్రము స్థాపించే మొదటి రోజులలో ఈ తరిఫీదునిచ్చే బాధ్యత మాపై వ్రాలినది. మాట్లాడవలసిన రీతిని మాట్లాడటము నేర్పటము ఒకపని; ఇదివరకు స్టేజిపైన అట్టహాసముతో మాట్లాడేవారి తీరును మార్పుచేసి రేడియోకు అనువైనట్లు మృదులంగాను, అందంగాను, ఆప్యాయతతోను పల్కింపచేయటము ఒక మహా ప్రయత్నము. రేడియోకు అనుకూలమైన రీతిని మాట్లాడవలసిన నేర్పును, సహజంగాకలవారు చాలా అరుదు. అటువంటివారు లభించడము ఒక పండుగ వంటిది అన్నమాటే!

ప్రసారానికి అనుకూలమైన రచనలలోను, ఒకా నొక విశిష్టత అవసరము. ఆదిని కొన్ని కొన్ని నాటికలు మేమే రచించేవారము. నేను రేడియో కోసము రచించిన మొదటి నాటకము "కచదేవయాని." ఆ మాటకొస్తే, అసలు నేను రచించిన మొదటి నాటకమే కచదేవయాని. అదివరకు మారిస్ మాటర్లింక్ రచనను ఆధారంగా "అంతరంగము" అను ఏకాంకిక రచించిఉన్నా ఈ నాటకమే నా మొదటి స్వతంత్రరచన-ఇతివృత్తము కొంతవరకు భారతములోనిదీ కొంతవరకూ రవీంద్రునిదీ ఐనా.

ఈ నా మొదటి నాటికను "దేవయాని"చేత చదివించడము ఒక వింత అనుభవమే. నేను రచించాను కాబట్టి, నేను ఊహించగలిగాను దేవయాని ఇలా ఇలా మాట్లాడుతుంది, ఇలా ఇలా తన భావాలను వ్యక్తపరుస్తుంది అని. దేవయానిగా నటిస్తున్న భానుమతికి తెలియజేసి వీలైనంతవరకు భానుమతికి నా దేవయానితో తాదాత్మ్యము కలిగించాలి నాటకనిర్వాహకుడనైన నేను. పాపము, భానుమతి చప్పున అందుకోగలిగింది నా భావాలను. ఆమెకూడా జీవితంలో ఇంతో, అంతో బాధను అనుభవించి ఉన్నది కాబట్టి కచుడు తనను విడిచివెళ్ళిపోయేటప్పుడు దేవయాని ఎంత బాధపడిందో అంతబాధా తాను అనుభవింపగలిగింది మైక్రోఫోన్ ముందు భానుమతి.

పోయింది! కాని, పువ్వులు పుయ్యేనట్టూ? ఆ పుష్పాలన్నీ దండగుచ్చి నీ మెళ్ళో వేస్తేనేగాని నాకు తోచదు" అంటుంది.

వాక్యాలు నాలుగైనా ఎంతటి భావసంపద, అనుభవపరంపరా ఇమిడి వున్నాయి ఈ నాలుగు వాక్యాలలో. ఇంతటి భావసంపదనూ అనుభవపరంపరనూ, ఒప్పించాలి మైక్రోఫోన్‌ముందు. అల్లాగే, తనప్రయాణానికి సెలవునిమ్మని అర్థించే కచునితో మరోస్థాయిలో అంటూంది దేవయాని:

"సెలవు! సెలవిచ్చేదాన్ని నేనా? చూచుకో నీ హృదయంలోకి చూచుకో! పుస్తకాల దొంతరలమధ్యను అణగిపోయిన నీ అనుభవపరంపరలను ఒక్కసారి పైకి కనపడనీ. అవి ఏమంటున్నవి? అవి సెలవిస్తాయా? చూడు: నువ్వు ఇక్కడకు వచ్చిన క్రొత్తలో మనము సెలయేటిదగ్గరకు వెళ్ళాము, జ్ఞాపకమున్నదా? అవతలిఒడ్డుకు వెళ్ళాలని, నేను ప్రవాహాన్ని దాటలేకపోతే నువ్వు నన్ను ఎత్తుకు తీసుకువెళ్ళలేదూ? ఏరు దాటినాకకూడా నేను దిగనంటే నువ్వు నవ్వావు, జ్ఞాపకం లేదూ?.... కచా! కచా!! కొంచెము స్మృతితెచ్చుకో— మన జంటహృదయాలను తనలో కలుపుకున్న సెలయేరు నీ ప్రయాణానికి సెలవిస్తుందా? అదుగో! మ్రోత వినబడుతూనే ఉన్నది: "ఒద్దు! వెళ్ళొద్దు!!.... అంటూనే ఉన్నది, "కచా! కచా!!....నా కచా!!"

ఒకానొక మహత్తర ప్రేమను నిరూపించాలి ఈ మాటలు. నిపుణతతో అమర్చిన సన్నని వీణావాద్యము రసస్ఫూర్తిని ఇనుమడింపజేస్తుంది నాటక ప్రదర్శనలో. తరువాత వచ్చే సన్నివేశములో ఇంతటి ఆప్యాయతా, అధిక్షేపణగా మారుతుంది. దేవయాని అంటుంది:

"ఏమీ! దేవకార్యమే ముఖ్యమా? అయితే, ఈ సంవత్సరాలన్నీ అబద్ధాలేనా? నీ వినయమంతా ఒక్క దేవకార్యసిద్ధికొరకేనా? అయ్యో! నా కచా! ఇంతేనా? నీవు వట్టి బడిపిల్లవాడ వనుకోలేదు. చదివినన్నాళ్ళు చదువుకొని, ఆట విడుపురోజు రాగానే పుస్తకాలను చంకనబెట్టుకొని ఇంటిమొగమయ్యే శిష్యుడవేనా!

నేను జీవింపగలనా? చకోరపక్షిలాగ నీ కనుచూపులే ఆహారంగా బ్రతుకుతూన్న నాకు ఇంక ప్రాణమేదీ!" అంటూ అతి దీనంగా దేవయాని.

కచుడు: దేవయానీ! వద్దు! వద్దు!! పాషాణమును ద్రవింపజేయవద్దు.

దేవయాని: పాషాణమా! అవును పాషాణమే!....కాని, పాషాణానికైనా ఒకప్పుడు దివ్యస్త్రీరూపమునుదాల్చే శక్తిఉన్నది. నీకు స్త్రీరూపాన్ని రూపుమాపే శక్తి ఉన్నది. పూలతీగను కాలితోనలిపివేసే కిరాతకుడవు!.... దేవదూతా! ఎంతపనిచేశావు!! పట్టపగలు పంచభూతాలసాక్షిగా, సూర్యచంద్రులసాక్షిగా, ఎంత దొంగతనముచేశావు! సరే, వెళ్లు! వెళ్లు! సంపాదించావుగా గొప్ప విద్య! ఇది నీవు ఎలా వినియోగిస్తావో చూస్తాను. మోసముచేసి నేర్చుకున్న చదువు నీకు ఉపయోగపడదు సుమా!.... వెళ్ళు; వెళ్ళు! ఇంకా ఆగుతావేమి? దొంగవు! ఇచ్చటి నిర్మలవాయువును మలినంచెయ్యకు. కిరాతకుడవు! వెళ్ళు, వెళ్ళు!!.... ఇంకా వెళ్ళవేమి!!" అని గర్జిస్తుంది.

కాని, తనలోకలిగిన ఈ హోరుగాలికి తాళలేక మొదలుతెగిన అరటిలాగ, "అమ్మా! అమ్మా!!" అంటూ కూలిపోతుంది దేవయాని.

ఈ సంభాషణ జరుగుతుండగా అందలి ఆ భావాలను ఉద్దీపింపజేసే వాద్యసమ్మేళనమున్నూ క్రమంగా తీవ్రస్థాయికి వస్తుంది. "క్లైమాక్స్"ను అతి రమ్యంగా స్ఫురింపచేస్తాయి అతి దీర్ఘమైన వయొలిన్ వయొలిన్ సెలోస్వరాలు.

నాటకము ఎంతో రక్తికట్టింది.

కాని, ఈ నాటకాన్ని విన తటస్థించిన ఒకరు అన్నారట మా డైరెక్టర్‌తో, ఏదో మాటలసందర్భంలో మరునాడు ఉదయమే: "ఏమి నాటకము ప్రసారముచేశారు! ఏమిటా భాష? ఏమిటా భావాలు??" అని.

ఆ సంగతి ఉదయము ఎనిమిదింటికి ఆఫీసుకు వచ్చిన నాతో చెప్పారు, ఆయన, "రాత్రి నీ కచదేవయాని ఏమీ బాగాలేదటగా!" అంటూ.

గొప్పగా వ్రాశారు నాటకము! ఎంత అద్భుతంగా ప్రదర్శించారు. దేవయాని చాలా గొప్పగా ఒప్పించింది తన పాత్రను!చాలా సంతోషము!చాలా సంతోషము!!"అని.

ఆ రాత్రి శర్మగారిఇంట్లోనే భోంచేశాను. భోంచేస్తుండగా ఎవరో చెప్పారు ఆయనతో నా నిరశనవ్రతాన్ని గురించి. ఆయన నవ్వుతూ అన్నారు: "ఈమాత్రానికేనా నిరసనవ్రతము? ఐనా, సాహిత్యరీత్యా మీ కచదేవయాని గొప్ప రచన! మీరు అనుమతిస్తే భారతి పత్రికలో అచ్చువేసుకుంటాము, మీ నాటకాన్ని" అని.

భారతిలో అచ్చు అయినది నా కచదేవయాని. కాని, రచయితగా నా పేరు అచ్చువేయలేదు నేను. నా అభిప్రాయంలో రేడియోలో ఎవరు ఏది చేసినా, ఆ ఘనత అంతా సంస్థదేకాని, వ్యక్తులది కాదు. నాటకము గొప్పదైతే మెప్పుదల రేడియోసంస్థకు చెందాలి. వ్యక్తిగా నాకు కాదు. పైగా నా చదువు, నా శక్తి సామర్థ్యాలూ నా ఊహలూ నా ఆలోచనలూ నా సర్వమూ రేడియోకే అర్పించి ఉన్న నాకు రేడియోతో ఒక అవినా సంబంధము యేర్పడివున్నది.నేనే రేడియో, రేడియోయే నేను. ఈ సత్యాన్ని నేను మనసారా నమ్మాను.

* * * *

ఒక పర్యాయం, కంకంటి పాపరాజు ఉత్తరరామాయణమును ఆధారంగా తీసుకుని సీతమ్మశోకపు ఘట్టాన్ని చిన్నరూపకంగా ప్రదర్శిస్తున్నాము. సీతమ్మగా నటించడానికి సీత అనే ఒక అమ్మాయిని నియమించాము. సీత చాలా బాగా పాడగలదు. కాని, ఇంతవరకూ ఆమెకు ఎక్కువగా "లలితసంగీతమును" పాడటమే అలవాటు.అష్టపదులు చక్కగాపాడగలదు.ఇటువంటి కరుణారసపూరిత ఘట్టాలను చదువడము ఆమెకు ఇదే మొదటిసారి. దేవునిపుణ్యాన, ఇంతవరకూ ఆమె జీవితంలో బాధాకరమైనవిషయాలు ఏవీ జరిగివుండలేదు. అందువలన కారడివిని నిర్దాక్షిణ్యంగా విడిచివేయబడిన సీతామ్మవారిస్థితిని ఆమె తగినంత భావనాబలంతో ఊహించుకోలేకపోయింది. ఆ స్థితి ఆమెకు ప్రత్యక్షము కాలేదు అన్నమాట.

మూలలనుంచీ. మేఘచ్ఛాయలు కమ్ముకువచ్చాయి. "అలో లక్షణా అంటూ వీధిని పడ్డావు" అనేసరికి బొటబొట కన్నీరుకార్చింది ఆమె. చుట్టూవున్నవారు నాకేసి చూస్తూఉన్నారు, ఇంత కఠినంగా ప్రవర్తిస్తున్నాడేమి ఇతను, అనుకొంటూ.

కన్నీరు కారుస్తూన్న ఆమెను ఉద్దేశించి అన్నాను నేను:

"ఇప్పుడు పద్యమును చదువు: ఊ! చదువు! చదువు మరీ!!" అంటూ ప్రోత్సహించాను. గుండె బ్రద్దలయేటంతటి దీనంగా గోటువాద్యాన్ని మ్రోయింప సాగాడు నారాయణఅయ్యర్. వెక్కి వెక్కి ఏడుస్తూనే, ఆ అమ్మాయి పద్యం చెప్పింది. ఒక్కొక్క మాటా స్పష్టంగా పలుకుతూ, అద్భుతంగా, శోకరసాన్ని ఒప్పిస్తూ-పద్యం సాగగా సాగగా ఆమె పూర్తిగా సీతాదేవి పాత్రలో లీనమైపోయింది.

స్టూడియోలో ఎర్రదీపమువెలిగి నాటకము ప్రారంభించాక, ఆమెకళ్ళు తుడుచుకుని, తనపాత్రను ఎంతో గొప్పగా నిర్వహించింది.

...ఎన్నటికిన్ రఘూద్వహుని నేనును
నన్నిక రామచంద్రుడున్
గన్నుల జూడగల్గ దొకొ, కల్గక
యుండిన, ప్రాణమేల పో
దన్న, రఘు ప్రవీరు చెవులారగ
నింతయు దెల్పు నాదు మే
నున్నది చెంత గంగ మడుగున్నది
యైనటు లయ్యెడున్ దుదిన్—

అని చదువుతూ ఆ అమ్మాయి అచ్చంగా భవభూతి సీతగా మారి పోయింది!

సాగుతున్న యాత్ర

ఎప్పటికీ నేను నిర్మించుకున్న ఆ కళాప్రపంచకములోనే, నేను సృష్టించుకొన్న ఆ స్వప్నాకాశవీధులలోనే విహరించలేనా? అక్కడే ఉండి పోలేనా, రంగులరంగుల మేఘమాలికలతో తేలిపోతూ, ఇక ఎప్పటికీ భౌతిక ప్రపంచంలోకి, క్రిందికి దిగిరాకుండా!....ఏమిటో, వెర్రి ఊహలు.

ఇటువంటప్పుడే అర్థమవుతుంది మహాతత్వవేత్త ఐనా కళాతపస్వి ఉమార్ ఖయ్యామ్ మధుపాత్రను ఎందుకు అంత ప్రాణప్రదంగా పరిగణిస్తాడో. ఏదోచేసి, మరో లోకంలోకి పారిపోవాలి — వీలైనంతసేపు అక్కడే ఉండి పోవాలి!!

అలెగ్జాండర్ క్లవ్‌ను శ్రోతలకు పరిచయంచేశారు. సర్ అలెగ్జాండర్ మద్రాస్ రేడియోకేంద్రాన్ని ఉపక్రమిస్తూ దక్షిణప్రాంతాలకోసము ప్రత్యేకంగా వెలసిన ఈ నిలయపు ప్రాముఖ్యతను వివరిస్తూ ఈ నిలయ కార్యక్రమాలు ఈ ప్రాంతపు సంస్కృతిని సర్వతోముఖంగా విస్తరింపజేయడానికి అన్నివిధాల ఉపకరిస్తవనే ఆశయమును వెల్లడించారు. ముఖ్యమంత్రి వారికి వందనము లర్పించారు, రాజధాని ప్రజలతరపున.

నా రిహార్సల్‌లోంచి ఒక్క పదినిమిషాలు విరామంతీసుకుని ఫీల్డెన్ ప్రముఖులున్న స్టూడియోలోకి వెళ్లాను, నేను. ఈ విశేషసమయానికి అవసరమైన సూట్, బూట్, నెక్‌టై వేషంతోఉన్న నన్ను చూచి ఫీల్డెన్ కొంటెగా నవ్వారు ఈ వేషమూ నీకు బాగానేఉన్నది అన్నట్టు. మా నిలయపు "విజిటర్స్‌బుక్" చూపి, ఆ పుస్తకంలో వారి ముగ్గురి సంతకాలూ తీసుకున్నాను. మా డైరక్టర్ ముందు నడువగా వారిని సాగనంపి నేను చప్పున మళ్లా మా నాటకముజరిగే స్టూడియోలోకి జేరుకున్నాను.

ఇంక రెండు నిమిషాలకు నాటకము ప్రారంభిస్తుంది అనగా, ఢిల్లీనుంచి వచ్చిన పెద్ద ఇంజనీయర్ మైక్రోఫోన్‌ముందు నేను మిక్కిలి జాగరూకతతో అమర్చిన బృందగానపు అమరికను అంతా మార్చివేసి తనకు నచ్చినరీతిని కొందరిని ముందు, కొందరిని వెనుక కూర్చోనియమించారు. నే పడిన కంగారుకు మేరలేదు. ఆ ఇంజనీయర్‌ని మ్రింగివేయా లనిపించిందన్నమాట. కాని అతను చాలా మంచివాడు. నా భుజముతట్టి, "మరేం ఫరవాలేదు, నేను అమర్చిన విధానము బ్రాడ్‌కాస్టింగ్‌లో సరికొత్తవిధానము—ఇప్పుడు మీపాట మరింత శ్రావ్యంగా వినిపిస్తుంది" అన్నాడు. అతను చెప్పినది నిజమేకావచ్చు, కాని, నాకు ఆ ధైర్య మెలా ఉంటుంది ? అప్పుడు నేనేమనను ? ఏమనడానికీ వ్యవధి ఏది ? భారమంతా భగవంతునిపై వేసి, స్విచ్ నొక్కాను. ఎర్రదీపం వెలిగింది. పిల్లలు పాడ సాగారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన ఆహ్వానగీతాన్ని, తేనెవానలు కురిపిస్తూ :

"ఏం - కాంచనమాల ఒప్పుకున్నదా ?" అనే ప్రశ్న పరిపాటయింది, రేడియోనిలయంలో, నాటకానికి ఒక పదిరోజుల ముందునుంచీ ప్రతిపూటా, ప్రతి నిమిషమూను. చివరకు, ఆమె రాలేకపోయింది. కాని, ఆమె మా నాటకములో నటించాలనే ప్రయత్నంలో నేను రామబ్రహ్మాన్ని ఆయన స్టూడియోలో ఒక పది సార్లయినా చూచాను. ఇలా పదిసార్లు వెళ్ళడములో ఆయన అప్పుడు తీస్తున్న కొత్తచిత్రములో "రషస్" అన్నీ ఏనాటివి ఆనాడు, ఆయనతోకూడా నేను చూడడము తటస్థించింది. జరిగినంతవరకు తనచిత్రాన్ని నాకు చూపిస్తూ అడుగడుగున మా సలహా అడుగుతూ ఉండేవాడు అతను. ఈ సీన్ సరిగా వచ్చిందా, ఏమేమి మార్పులుచేస్తే ఇంకా బాగుంటుంది—అంటూ. ఈ 'రషస్' చూస్తుండగా ఎప్పుడొచ్చేదో, ఎలావొచ్చేదో, చడీచప్పుడుగాకుండా కాంచనమాల మా వెనుక ఒక సోఫామీద వచ్చి కూర్చునేది."అదుగో కాంచనమాల వచ్చింది;నేను చెప్పాను ఆమెతో అనార్కలీని గురించి" అనేవాడు రామబ్రహ్మం. కాని, ప్రతిసారీ ప్రదర్శన పూర్తికాకముందే కాంచనమాల లేచి వెళ్ళిపోతుండేది. ప్రతిసారీ రామబ్రహ్మం అంటూ ఉండేవాడు, 'రేపు గట్టిగా మాట్లాడతాగా, ఆమెతో !" అంటూ. మరునాడు మళ్ళీ అదే వరస. చివరకు, ఆమె రానేలేదు, రేడియోకు.

కాంచనమాల స్థానే భానుమతి, అంటే ప్రఖ్యాతగాయకి విశ్వేశ్వరమ్మ చెల్లెలు భానుమతి నటించింది. మొదట మేము కాస్త శంకించాము, ఈమె ఎలా నటిస్తుందో అని. కాని, చాల చక్కగ ఒప్పించినది భానుమతి, అనార్కలీ పాత్రను. భానుమతి అనార్కలీగా రావడమున్నూ చిత్రంగానే జరిగింది. అనార్కలీలో పాటలు పాడడానికి విశ్వేశ్వరమ్మను నియమించాము మొదట. ఆతర్వాత, కాంచనమాల రావడములేదని దృఢమయ్యాక,విశ్వేశ్వరమ్మనే అనార్కలీ పాత్రను నిర్వహింపమన్నాము.కాని,తీరాఆమెచేత పోర్షన్ చదివించేసరికిఆమెకు ముద్దుకృష్ణ భాష అలవాటులేనట్టు ప్రత్యక్షమైంది.అంతేగాకుండా, దైవానుగ్రహంవల్ల,ఏ చీకూ చింతా లేకుండా, ఎటువంటి ఒడుదుడుకూ లేకుండా, పడవప్రయాణంలా సాగిపోతూన్న ఆమెజీవితంలో ఆమె అనార్కలీవంటి దురదృష్టవంతురాలి విషాదగాథను గురించి ఊహించలేకపోయినది. ఎంత చదివినా, ఏదో చదివినట్టు ఉండేదిగాని అనార్కలీభావాలను ఆమె ఏమాత్రమూ అర్థముచేసుకొన్నట్టు తోచలేదు.

పోతుంది, తనకుమారుని ప్రేమించి, ఆత్మార్పణము చేసిన పరమ ప్రేయసి, పేదరాలు, అనార్కలీనిగురించి అక్బర్ పడే బాధను వీరభద్రరావు అతి నిపుణతతో వ్యక్తపరచినపుడు.

అబుల్ఫజల్గా మూర్తిగారున్నూ గొప్ప ప్రజ్ఞ చూపించారు. అసమానమైన లోకానుభవమూ, గొప్ప దూరదృష్టి, వర్ణనాతీతమైన సానుభూతీ చూపగలిగారు తన పాత్రపోషణలో. ఇప్పటికీ వారి ప్రత్యక్ష జీవితములోనూ ఈ గుణగణాలు రాణిస్తున్నాయి.

పెద్దనాటకమనుకున్న అనార్కలీ ఇట్టే పూర్తి ఐపోయింది. ముద్దుకృష్ణ ఎంతో గొప్పగా రచించిన ఏకాంకిక మా రేడియోనిలయపు మొదటి నాటికగా అర్పించాము, శ్రోతలకు. అతని రచనలోని సంభాషణా తీరు ధారాప్రవాహంగా సాగిపోయింది. నిమిషాలూ పావుగంటలూ ఎలా గడచిపోయాయో అంత చప్పున! చివరను, కృష్ణశాస్త్రి రచించిన బృందగానము ఎంతో జాలికలిగించింది. గుండె తరుక్కుపోయిందన్నమాట, ఈ మాటలు వింటూఉంటే!

పోయినది దానిమ్మపూవు!
తీయ తీయదనాల ప్రోవు!!
మాయభువిలో మరుగు నెదలకు
మంచు జడులని లేనెలేవు!

లోకమంతా కాలమంతా
చీకటిలై! చీకువాలై
ఏకమైతే, మరుగు నెడదల,
శరత్తు లనునవి రానెరావు!

బ్రతుకు లేమో భస్మమైనా
ప్రణయమైనా బ్రతికి ఉంటే,

ఈ కృషి నిర్విరామంగా జరిగిపోవలసినదే. మరివేరుప్రసక్తి లేదు. కాస్తవిశ్రాంతి తీసుకుని ఏ సినిమాకో, ఏ నాటకానికో, ఏ గానసభకో వెళ్ళినా, అక్కడ ఉన్నంత సేపూ అక్కడకలుగుతూన్న అనుభవాలను రేడియోకార్యక్రమాలను మరింత ఆకర్షవంతముగా చేయడానికి ఎలా వినియోగించడము అనే ఆలోచనే! ఎవరైనా, స్నేహితుని పంపడానికి రైల్వేస్టేషన్‌కి వెళ్ళితే, ఆ స్టేషన్ సందడినంతా అలా మనఃఫలకముపైన పదిలపరచుకుని, ఆ వారమో, ఆ పైవారమో "పదినిమిషాలు రైల్వేస్టేషన్‌లో" అనే పేరుతో ఒక విచిత్రమైన రూపకము ప్రసారమయ్యేది. స్నేహితులతో ఇష్టాగోష్టిని ఉన్నా, సహస్రరూపమైన జీవవాహినిని చూస్తూన్నా, ఆ మాటలూ, ఆ దృశ్యాలూ, వీలైనంత త్వరలో ఏదో ఒక రేడియోకార్యక్రమంలో పదిలమవుతూ ఉండేవి. చివరకు నేనే రేడియో, రేడియోయే నేను, అనేటంతటి అవినాసంబంధం ఏర్పడింది. ఇది ఒక అహంభావము ఏమో, అనిపించేటంతటిగా లీనమైపోయాను, రేడియో వ్యాపకంలో. సెలవుఅంటూ లేదు. ఏమి చెయ్యాలి, సెలవు తీసుకుని? ఆఫీస్‌పని లేనప్పుడే మరింత ఎక్కువగా రేడియో కార్యక్రమాలను సరిదిద్దుకోవచ్చు. ఒక రిహర్సల్‌కీ, ఇంకో రిహార్సల్‌కీ మధ్య కాస్త విరామము కలిగితే ఆ సమయంలో క్రొత్తగావచ్చిన రికార్డ్‌లను వింటూ, వీనినీ ఇదివరకు వినిన రికార్డ్‌లనూ కలిపి "రికార్డ్‌లతో కూర్చిన కథ" అంటూ బలేచిత్రముగా ఏర్పాటుచెయ్యడము. క్రొత్తరికార్డ్‌లలో రికార్డ్ మొదట ఒక నిమిషమో, అరనిమిషమో, ఉపోద్ఘాతముగా వచ్చే వాద్యసమ్మేళనాన్ని గుర్తుపెట్టుకుని, జ్ఞాపకముంచుకోవడము. ఆ సంగీతము ఏదో ఒక నాటకములోనో, రూపకములోనో వినియోగింపవచ్చు. ఇలా తటస్థమైనవాద్యసంగీతమే ఒకసారి మాళవికాగ్నిమిత్రము నాటికలో అద్భుతంగా ఉపకరించినది నాకు. మాళవిక దోహదక్రియ సలుపగా, చెట్టు అద్భుతంగా పుష్పభరితమవుతుంది. ఆ సుకుమారగాత్రి పాదము తాకినంతనే కొమ్మకొమ్మనూ క్రొత్తపువ్వులు పూయడము ఎంతో గొప్పగా స్ఫురింపజేసింది నేను దాచిఉంచిన రికార్డ్‌లోని వాద్యసమ్మేళనము! ఇలాగే, కొన్ని విషాదసన్నివేశాలసందర్భంలో కావలసిన సంగీతము, ఏదో వర్ణింపలేని మూగబాధా, ఏదో అంతులేని అన్వేషణా, ఇటువంటిభావాలను అతిప్రస్ఫుటంగా స్ఫురింపజేసి, అరనిమిషంలో, అద్భుతమైన వాతావరణము కలిగింపజేయగల సంగీ

తప్పు పదువగూడదు. ఒక్క భావము సూదిమొనంత భేదముతో వ్యక్తపరుప గూడదు. ఎన్నిసారులైనా, మరీమరీ చెప్పి, కావలసిన రసానుభూతినికలిగించే యత్నము చేయవలసినదే. "జానకిరామ్ రిహార్సల్" అనేది ఒక నానుడిగా చలామణి కాసాగినది, కొన్నాళ్ళకు. తప్పుచేస్తే తాము నా తీవ్రమైనకోపానికి గురి కాగలము అనుకునేవారే, తాము తమపనిని చక్కగా నిర్వహిస్తే నావలన విపరీతమైన ప్రశంసకు పాత్రులమవుతాము అనే నమ్మకము వారు తమతమ గుణగణాలు పూర్తిగా వినియోగించి ఆ యా కార్యక్రమాలను విజయవంతంగా పరిణమింపజేసేటట్టు జేసేది. 'మీ రేడియో నిలయము,' 'మీ నాటకము,' అనేవారు "మన రేడియో నిలయము", "మన నాటకము", అనడము నేర్చుకున్నారు, ఈ సంస్థ వారికోసము ఏర్పడినదీ అనీ ఈ కార్యక్రమాలు వారి పూర్తి సహకారముమీదనే ఆధారపడివున్నవి అనీ గుర్తించాక.

ప్రతినిత్యమూ ఎవరో ఒకరు క్రొత్తవారు కనిపిస్తూఉంటారు, పాత స్నేహితులూ మనలను కలుసుకుంటూ ఉంటారు. వీరిని ఇదివరకు కలుసుకోవడము వేరు, ఇప్పుడు కలుసుకోవడము వేరు. ఇప్పుడు వీరు కనిపించినంతనే నా మనస్సులో కలిగే మొదటి ఆలోచన : 'వీరు రేడియోకు ఏవిధంగా ఉపకరిస్తారు!' అనే. సాధారణులైనా, అంతే, మహనీయులైనా అంతే. వీరి ప్రతిభను రేడియోలో వినియోగించాలి అని సంకల్పమే, నాకు.

ఒకరోజు శ్రీ శొంఠి రామమూర్తిగారిఇంట జరిగిన టీపార్టీకి వెళ్ళాను. ఆ పార్టీలో శ్రీ ముట్నూరి కృష్ణారావు కనిపించారు. నమస్కరించి, వెంటనే అడిగాను, వారిని: "మీకు ఎప్పుడు వీలు, ఈవాళగాని, రేపుగాని, మన రేడియో నిలయానికి వచ్చి మీ ప్రసంగం రికార్డ్ చేయడానికి. ఇదివరకు మిమ్మలను మరీమరీ ఆహ్వానించి ఉన్నాము. ఇందుకోసము పనిగట్టుకు రావడానికి మీకు సావకాశం లేకపోయినా, ఊళ్లోకివచ్చారు కాబట్టి, నామాట మన్నించరూ, మరి!" అని. ఆయన నవ్వుతూ అన్నారు : "నాకు తెలుసు, నేనంటే ఎంత అభిమానమో మీకు. నన్ను విడిచిపెట్టాలి, మీరు. నేను వట్టి వ్రాతగాడను. మాట్లాడేపని అంతా మీరు చేయవలసినదే! అమోఘంగా నెరవేరుస్తున్నారు, కానియ్యండి, దిగ్విజయము తప్పదు!"

యపు కార్యక్రమాలలో, మొదటిరోజులలో వెలువడిన చాలా మంచిప్రసంగాలలో, బాపిరాజు ప్రసంగము ఎన్నదగినది.

స్టూడియోనుంచి బయటకు వచ్చాక, రామకోటేశ్వరరావు ఆదుర్దాతో అన్నారు : "అన్నంతపనీ చేశారే! మరేం ఫరవాలేదుగదా! పైవారు మిమ్మల్ని ఏమీ అనరుకదా!" అని. నేను నవ్వుతూ అన్నాను: "నేను ఏమంత సాహసమైన పని చెయ్యలేదు. మా డైరెక్టర్ అంటూ ఉంటారు, మాతో: "మైక్‌ముందు మీరు అతిసహజంగా ఉండాలి, మన 'డ్రాయింగ్‌రూమ్'లో కూర్చుని ఒకరిద్దరు స్నేహితులతో ఆప్యాయంగా ముచ్చటించినట్లు ఉండాలి, మీ మాటలధోరణి. అవసరమైతే, వోమాట చెప్పి, చిన్నదగ్గు దగ్గో, బుద్ధిపూర్వకంగానో, చిన్నపొరపాటుచేసో, "క్షమించండి, పొరపాటు" అంటూ తప్పు దిద్దుకొనో, తద్వారా సంభాషణలో సహజత్వాన్ని కల్పించాలి, అప్పుడప్పుడు" అని, అన్నాను నేను!" "ఇంకేమి! పైవారుచెప్పిన పాఠమేనా!" అన్నారు, వెంకటేశ్వరరావు.

ఆరాత్రి, మేము నలుగురము శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి ఇంటికి వెళ్ళాము. త్రోవపొడుగునా, రేడియో విశేషాలనుగురించే మా ప్రస్తావన అంతా. శర్మగారింటా ఆ మాటలే! వారందరూ చాలాచాలా ప్రస్తుతించారు జరుగుతూన్న కృషినిగురించి. కొన్ని విలువగల సలహాలనూ ఇచ్చారు.

బాపిరాజుతో కలసి తిరగడము అదొక వింత అనుభవము. ఆయన చెప్పే ప్రతిమాటలోనూ ఎంతో ఆవేశమూ, ఎంతో ఉద్వేగమూను. తన కండ్ల ఎదుట, మనోనేత్రాలముందు, ప్రత్యక్షమైన ఒకానొక సుందరప్రపంచాన్ని మనకూ చూపిస్తేగాని తనివితీరదు, ఆయనకు. ఉన్నట్టుండి, ఒకానొక అద్భుతమయ, సుందరాతి సుందర, విశ్వాన్నే సృష్టించాలి, మనయెదుట అనే ఆతురత, ఆయనలో, ఎప్పుడూను. ప్రస్తుత పరిస్థితులలో అటువంటిది సాధ్యమా అని జంకులేదు ఆయనకు. అందుకే "నా బ్రతుకొక పరిమళార్ద్ర నందనోద్యానము" అన్నారు - అంతటి ఆశావాది బాపిరాజు. అతని కవిత్వములో ఎంతటి సహజత్వమూ ఎంతటి నిజాయితీ !!

చాలా ప్రయత్నించాను, అచ్చంగా ఆ రేఖలే అవతలవేస్తూ వేయించాలి అని. కాని, ఎవరూ అటువంటి రేఖలు వెయ్యలేకపోయారు. పనితొందరవల్ల, ఎవరిచేతనో బాపిరాజుచిత్రానికి నకలు పూర్తిగా చిత్రింపించి, ఆ నమూనా బాపాలాల్‌కు ఇచ్చాను. సింహతలాటమును చేయించామన్నమాటేగాని బాపిరాజు చిత్రించినట్లు లేదు.

బాపిరాజు మా ఇంట్లో ఆవేళ చిత్రించిన సగము సింహతలాటచిత్రమూ ఇప్పటికీ ప్రాణప్రదముగా దాచుకుంటున్నాను, నేను. ఆ మధ్య, "అందము" అనే విషయాన్నిగురించి వ్యాసమువ్రాస్తూ వ్యాసానికి మకుటాభరణంగా, అర్థవలయాకారంగా ఆ చిత్రాన్ని ముద్రింపించాను. ఐదు ఆరు పేజీలలో అందాన్నిగురించి నేను చెప్పలేని ఉదంతాన్ని బాపిరాజుగీసిన రేఖలు చెప్పకలిగాయి! అట్టి సిద్ధహస్తుడు ఆ కళాతపస్వి !!

అడివి బాపిరాజు కవితలోకల్లా, నాకు చాలాచాలా ఇష్టమైన రచన ఇది:

నువ్వూ నేనూ కలసి
పువ్వులో తేనెలా
తావిలో మధువులా !
నువ్వూ నేనూ కలసి
కోకిల గొంతులా
గొంతులో పాటలా!
నువ్వూ నేనూ కలసి
వెన్నెల వెలుగులా
వెలుగులో వాంఛలా !
నువ్వూ నేనూ కలసి
గగన నీలానిలా
నీలాన శాంతిలా !!

౮

"ఏను నిద్దురవోదునో, యేమొ కరుణ
సెలవు గైకొన కేగగావలదు; ఇన్ని
నాళ్ళ యెడబాటు నీ నిరీక్ష
ణమ్ము బరువులు బరువులై నయనయు
గళమయ్యె దిగలాగు నిద్దుర మరపులకును
ప్రియతమా, యిక నిదురింతును పిలువబోకు
బాసిపోకు నిర్భాగ్యపు బ్రతుకు దాటి!
ప్రియతమా, పొరలి పొరలి మొయిళు
లేవొ మేలుకొననీవు రెప్పల వాలి యదిమి!"

దేవులపల్లి కృష్ణశాస్త్రి

ప్రేమద్వారగా శ్రీమతి కొమ్మూరి పద్మావతి అంటున్నారు, ఈ మాటలు, ఋషికుమారుడు రురూతో నా రెండవ రేడియోనాటకంలో. పద్మావతి పద్యంచదివే తీరులో ఒక విశిష్టత ఉన్నది. ఆమెకు ఆమే సాటి: నాకు తెలిసినంతవరకు ఎవరూ చదువలేరు, నేటి మన భావకవిత్వాన్ని, పద్మావతి చదివినంత అందంగా. అంత అర్థముచేసుకుంటూ, అంత అనుభవిస్తూ, చదువుతుంది ఆమె. ముఖ్యంగా, నండూరి వారి యెంకిపాటలూ కృష్ణశాస్త్రి ఊర్వశీపద్యాలూ ఆమె చదువగా వినడము ఒకానొక అపూర్వమైన అనుభవము. ఆ అనుభవాన్ని జ్ఞాపకంచేసుకున్నా చాలు, లోలోపలినుంచి, ఎక్కడినుంచో ముంచుకువస్తుంది ఒకానొక వింత సానుభూతి.

ప్రియతమా, నిను వదలికోలేను, నిదుర
కడలియై కాటుకై కనుగవ నడంచు;

ఋషికుమారుడు రురూ విషయంలోనూ, అలాగే అవుతుంది. అతడు తన ప్రాణముకంటే అధికముగా ప్రేమించిన ప్రమద్వరను పాము కరుస్తుంది, ప్రమద్వర చనిపోగా, రురూ విధిని బ్రతిమాలి తన ఆయుఃపరిమాణములో సగము ధారవోసి ఆమెను తిరిగి బ్రతికించుకుంటాడు. కాని, భారతములోని కథలో నేను నా రచనలో చిన్నమార్పుచేశాను: ఆ సగము ఆయుస్సూ ఇప్పుడే గడిచిపోయి, నవ యవ్వనమున ఉన్న రురూ వార్ధక్యంతో క్రుంగిపోయే పండుముసలి ఐపోతాడనీ, ఆ మార్పు మృత్యువాతనుండి బయటపడిన అతని ప్రేయసి సహింపగలదా అనే సంశయము అతనిని బాధిస్తుందనీ, నేను చిత్రించాను. ఈ సందిగ్ధాన్ని మరింత బలవంతముగా చేయడానికి ప్రమద్వరకు చెలికత్తెగా మరో అమ్మాయినీ కల్పించాను: కుముదిని - ఆమెకూడా రురూను అమితంగా ప్రేమిస్తూంది. రురూకూడా తనను అంతగా ప్రేమించాలని కుముదిని ప్రాధేయపడుతుంది. ఆమెయెడ అనురాగమున్నా, రురూ ప్రమద్వరనే మనసార ప్రేమిస్తాడు. కుముదిని రురూను అడుగుతుంది : "నేను అందంగాఉన్నానా....ఆ ప్రమద్వర అందంగా ఉన్నదా ?" అని, అప్పుడే కొలనులో స్నానంచేస్తూ హంసలతో ఆడుకొని వచ్చిన కుముదిని. రురూ అంటాడు : "అన్ని హంసలతో ఆడుకొన్నామన్నావుకదా - కుముదూ, వానిలో ఏ హంస నడకతీరు ఎక్కువ బాగున్నదో చెప్పగలవా.........ఈ పొదరింట ఇన్ని పువ్వులున్నాయి. ఇందులో ఒక్కపువ్వును తీసి తతిమ్మావానికంటే ఇది బాగున్నది అనగలవా ?" అని.

కాని, ఈ మాటలు కుముదినిని సంతృప్తిపరుపవు. ఆమె ఇంకా గ్రుచ్చి గ్రుచ్చి ప్రశ్నిస్తుంది. చివరకు రురూ అంటాడు: "కుముదూ! చెప్పనా, సాధారణపు కళ్ళకు నీ అందము గొప్ప అందము. నీ దేహకాంతి కళ్ళను మిరిమిట్లు గొలుపుతుంది. విశాలమైన నీ ఫాలభాగాన్ని చూస్తే ఆ మెదడులో ఎన్నెన్నో వింతఊహలు ఉన్నాయి అనిపిస్తుంది. తీర్చిదిద్దిన నీ కనుబొమలను చూస్తూఉంటే, బ్రహ్మ చిత్రకారుడే సుమా అనిపిస్తుంది. మెరిసిపోతున్న నీ కళ్ళు ఉత్సాహం, ఉద్రేకం, క్రొత్త క్రొత్త అనుభవాలను పొందాలనే ఆతురత - ఇలాంటి వెయ్యిభావాలతో నిమిష

కుముదిని : "ఐనా, ఇంకొక్కమాట. నవశిరీషకుసుమపేశలమైన ఆమె యవ్వనానికి తోడుగ నీ ముసలితనాన్ని ఆమెకు అర్పించడము న్యాయమేనా? ఆమె నీతో చెప్పుకోలేకపోవచ్చును; కాని, ఎప్పుడో, ఒక్క అరనిమిషమైనా, ఆమెకు చింతకలుగదూ 'ఈ ముసలివానితో ఏమి కాపురము' అని. అప్పుడు ఆమెకు కలిగిన అసహ్యాన్ని ఎలా భరిస్తావు రురూ !"

రురూకు శంకగానే ఉంటుంది - పడుచుప్రాయపు ప్రమద్వరకు ముసలివాడైన తనతోటి సహవాసము జుగుప్స కలిగిస్తుందేమోనని. ఐనా గుండె దిటవు చేసుకొని, విధి విధించిన నియమానికి ఒప్పుకుంటాడు, భయపడుతూభయపడుతూ. నిద్రనుంచి మేల్కొంచినట్టు తిరిగి బ్రతికిన ప్రమద్వరకు తనముఖాన్ని చూపించడానికి సాహసింపలేకపోతాడు. కాని, తన యవ్వనాన్ని ధారబోసిన అతని త్యాగబుద్ధికి మెచ్చి, దేవతలు అతడు ప్రమద్వరకళ్ళకుమాత్రమే నవయవ్వనుడుగాను, ఇదివరకుకంటే అతిశయించిన రూపురేఖావిలాసాలతోను, కనుపించేటట్టు అనుగ్రహిస్తారు. కాని, ఆ విషయం రురూకు తెలియదు. అతనిని కౌగలించుకుంటూ ఆవేశంతో అంటుంది ప్రమద్వర :

"ఓహో! ఏమిటిది! నువ్వు నా రురువే? ఏమిటీ కాంతి! నీ ముఖంలో ఎంత తేజస్సు! నీ కళ్ళు ఎంత మెరిసిపోతున్నాయి....నీలో నవవసంతం తాండవమాడుతోంది....రురూ! నన్ను కవుగలించుకో....గట్టిగా....ఇంకా గట్టిగా....! ఏవీ నీ లేతపెదవులు....అసలే సుందరమూర్తివి....మరింత సుందరుడవెల్లా అయ్యావు, రురూ !!"

రురు : "ప్రమద్వరా ! ప్రమద్వరా !! అంతా నీ ప్రేమప్రభావమే ! ప్రమదా ! ప్రమదా !!"

నాటకాన్ని వినిన అన్నగారు మల్లంపల్లి సోమశేఖరశర్మ రచననూ, ప్రదర్శననూ చాలా మెచ్చుకున్నారు. రురూ పల్కే కొన్నికొన్ని ప్రేమవాక్యాలను జ్ఞాపకముంచుకున్నారుకూడా. ఒకచోట ప్రమద్వరతో అంటాడు రురు :

మహాపండితులు, మహనీయ విమర్శకులు పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి "వాత్స్యాయనుడు ఉపదేశించిన నాగరిక వృత్తము"ను గురించి చెప్పారు ఎంతో అందముగా. సముద్రమంతజ్ఞానము వారిది, వైశాల్యములోనూ, లోతులోను. కాని, ఎంతటి శులభశైలిని, ఎంత విపులంగా, ఎంత సొంపుగా. విశదపరచారు, ఆ ఋషిసూక్తులను, మాకోసము! ఎక్కడో ఉన్న బరంపురంనుంచి వచ్చారు ఆది నారాయణశాస్త్రి. ప్రసంగము ప్రసారమైనాక, స్టూడియోలోనే కూర్చుని ఎన్నో ఎన్నో విషయాలు చెప్పారు మాకు.

పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి చేసిన భాషాసేవ అద్వితీయమైనది. ఈ తరమువారిలో ప్రాచీనవిషయాలందు ఆసక్తిని నిలువజేయడానికి వారి రచనలూ, వారి విమర్శనలూ ఎంతో తోడ్పడినవి. ఆయన రాజశేఖరకావ్యమీమాంస అమూల్యమైన వ్యాఖ్యానము.

ఈ రాజశేఖరకావ్యమీమాంసను గురించి ఒక చిత్రము జరిగింది రేడియోప్రసంగముల ఏర్పాటు సందర్భములో. నేను ఇదివరకు ఆ గ్రంథమును చదివిఉన్నాను. నాకు చాలాచాలా నచ్చినది ఆ వ్యాఖ్యానము. ఎన్నోఎన్నో విషయాలు తెలుసుకోగలిగాను నేను ఆ గ్రంథమును చదువుతూ. ఆ పుస్తకాన్ని జనుల వినియోగంనిమిత్తం కానిమెరా లైబ్రరీవారిచే కొనిపించాను కూడా. ఆ పుస్తకాన్ని గురించి శ్రోతలకు తెలియజెయ్యవలెననే ఉద్దేశముతో కొంచెము పేరుపొందిన ఒకకవికి ఆహ్వానము పంపాను నేను, రేడియోతరపున. ఆయనను నేను ఎరుగను. కాని, పత్రికలలో వీరినీ వారినీగురించి కాస్తకటువుగానే విమర్శిస్తూంటారు ఆయన. అచ్చటచ్చట సభలు చేయించి సన్మానాలు పొందుతూఉంటారు కూడా ఆయన. కాని. మా ఆహ్వానాన్ని అందుకున్నట్లు ఆయనవద్దనుంచి జవాబు రాలేదు. ఒకసారి జ్ఞాపకంచేశాము; మళ్లా రెండవపర్యాయమూ జ్ఞాపకముచేశాము. మూడవ ఉత్తరాన్ని అందుకుని, ఆయన మా డైరెక్టర్‌కి వ్రాశారు ఇలా: "మీ ఆహ్వానమూ, మీ మూడుఉత్తరాలూ అందినవి. నేనెవరినో మీకు తెలియనట్టున్నది. ఎవరో ఊరూపేరూ లేనివాడు, మీరు ఏ విషయాన్ని నిర్దేశిస్తే ఆ విషయాన్నిగురించి ప్రసంగించడానికి సిద్ధపడే అనామకుడు ఇతనూ

గ్రంథాలనూ, సాహిత్యాన్నీ వారి కందించి, వారిచేత చక్కని ప్రసంగమును విని పించేవారముకూడా.

ఈ కోవకుచెందినవారే సర్ వేపా రామేశము. జడ్జిగాను, చీఫ్‌జస్టిస్ గానూ పేరుపొందిన ఆయన మహాజ్ఞానసంపన్నుడు. గణితశాస్త్రము ఆయన అభి మాన విద్య. కాని, సకలవిద్యాసంపన్నుడు ఆయన. ఆయన తరచిచూడని విష యమే లేదు. ఆయనకూడా ఒక్కొక్కప్పుడు "ఈ విషయాన్నిగురించి ఇటీవల వెలువడిన గ్రంథాలు ఏమైనాఉంటే పంపండి" అనేవారు. వారిని ఒకానొక విష యాన్నిగురించి ప్రసంగించమని మేము కోరితే, ఆ గ్రంథాలను వారికి తీసుకువెళ్ళి ఇచ్చేవాడను నేను. ఆ సమయాలలో ఎంతో చక్కగా ఎన్నోవిషయాలను గురించి ముచ్చటించేవారు, ఆయన నాతో. వారికీ నాకూ కొన్నిదశాబ్దాలు తేడా, వయసులో, అనేమాట మరచిపోయి, ఎన్నోఎన్నో విజ్ఞానవిషయాలనుగురించి చర్చించేవారు నాతో, ఎంతో ఉత్సాహంతో. ఎప్పుడూ నవ్వుతూ పలుకరించేవారు నన్ను ఆయన. ఎప్పుడు వారివద్దకు వెళ్ళినా, నాకోసము కనిపెట్టుకున్నట్లూ, నేను రావడమువల్ల వారికెంతో ఆనందము కలిగినట్లూ తోపించేవారు. చాలా చలాకీగా మాట్లాడేవారు. ఒకసారి నేను కొత్తగాచదివిన ఒక పుస్తకాన్ని పురస్కరించుకొని, "ఇతరగ్రహా లలోనూ మానవులున్నారా ?" అనే విషయాన్నిగురించి మాట్లాడమని కోరడానికి నేను వెళ్లాను, సర్ వేపా రామేశం వద్దకు. నేనుచెప్పిన విషయమును విని ఆయన అన్నారు : "నాకో సంగతి జ్ఞాపకమువస్తోంది. ప్రఖ్యాత వైజ్ఞానికుడు ఒకానొక ఆక్స్‌ఫర్డ్ ప్రొఫెసర్‌ని ఒకరు ప్రశ్నించారట 'ఉత్తరధృవ ప్రదేశంలో పాము లున్నాయా?' అని. ఆయన అన్నారట 'మీ ప్రశ్నకు ఒక్కమాటలో సమాధానం చెప్పవచ్చు-లేవు!' అని, అని, నవ్వారట ఆ ప్రొఫెసర్. అలాగ మీరు కోరే రేడియోప్రసంగము ఒక్కమాటలో చెప్పవచ్చు "లేరు!" అని. కాని, పదిహేను నిమిషాల ప్రసంగానికి ఆ ఒక్కమాటా చాలదు. సరే, వ్రాసిపంపిస్తాను, మీకు కావలసిన వ్యాసము!" అని మా ఆహ్వానమును అంగీకరించారు.

వృద్ధాప్యములోనూ, శ్రీ రామేశంగారి బుద్ధికుశలతా క్రొత్తక్రొత్త విష యాలను గురించి తెలుసుకోవాలని విపరీతమైన ఆసక్తీ, అన్నిసంగతులనుగురించీ

౬

కోమలాంగీ నీ
దివ్యాకారం, నా యెడంద అద్దంలో
ఈ కళ్యాణముహూర్తపు నిశీథంలో
ఆకుల్దొడిగిన పూలమొక్కలా
నిల్చావో కన్యా!
ఈ లోక కఠోరయాత్రలో, నాలో
డోలాందోళిత భీత భావనా జాలం
జాలై, వాగై, ఓ మహాప్రవాహమై,
నా జాగ్రదావస్థనెల్ల ముంచెత్తి,
నా జ్ఞాన ప్రవృత్తులెల్ల కుంచించి,
నా జీవాన్ని ప్రసుప్తం చేసిన చీకట్ల
నో జవ్వనీ!
పూజా పుష్పాంజలితో విరిశావో
తేజస్వరూపిణి రాణి
తారాజ్వలిత లలితకాంతిమయీ!
శాంతిమయీ!!

మల్లవరపు విశ్వేశ్వరరావు

మా బావ, మల్లవరపు విశ్వేశ్వరరావు, తాను రచించిన "కళ్యాణ కింకిణి" పద్యకావ్యాన్ని ఆప్తమిత్రులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి వివాహ శుభసమయాన, వధూవరులకు తన పరిణయోపహారంగా అర్పించాడు. గోపాలరెడ్డి వివా

చదువుకున్నవాడే - గురించిన కబుర్లు, అనేక సాహిత్యవిషయాలను గురించిన చర్చా, ఇటువంటి సల్లాపంతో గడిచిపోయింది ఆపూట అంతా.

ఆ తర్వాత, ఆయనఆంధ్రదేశపుపర్యటనలో కొన్నిచోట్ల ఆయనతో కూడా ఉండి, కొందరు కవిమిత్రులను, ముఖ్యంగా వేదుల సత్యనారాయణశాస్త్రినీ, వారిబృందాన్నీ చూచాను. అప్పటినుంచీ ఉండేది, గోపాలరెడ్డికి, నేల నాలుగుచెరగులా ఉన్న కవులను ఒకచోట చేర్చాలనీ, వీరందరిచేతా ఏదో ఒక గొప్ప సాహితీ కృషి చేయించాలనీ.

ఈ వివాహ శుభసమయంలో, వివిధ ప్రాంతాలనుంచీ వచ్చిన కవికుమారులతో కళకళ్లాడుతున్నది, విడిది. వేదికను అత్యద్భుతంగా అలంకరించాడు, అడివి బాపిరాజు. పెండ్లికొడుకుశీవితో ఒకచోట బంగారపు పువ్వుల పావుకోళ్ళలో కాళ్ళు పెట్టుకొని, పడకకుర్చీలో కూర్చుని ఉండిపోలేదు, గోపాలరెడ్డి. ఎక్కడచూచినా అతనే! వచ్చేపొయ్యేవారి సౌకర్యాలను గమనించేది ఆయనే, పెండ్లిపందిరిఅలంకరణ విషయం ప్రతి చిన్నఅంశమూ సరిజూచేది ఆయనే, మాకందరికీ కాఫీ ఉప్మాల ఏర్పాట్లు సరిగాఉన్నదీ లేనిదీ కనిపెట్టేది ఆయనే - మధ్యమధ్య మంత్రిగా తమ ఆఫీస్‌విషయాలూ చూచుకుంటూ ఉండేవారు. ఇలా అన్నిచోట్లా తానే ఉంటూ, మా కందరికీ ఆనందాన్నీ, విస్మయాన్నీ కలిగించారు, గోపాలరెడ్డి.

వివాహపుతంతు ఎంతో శోభాయమానంగా జరిగింది. ఒక విశేషము! ముహూర్తాన్ని చూడడానికి మంత్రిపుంగవులూ, పెద్దపెద్ద ఉద్యోగస్తులూ, ఊరిలోని పెద్దమనుష్యులూ అందరు వచ్చివున్నా, పెండ్లిపీటలకు ఇరువంకలా, ముందు వెనుకా, అతిసమీపంలో కూర్చున్నవారు పెండ్లికుమారుని కవిమిత్రులే! నేను మరీ దగ్గరగా కూర్చుండబట్టి బంగారుబొమ్మ పెండ్లికుమార్తెను కన్నులార చూడగలిగాను. మూర్తీభవించిన పార్వతిలా కనిపించింది నాకళ్ళకు ఆమె. ఆమె ఎంత దాచుకున్నా, తాను మనస్ఫూర కోరినవరుడు తనకు దొరికాడు అనే మహత్తరానందాన్ని కప్పిపుచ్చలేకపోయింది ఆమె, మెరిసే తన కన్నులలో. కాని, ఎంతటి

ఆనందమూ, అంతటి ఆసక్తి కలుగజేస్తుంది రవీంద్రప్రస్తావన గోపాలరెడ్డిలో. రామాయణగాథ వినిపిస్తున్న ప్రతిచోటా హనుమంతుడు పరోక్షంగా అవతరించి ఉంటాడు అంటారు; అల్లాగే, ఎక్కడెక్కడ రవీంద్రసంకీర్తనము జరుగు తూన్నా, అక్కడే ఉంటారు గోపాలరెడ్డి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో. అంతటి ప్రీతి, వారికి, రవీంద్రుని దెస!

కాని, వంగభాషయందలి అపరిమితమైన ప్రీతివలననో ఏమో, గోపాల రెడ్డి తెలుగురచనలో మాత్రము, పదేపదే వంగభాషచ్ఛాయలు ధ్వనిస్తూఉంటాయి. కనబడినపుడల్లా, తన క్రొత్తరచన ఒకటి నాచేత ఉంచుతూ ఉంటారు గోపాల రెడ్డి. కాస్త తీరికఉంటే, తాను రచించిన ఒక క్రొత్తవర్ణన వినిపిస్తూ ఉంటారు, నాకు. ఊర్వశి ఆయనకు అభిమానవ్యక్తి. ఊర్వశిని గురించి ఆయన చదువుతూఉంటే రవీంద్రుడే తెలుగులో చదువుతున్నారా అనిపిస్తుంది. ఏదో వర్ణ నాతీతమైన గంభీరత, ఎన్నటికీ తరుగని సౌందర్యపిపాస ద్యోతకమవుతవి, ఆ వర్ణనలో. ఇట్టే ఊపివేస్తుంది, మనలను ఆ భావగరిమ, ఆ మాటలధ్వని. కాని, సాంతమూ విని, నే నంటాను: "అద్భుతంగా ఉన్నది! అద్భుతంగా ఉన్నది!! కాని, ఈ రచనే చక్కనితెలుగులో సాగితే, మరింత హృద్యంగా ఉంటుందేమో!!" అని. చిరునవ్వు నవ్వుతూ అంటారు గోపాలరెడ్డి "నాకు తెలుసు, శిష్టవ్యవహార భాషాప్రియులు మీరని! కాని, భాష ఒక మహాప్రవాహంవంటిదని మీరే అంటారు కదా. ఎన్నో ఎన్నో నదులూ, ఉపనదులూ కలుస్తూంటవి ఆ ప్రవాహంలో, నా యీ రచనాపద్ధతీ ఒకఉపనది అనుకోరాదూ - ఇదీ ఉండనివ్వండి!!" అని.

మంత్రి గోపాలరెడ్డి ఇంటికివెళితే, ముందుగా మనము చూచేది వారిని కలుసుకోవడానికి వేచియున్న నలుగురైదుగురు కవిపుంగవులూ, ఇద్దరు ముగ్గురు నాట్యకళాకోవిదులూను. పరిపాలనాసంబంధమైన కార్యకలాపము జరుగుతూనే ఉంటుంది. కాని, అతిముఖ్యమైన ఆనాటిప్రభుత్వపు కాగితాలను పరిశీలిస్తూనే, మధ్య మధ్య, కాస్త విరామము కల్పించుకొని, ఈ కవులనూ ఈ నాట్యకళావేత్త లనూ తమ సమక్షానికి పిలిపించుకుని, వారు వచ్చినపని ముందు గమనించి, పంపి

"అల్లాగా! నాకు తెలియనేలేదు. ఐతే, వెంటనే వెళదాము పదండి! నా కార్ రావడానికి ఆలస్యమవుతుంది, మీ కార్‌లోనే వెళుదాము." అంటూ ఆయన తన గుమాస్తాను తన ఖండువా తెచ్చిపెట్టమని నా కార్‌లో వచ్చి కూచున్నారు.

త్రోవలో చెప్పారు, గోపాలరెడ్డి, కుమారస్వామిరాజా ముఖ్యమంత్రి కాబోతున్నారనీ, ఆ విషయం చెప్పడానికే తమవద్దకు వచ్చారనీ, సాయంత్రము ఆరుగంటలకు తానూ రాజభవన్‌కి వెళ్లాలనీ.

కాని, పిల్లలగుంపులో చేరిన వెంటనే రాజకీయ ప్రపంచకాన్ని పూర్తిగా మరచిపోయారు ఆయన. ఆ వాతావరణం ఆయనకు శాంతినికేతనాన్ని జ్ఞాపకము చేసిందో ఏమో, ఎంతో ఆప్యాయంతో, ఎంతో ఉత్సాహంతో, పిల్లలతో కలసి పోయారు ఆయన. పిల్లలు రవీంద్ర గీతావళి పాడుతూంటే తానూ వారితో కలసి కంఠమెత్తి పాడసాగారు. తరువాత, రవీంద్రుని బహుముఖమైన ప్రతిభనుగురించి వర్ణించి చెపుతూ అల్లాగే ఉండిపోయారు ఆయన, ఆ పిల్లలతో. "రాజ్‌భవన్‌కు వెళ్ళేవేళ ఐంది. మీ కార్ వచ్చిఉన్నది" అని నేను చెప్పేవరకూ ఆయనకు ఈ నిత్యప్రపంచకపు ధ్యాసేలేదు-అంతగా కలసిపోయారు ఆయన, అమాయకులైన బాలబాలికలతో, కళకళ్లాడుతూన్న ఆ వాతావరణలో!

....ఈమధ్య నేను గోపాలరెడ్డిని కలుసుకొన్నది బెజవాడ రైల్ స్టేషన్‌లో. నేను దిగుతూన్న రైలు ఎక్కుతూ నా కంపార్ట్‌మెంట్‌వద్దకు వచ్చారు, ఆయన, నన్ను పలుకరించడానికి. కాని, ప్రయాణపుతొందరలోఉన్న ఆయనతో ఎక్కువసేపు మాట్లాడలేకపోయాను, నేను. ఈ కించ పోగొట్టుకునేందుకు నేను ఆయన మళ్లా ఈవేపువచ్చే రోజూ సమయమూ కనిపెట్టి, స్టేషన్‌లోనే వారిత్రోవ కాశాను, రెండు చేతులతో ఇన్ని కలువపువ్వులతో.

కలువపువ్వులను అందుకుంటూ, గోపాలరెడ్డి అన్నారు: "ఇవి కలువ పువ్వులు. మీ చేతిలో ఎప్పుడూ ఉండేవి తామరపువ్వులుగా, మరి?" అని, ఆశ్చర్యంతో. మళ్ళీ, అన్నారు: "కాని, కలువలూ చాలా బాగుంటాయి. ఎంత మృదువుగా ఉన్నవి రేకులు! ఎంత చల్లగా ఉన్నవి!!" అంటూ పువ్వులను తన ముఖానికి

అనే అబ్బూరి రామకృష్ణారావు రవీంద్రుని అడుగుజాడలలోనే నడుస్తున్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రిని విపరీతంగా ఉత్తేజపరచినదీ, ఈనాటికీ అతని అంతర్వాణిని పలికించేదీ రవీంద్ర భావనాబలమే! ఇందుకు కృష్ణశాస్త్రి గర్విస్తున్నాడు కూడా:

"ఈ కుటీర ముఖద్వార
మిందే ్రవేలాడి సగము
వాడి విరహాతోరణమ్మునై..."

అంటాడు, రవీంద్రుడు కృష్ణశాస్త్రి కంఠముతో.

వేదుల సత్యనారాయణశాస్త్రి కవిత కొంతవరకు నిరాశతో నిండి ఉంటుంది. కాని, రవీంద్రస్పర్శ తగిలేసరికి తప్తకాంచనంలా మెరిసిపోతుంది:

ఆమె నవనీతహృదయ, నా అంతరంగ
శాంతిదేవత, ఆశాపథాంతరాళ
పారిజాతమ్ము, ప్రేమజీవనవిభాత
కైశికీగీతి, నా తపఃకల్పవల్లి!

దివ్య స్త్రీమూర్తిని ఇంత హృదయపూర్వకంగా ఆరాధించడము మనకు నేర్పినది రవీంద్రుడే!........

ఓ ప్రభూ! నీ రథము దీక్షా ప్రణీత
విధుర వేగమ్ము పరువులు వెట్టుచుండె
నా శరీరమ్ము దానిక్రిందబడి నలిగి
నలిగిపోయినయది రక్తనదము లింకి.
దివ్య తేజోవిరాజత్త్వదీయ రథము
ఈ గతుకు డేమియనియైన నాగలేదు;

ద్రుని సుప్రసిద్ధ రచనలలో వారు చదివిన అమ్మాయిల పేర్లు పెట్టుకుంటారు. నళిని, హేమనళిని, మాలిని, ఆశాలత, చిత్ర, వాసంతి-ఇవన్నీ రవీంద్ర సాహిత్యాన్ని అలంకరించిన వారి పేర్లే!

మన ఇళ్ళలో ఎచ్చటెచ్చట సారస్వతాభిలాష తాండవిస్తుందో, ఎచ్చటెచ్చట సౌందర్యపిపాస వ్యక్తమవుతుందో, ఎచ్చటెచ్చట విశ్వమానవ సౌభ్రాతృత్వము వెల్లివిరుస్తుందో అచ్చటల్లా, రవీంద్రుడు అమరజీవియై అలంకరిస్తున్నాడు, మన నిత్యజీవితాన్ని.

వారి ఆశయాలలో తేడా ఉంది. చలపతిరావు సున్నితహృదయుడు. మిక్కిలి ఆర్ద్రస్వభావము గలవాడు. కొన్ని కొన్ని విలువలను శ్రద్ధతో పాటిస్తాడు. లక్ష్మీకాంతమ్మకు అంతటి ఉదారస్వభావము లేదు. పూర్వాచారపద్ధతులకు కట్టుబడిన ఆమె దృష్టి ఆమె ధోరణీ ఆతీరుననే ఉంటవి. ఆమె చెల్లెలే సుధ-బాలవితంతువు, పాపము: కాని, మంచి చలాకీగల పిల్ల. మేఘసందేశకావ్యాన్ని చదివి ఆనందింపగల భావనాబలమూ, అనుభవింపగల యోగ్యతాకల సుకుమారి. పువ్వులంటే వెర్రి ప్రీతి ఆమెకు. కాని, ఆచారానికి బానిసఐన ఆమె అక్కకు సుధ పువ్వులుపెట్టుకోడము చేయకూడని పని. ఆమెకు ఏమాత్రం ఇష్టము ఉండదు. చెల్లెలు తలలో పువ్వులు ముడువరాదని అక్క తీవ్రంగా శాసించడమూ ఆమె సుధతలలోని పూల గుత్తిని బలవంతంగా లాగిపారవెయ్యడమూ చూచిన చలపతిరావుమనస్సు చివుక్కుమంటుంది. ఇదే నాటికకు కీలకము.

చలపతిరావూ భార్యా, మరదలూ, మామగారూ ఉల్లాసంగా గోదావరినది పైన పడవషికారుకు వెళుతారు. ఆ పిల్లల మేనమామకూడా వస్తాడు, వారితో సరదాగా. ఉన్నట్లుండి గాలిదుమారము వచ్చి, వారు ఆ రాత్రికి గోదావరిలంకలో ఉండిపోవలసివస్తుంది. ఈ లంకపేరే దయ్యాలలంక. కాని, దయ్యాలలంకకు ఇంకా విశాలమైన అర్థమున్నది. రచయిత దృష్టిలో, మంచి చెడ్డలు పాటింపక, మూఢవిశ్వాసాలకు ఆకరమైనసంఘమే నిజమైన దయ్యాలలంక. గోదావరిలోని లంకలో ఆరాత్రి ఉండిపోయినవారిలో తతిమ్మావారంతా అలసిపోయి నిద్రిస్తూండగా సహృదయులూ, సమానఅభిరుచులూ, పరస్పరసానుభూతీగలవారైన చలపతీసుధా మాత్రం వెన్నెలలో కూర్చుని, చంద్రబింబాన్ని అల్లాగే చూస్తూ ఉండిపోతారు. హఠాత్తురాలై, అంతవరకూ చీకటితోడుగా బ్రతుకుమోస్తున్న సుధ అభాగ్యపుజీవితములోకి ఒక్క ముహూర్తకాలము పండువెన్నెల ప్రసరిస్తుంది. కాని, ఈ మహత్తరానందాన్ని భరించలేదు ఆ వెర్రిపిల్ల. అంతటి గొప్ప అనుభూతిని పొందినపిదప, ఆమె మళ్లా మామూలు ప్రపంచకాన్ని చూడలేదు. నిద్రపోతున్న చలపతిని విడిచిపెట్టి, తనవారిని అందరినీ విడిచిపెట్టి గోదావరిలో కలిసిపోతుంది సుధ. ఈ త్యాగము తప్పనిసరి.

సుధ : ఏమనుకుంటారు? అదిన్నీ పాపమేనా?

లక్ష్మి : అవును, అసలలా జుత్తు ఉంచుకోవడమే తప్పు. చిన్నదానివే అని జాలి పడి నాన్న తీసేయించలేదు. పైగా పువ్వులుకూడానా?

సుధ : అబ్బ! ఎందుకే నన్ను బాధపెడతావు? నాకు పువ్వులంటే ఇష్టము. పోనీ, ఎవరు చూస్తారు? ఇంట్లో నాన్నా, నువ్వూ, మామయ్యా, బావయ్యా- అంతేగా?

లక్ష్మి : (ఎందుకో తటాలున) తీసేస్తావా లేదా?

అక్కగారు చెల్లెలిజడలో పువ్వులు లాగిపారవేస్తూండగా, బావ చల పతిరావు ప్రవేశిస్తాడు. నీరుగ్రమ్మిన కళ్ళతో సుధ అవతలకు వెళ్ళిపోతుంది. చల పతిరావు హృదయం కరిగి నీరవుతుంది. ఈ సంఘటనను అర్థంచేసుకుని, అతడు భార్యను మందలింప యత్నిస్తాడు.

....పడవషికారు మాటవచ్చి, సుధ అంటుంది, నదిలోపల నీటిని చూసు కుంటూ పడవ వెడుతూండే దృశ్యాన్ని భావించుకుంటూ:

"బోటు సర్రుమని వెడుతూంటే గోదావరిహృదయాన్ని చీల్చుకొని పోతున్నట్టు ఉంటుంది కాదూ! అయితే, వెంటనే ఒక్కమరకైనా కనపడదు. ఎన్ని దెబ్బలైనా తన కెరటాలతో కప్పివేసుకుంటుంది."

ఈ మాటలు చాలా చక్కగా చెప్పేది, వసంత, రాజమన్నార్ ఉద్దేశిం చిన "ధ్వని"ని పూర్తిగాప్రకటిస్తూ. జరుగుతున్నది నాటకమేఐనా, నేను కేవలమూ నాటక నిర్వాహకుడనే ఐనా, రిహార్సల్స్‌లో ఆమె ఆ మాటలు అలా అంటూఉంటే చాలా బాధ అనుభవించేవాడను, నేను.

లంకలో, వెన్నెట్లో కూర్చుని, చలపతిరావు తను వెన్నెలను వర్ణిస్తూ శ్లోకము వల్లించాక, ఆ తర్వాత సుధనుకూడా, పాటపాడమని బలవంతముచేస్తాడు. ఆమె సందేహిస్తూ ఉంటే అతనంటాడు:

మించినది. ఈ సంభాషణకు అనువైన నేపథ్యసంగీతమూ అందంగా వినిపించ డమువల్ల మరింత ఉద్దీపితమైనది, భావప్రకటన.

నాటకము కడపటిరిహార్సల్ పూర్తిఅయ్యి, ప్రసారానికి ఇంకో ఇరవై నిమిషాలు ఉన్నదనగా, నాకొక ఆలోచన తట్టినది. రాజమన్నార్ తమ నాటికలో సుధ నదిలోపడిపోవడము సంగతి పడవవాళ్ళచేత చెప్పిస్తారు. తెల్లవారాకకాని, ఆమె నదిలో ఉరికి, ప్రాణత్యాగము చేసికొన్నట్టు చూపరు. స్టేజిమీద అటువంటి సంఘటనలు చూపడమూ కొంచెము కష్టము. కాని, ఆఖరి రిహార్సల్‌లో నాకు తోచింది, ఈ సంఘటన రేడియోలో చక్కగా నిరూపింపవచ్చు, తద్వారా నాటకము మరింత రక్తిగడుతుంది, అని. వెంటనే కాగితముతీసుకొని ఒక్క ఆరు చిన్న చిన్న వాక్యాలు సుధ ఒక్కర్తే చెప్పే మాటలుగా వ్రాశాను. చలపతిరావును వదలి శూన్యహృదయంతో సుధ నదిని దరిసినట్టూ, ఆ సమయానికే కారుమేఘాలు ఆకాశాన్ని అలముకున్నట్టూ, మొదట గోదావరి కెరటాలను చూచి ఆమె బెదిరి నట్టూ, దూరాన ఎక్కడో అవతల ఒడ్డున సాగిపోతున్న పడవలోని దీపము మిణుకుమిణుకుమంటూ ఆ చీకటిని ఛేదించుకుంటూ ఆమెను పలుకరించినట్టూ, అంతట "అదుగో వెల్తురు! నాకేమి భయము!!" అంటూ వింత ధైర్యముతో ఆమె నదిలోకి నడిచివెళ్ళిపోయినట్టూ, "అమ్మా! గోదావరీ!! నన్ను నీకడుపులో దాచుకో! తల్లీ!!" అనే ఆర్తనాదముతో ఆమె నదిలో మునిగినట్టూ స్ఫురింపజేస్తూ వ్రాశాను, నేను. స్టూడియోలోకి వెళ్ళబోతున్న వసంతను ఇవతలకుపిలచి "అమ్మాయీ! ఇవిగో మరికొన్ని పంక్తులు, సుధ ప్రత్యక్షంగా నదిలోపడిపోయి నట్టు నిరూపించాలి మనము, ఈ నాటకంలో. "నీవు నదిలోపడాలి! ఏదీ, చదువూ!" అన్నాను, కాగితము ఆమె చేతికిచ్చి.

ఇదివరకే ఆ పాత్రలో పూర్తిగా లీనమైఉన్నది వసంత, నా మనస్సును చక్కగా అర్థముచేసుకుని, ఎంతో చక్కగా చదివింది, నేనువ్రాసిన మాటలు. "ఎక్కువ రిహార్సల్‌కు అవకాశంలేదు,ఇక రెండు నిమిషాలలో నాటకము ప్రారం భిస్తారు. ఈ సంఘటనను సరిగా నిరూపిస్తాననే ధైర్యం ఉన్నదా నీకు, వసంతా!" అన్నాను.

కలాపాల సందర్భంలోనూ నాకు వారితోకలిగిన సహచర్యాభాగ్యమువల్ల, తలుచుకున్నంతమాత్రాననే ఒళ్లు పులకరింపజేసేటంతటి పరిమళవంతమైన పుష్పిత స్నేహలతగా రూపుదాల్చినది, ఈనాటికి. ఏ మహాసభలోనైనాసరే, వారు ప్రవేశిస్తూండగా నేను ఎదురుగా వెళితే, నా నడుముచుట్టూ చేయివేసి నన్ను దగ్గరకు తీసుకుంటూ అడుగుతారు ఆయన: "కులాసాగా ఉన్నారా? క్రొత్తరచనలు ఏమి రచించారు? నాకు చూపించారు కారేమి?" అని. ఏవో పనులతొందరలలో నేను వారిని కొన్ని వారాలు కలుసుకొనకపోతే, ఈసారి కనిపించినపుడు అడుగుతారు ఆత్రుతతో: "చాలారోజులైంది, మీరు కనిపించి, ఎలావున్నారు?" అని.

రేడియోలో ఏమి విశేషము జరిగినా వారిని ఆహ్వానింపక తప్పదు."రేడియోలో మొదటి కవిసమ్మేళనము జరుగుతుంది, ఈ ఉగాదికి, మీరు అధ్యక్షులుగా ఉండాలని మాకోరిక!" అంటే, "సరే! అల్లాగే!!"అంటారు,ఆయన. "మూడు నెలలకోసారి, సాహిత్యసమీక్ష ఏర్పాటుచేశాము. మొదటి సమీక్ష మీరు ప్రసారము చేస్తారా, దయచేసి!" అని కోరితే, ఎంతపనిఉన్నాసరే, "సరే! అల్లాగే!!" అంటారు, ఆయన. ఆ మొదటి సాహిత్యసమీక్షలోనే, రాజమన్నార్ సమకాలిక సాహిత్యరీతులను విమర్శిస్తూ,శ్రీ శ్రీ రచనాధోరణినిగురించి విపులంగా ప్రస్తావించి, ఇలా అన్నారు:

"సింధూరం, రక్తచందనం, బంధూకం, సంధ్యారాగం, పులిచంపిన లేడినెత్తురూ, రుద్రాక్షిక నయన జ్వాలికా, కలకత్తా కాళికనాలిక-ఇవి కవితావస్తువులైనాయి, ఈనాడు. కాని, 'కదలేదీ కదిలించేదీ, మారేదీ మార్పించేదీ, పాడేదీ పాడించేదీ, పెనునిద్దుర వదలించేదీ, మునుముందుకు సాగించేదీ, పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ' కావాలట నవకవనానికి. మంచిదే! కాని, ఏదీ అటువంటి కవిత?" అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నతో ముగించారు, తమ సమీక్షను.

శ్రీ శ్రీ తన కడపటి రచన వ్రాసి అప్పటికప్పుడే ఐదేళ్ళు దాటింది.

...."దక్షిణ భారత చిత్రాకారుల సంస్థతరపున చిత్రపట ప్రదర్శనము జరుగనున్నది. మీరు ప్రదర్శనను ఆవిష్కరించాలి, ఫలానా రోజున" అని ఫోన్

డమేకాక గొప్ప జ్వరంలోఉన్న అతనికి సేవచేయవలసివస్తుంది. భగ్నహృదయుడు, అతను, ఈమె తనకు లభించకపోవడంవల్ల కలిగిన వెత్తిని మర్చిపోవడం కోసం త్రాగుడు నేర్చుకుని ఆ దుర్వ్యసనానికి బానిసై ఒళ్ళు గుల్లచేసుకుని బికారిగా ఇంచుమించు మరణావస్థలో కనుపిస్తాడు ఆమెకు. అతని పరిస్థితికి తానే కారణమని నిర్ణయించుకుని ప్రభావతి తన పరువుప్రతిష్టలు మంటగలిసినా అతనితో వెళ్ళిపోయి, తన సంరక్షణవల్ల అతనిని బ్రతికించుకోవాలని సంకల్పిస్తుంది. వ్యాధి తాత్కాలికంగా నిమ్మళింపగా, కాస్త తెలివితెచ్చుకున్న ఆమెప్రియుడు ప్రభావతి త్యాగానికి అంగీకరింపక వచ్చినత్రోవనే వెళ్ళిపోతాడు. అతనిని నిలుపుకోలేక, గుండె బ్రద్దలయేటట్లు ఆమె ఏడుస్తూండగా తెర వాలుతుంది. నేనూ కన్నీరు కారుస్తాను పుస్తకం మూసి, ఎంతోసేపు. ఈ నాటకములో అతి తీవ్రమైన, మిక్కిలి ఉద్రేకపూరితములైన సంభాషణలను పొందుపరిచారు రాజమన్నార్. ఒక్కొక్క మాట సూదిమొనలా పొడుస్తుంది మన హృదయాన్ని. ప్రభావతికి జరిగిన అన్యాయాన్ని జ్ఞప్తిపరుస్తూ, సన్నిపాత ప్రలాపనలో మోహనరావు అనే మాటలు భయంకరంగా ఉన్నా, చాలా జాలికలిగిస్తాయి. ఆ స్థితిలో ప్రభావతి అతనిని మళ్ళీ కలుసుకోవాలని వచ్చినందుకూ, అతడు సర్వనాశనమైపోతున్నా తాను ఏమీ చేయలేనందుకూ ప్రభావతి దెసమనకు సముద్రమంత సానుభూతి కలుగుతుంది. ఆమెతో కలిసి నేనూ దుఃఖిస్తాను, చాలాసేపు.

"పరకీయ" నాటకములోవంటి సన్నివేశాలనూ, ఆ సంభాషణలనూ, ఊహించడము చాలా కష్టము. అవి నిజంగా జరిగివుంటే మరీ కష్టము. నాకు అనిపిస్తుంది. "ఈ సంఘటలను చిత్రిస్తూంటే ఎంత బాధపడిఉండాలో రచయితగా, కళాశీలి రాజమన్నార్ అని" వారిదెస పట్టరాని జాలి, విపరీతపు సానుభూతి కలుగుతవి. నాటకములోని పాత్రలదెస ఆవహించివున్న అనుకంపా భావమంతా రచయితదెస ప్రసరిస్తుంది.... ఉన్నట్లుండి, నాలో నాకే గొప్ప భయమువేస్తుంది. నేనే మోహనరావునుఐతే ఏమైపోయివుందునో, నేను-అని. అబ్బ!!....

కళాశీలి రాజమన్నార్ అప్పుడప్పుడు నిత్యజీవితపు బెడదలోంచి పారిపోతూ ఉంటారు. ఎంతోదూరంకాదు. అవతల వీధినివున్న మహాశిల్పి దేవీప్రసాద్

౧౧

గంగాతరంగ హిమశీకర శీతలాని
విద్యాధరాధ్యుషిత చారుశిలాతలాని
స్థానాని కిం హిమవత: ప్రళయం గతాని
యత్సావమాన పరపిండరతాగమనుష్యా:

"ఎంత చక్కని శ్లోకం! ఎంత తీయనిది! కాని, ఇంతకంటే అపాయకరమైనది ఈ దేశంలో లేదు. 'త్రాగడానికి గంగాజలం ఉంది, పరుండడానికి శిలాతలాలున్నవి, ప్రళయంవచ్చి హిమగిరిస్థానాలు పోలేదే? ఎందుకు మానవులు పరపిండాన్ని ఆశిస్తారు' అని. తరువాత, కానల్లో పళ్ళున్నాయి, ఆకులున్నాయి, దుంపలున్నాయి అంటూ అంటాడు భర్తృహరి. మనకు ఇది పనికిరాదు....ఎంత దిగులుపుట్టిస్తుంది ఈ వేదాంతం! ఎంత నీరసంగా చేస్తుంది ఈ వేదాంతం!....నాకు ఐశ్వర్యం కావాలి, సమృద్ధి కావాలి, అందరికీ కావాలి!!"

ఈ మాటలు నామాటలుకావు-నేనూ ఇటువంటి భాష వ్రాయడానికి నేర్చుకున్నా, ఈ అభిప్రాయం దేవులపల్లి కృష్ణశాస్త్రి తన మొదటి రేడియోప్రసంగంలో వ్యక్తపరచినది. 'ఆకలి' అనే తన ప్రసంగంలో కృష్ణశాస్త్రి ఇంకా ఇలా అన్నాడు:

"ఇంకొకకవి ఇలా అన్నాడు: ఒక మహాముహూర్తములో ఒక తేలు సగర్వంగాలేచి, 'ఆ సూర్యునికి కాంతిభిక్షపెట్టినవాడే నాకూ దినదినమూ తిండి పెడుతున్నాడు,' అని, ఒక మహాముహూర్తములో ఒక సర్పం అగ్నిలతలాగ నృత్యంచేసి 'ఆ చంద్రుడికి శీతలరజతాహారం అనుగ్రహించినవాడే అనునిమిషమూ నాకు తినిపిస్తున్నాడు'అని, ఒక మహాముహూర్తములో నక్షత్రాలన్నీ శత

స్వాదు మృదులములు నీపాదాల సవ్వడులు
ఏదవ్వులందైన నే నెరుంగలేన!
అదరు నీపెదవి యూరుపుగాలి కదిలేన
చెదరు నీ చీరకుచ్చెల సుంతమెదిలేన,
ఆగికోలేనోయి! అడగియున్నవి వేలు
మ్రోగిపోయేనోయి ముగ్ధరహస్యాలు! – అనీ

ఒక్క కృష్ణశాస్త్రి అనకలడు.

ఇంకా ఉన్నాయి, మంచి మంచి భావాలూ, మంచి మంచి మాటలూ కృష్ణశాస్త్రి ముద్రతో:

శ్యామలాలకల నవమల్లికల డోలికల
పేర్చినారా, దారి కురవకాశోకాలు,
ఓర్చికోలేవు స్వామి మృదు చరణాలు –అనీ,

...మల్లీ వల్లీ మరకత కాంచీ
వేల్లిత తనుమధ్యా! వసంతా!
ఫుల్ల మాలతీ పులకిత ప్రతతీ
పల్లవ మృదురధ్యా! వసంతా!
ఓహూో! వసంతా! ఓయి వసంతా!
అరవింద సితకుంత దళస్మిత! –అనీ,

ఎలదేటి నోయి!
స్వామీ! నేను సెలయేటి
అలలలో కదిలేటి

"కృష్ణశాస్త్రి కవిత,సూర్యకాంతపుష్పం. ఒక్క కొండమీద ఒంటరిగా వికసించినట్టు ఆత్మానుభూతినే ఆలంబనగా గైకొని ఖండకావ్యంగా ప్రఫుల్లమవుతుంది. దృశ్యప్రపంచాన్ని వర్ణించే ప్రకృతివర్ణనలూ, దృశ్యజీవితాన్ని నిరూపించే ప్రబంధ కావ్యాదులలోకంటే కృష్ణశాస్త్రి ఖండికలలో ఆత్మ ఆత్మపరమైన రహస్య ప్రపంచం, సంజ్ఞారూపకమైన నిగూఢానుభూతీ, ఉత్కృష్టరసోద్దీపకములైన భావచిత్రాలూ పాదులేర్పరచుకోగలవని చెప్పవచ్చు" అని చెప్పి, విశ్వేశ్వరరావు కృష్ణశాస్త్రి రచించిన "ఆమె కన్నులలో అనంతాంబరంపు నీలినీడలు కలవు"; అనే పద్యాన్ని ఉదాహరిస్తూ ఇలా విమర్శించాడు, తన రేడియోప్రసంగంలో, సరిగ్గా ఇరవైయేండ్లక్రితము:

"ఈ గీతంలో ఒక భావచిత్ర పరంపరను పరుగెత్తిస్తాడు, కవి. 'ఆమె కన్నుల' లోతుకాంతులను కవి ఊహాతూలికతో కావ్యయవనికమీద చిత్రపరంపరగా చిందించి, ఆ కన్నుల అగాధంలో వెల్లివిరిసే అగోచర లోకసాదృశ్యాలను ముక్తధారగా సహృదయుని అంతఃకరణలోకి ప్రవహిల్లజేశాడు."

అని, ఇంకా కొన్ని ఉదాహరణలనూ ఇస్తూ కృష్ణశాస్త్రి కవితలో ఇంద్రియానుభూతిని మీరిన సంజ్ఞాప్రధానమైన భావచిత్రణ ప్రభావం మనకు అవగాహన అవుతుందనీ,

ఇపుడు నేనొక్క తుదిరేయి ఇరులచాయ
నై నశించుచున్నాను...

అని వర్ణించిన నిస్పృహార్తమై మృత్యురావంలోనే, కవి మరుక్షణంలో పొందగల విభాతోజ్జ్వలపరివర్తన స్ఫురితమవుతుంది-అన్నాడు, మల్లవరపు విశ్వేశ్వరరావు.

ఆ మల్లవరపు విశ్వేశ్వరరావు కవితను విమర్శిస్తూనే శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావు తమ మొదటి రేడియోపుస్తకసమీక్షలో ఇలా అన్నారు:

ఈనాటికి తెరచి మీటినావు
బాల! నా బ్రతుకు!

అని ధన్యవాదాలు చేస్తాడు, కవి. ఈ కావ్యంలో కవి తనకు కలిగే ఆశ, నిరాశ, దివ్యములైన అనుభవాలు వర్ణించాడు"-అని, రామకోటేశ్వరరావు అంటారు: "ఎవరో ఒక కవికి సంబంధించిన ఈ అనుభవాలూ, ఈ విలాసాలూ కావ్యంగా ఎందుకు వ్రాయాలి? లోకానికి వీటితో ఏమి ప్రసక్తి?"- అంటారేమో? అనుభవాలు లోకంలో అనేకమందికి వస్తూనే ఉన్నవి. కాని, జీవితమనే సముద్రాన్ని మథించి అందులో వెలువడే అమృతాన్నీ, హాలాహలాన్నీ సమంగా ఆస్వాదించి, ఆ అనుభవంవల్ల తాము తరించి, ఇతరులను తరింపజేయగల శక్తి కవులకే ఉన్నది. ఇంత చిన్నతనంలో (1938) ఇంత ఉత్తమ కావ్యంవ్రాసి ధన్యుడైన విశ్వేశ్వరరావు ఆంధ్ర కవితా కన్యకు ఇంకా ఎన్నిఅలంకారాలు దిద్దుతాడో: పోను పోను, సమాసభూయిష్ఠమైన సంస్కృతశబ్దజాలాన్ని తగ్గించమనీ, పదముల రవళికయొక్క సమ్మోహనమునుండి తప్పించుకోమనీ కోరుతున్నాను," అన్నారు, రామకోటేశ్వరరావు ఆల్ ఇండియా రేడియోనుండి ప్రసారమైన మొట్టమొదటి పుస్తకసమీక్షలో.

మొదటి పుస్తకసమీక్ష రామకోటేశ్వరరావుగారు ప్రసారముచేస్తే, ఆ తరువాత పుస్తకసమీక్షను బుర్రా వెంకటసుబ్రహ్మణ్యాన్ని చేయమని కోరాము. బుర్రా సుబ్రహ్మణ్యము చాలా బాగా చదువుకున్నారు. ముఖ్యంగా, ఆంగ్లనాటికలు వారికి అభిమాన విషయము. తెలుగుభాష అంటే చాలా ప్రియము. వారూ కథానికలు వ్రాస్తారు. మంచి విమర్శకులు. త్రివేణిపత్రికానిర్వహణలో రామకోటేశ్వరరావుకు కుడిభుజమువంటివారు, అప్పుడూ ఇప్పుడూ కూడా.

రామకోటేశ్వరరావు తమ పుస్తకసమీక్షకు పుస్తకములు తామే సూచించారు. ఈక్రొత్తపుస్తకాలువచ్చినవి, అవితెప్పించండి, వానిని సమీక్షచేస్తానుఅన్నారు. అల్లాగే ఆ పుస్తకాలు, విశ్వేశ్వరరావు 'కల్యాణ కింకిణీ', శివశంకరశాస్త్రి 'వకుళమాలిక', వేదుల సత్యనారాయణ 'దీపావళి'వారు సమీక్షించారు. కాని, బుర్రాసుబ్ర

ఇంగ్లీషునుండీ రావలసిన అనువాదాలు వచ్చివేశాయి. స్వతంత్రరచన సాగడానికి అనువైన చైతన్యము జనులలో లేనట్టే కనిపిస్తుంది. మరి ఈ చైతన్యము ఎప్పుడు కలుగుతుందో, అని చెపుతూ, ఉత్తమ సాహిత్య లక్షణాలూ, విదేశాలలో ఏదో ఒక సంఘటన జనులను ఉద్రూతలూగించినపుడు తత్ఫలితంగా క్రొత్త రచన ఎలా వెలువడిందో నిరూపించారు, తమ ప్రసంగములో సుబ్రహ్మణ్యము. వారికి గల అశేష భాషాజ్ఞానమూ, విమర్శనాపటిమా వ్యక్తమయ్యాయి, ఆ ప్రసంగంలో. పర్యవసానము: ఏవో రెండో మూడో పుస్తకాలను విమర్శించడమునకు బదులు సాహిత్యావతరణ, సాహిత్యలక్ష్యము వీనినిగురించి అద్భుతమైన ప్రసంగము ప్రసారమైనది, తలవని తలంపుగా, వక్త ప్రతిభావంతుడు కాబట్టి.

క్రొత్తగా నెలకొల్పిన శాసనసభా సమావేశములను గురించిన్నీ సమీక్షలు ప్రసారమగుతుండేవి. వీనిలో మొదటి సమీక్ష, ఇంగ్లీషులో, మా పినతల్లి రుక్మిణమ్మగారు ప్రసారము చేశారు. ఆ ప్రసంగమప్పుడు నేనే వారితో స్టూడియోలో ఉన్నాను. ఆమె తన పరిశీలనలో కొందరు ప్రముఖ సభ్యులనుగురించి చెపుతూ ఛలోక్తిగా ఇలా అన్నారు: 'ప్రభుత్వపు బెంచీల'కేసి చూడడముతోనే మన దృష్టిని ఆకట్టేది నవయవ్వనుడైన గోపాలరెడ్డి నవ్వుముఖము. ఇంతటి చిన్నవయసులోనే గోపాలరెడ్డి మంత్రిపదవిని అలంకరించడము ఎంతో ముదావహము,- అన్నారు, రుక్మిణమ్మగారు, తమ ప్రసంగంలో. ఆమె ప్రసంగం పూర్తి ఐనాక నేను, శ్రోతలు ఫలానావారి సమీక్ష విన్నారు అని చెప్పి, స్టూడియోను 'ఆఫ్' చేసేలోపుగా ఆమె అన్నారు, నాతో: "అతను ఏమీ అనుకోడుగదా, అతనిని నవయవ్వనుడు అన్నాననిః"-అని. రుక్మిణమ్మగారు అనిన ఈ మాటలున్నూ వినిపించాయి శ్రోతలకు!! నేను ఖంగారుపడి స్విచ్‌ని మరి రెండుసార్లు నొక్కి-స్టూడియోను 'ఆఫ్' చేశాను. ఇటువంటి తమాషాలు జరుగుతూండేవి,అప్పుడప్పుడు- మాకు అనుభవము తక్కువ, అప్పటికి, కాబట్టి.

రుక్మిణమ్మగారు చక్కగా వీణ వాయింపగలరు, కూడ. ఆమె ప్రఖ్యాత వీణావిద్వాంసురాలు వీణ ధనమ్మాళ్‌వద్ద ఒక పదిఏండ్లు అభ్యాసము చేశారు. రేడియోనిలయము నెలకొల్పినాక, మా డైరక్టర్ రుక్మిణమ్మగారిని ఒక నలభై

సాగుతున్న యాత్ర

ఆ రోజులలో నేను శాసనసభ సమావేశాలకు తరుచు వెళుతూండే వాడను. చర్చలు వినడానికి కాకుండా, నేను రేడియో కార్యక్రమవిషయాలను గురించి కలుసుకొనవలసిన మంత్రులుగాని, శాసనసభ్యులుగాని వెంటనే నాకు దొరికేవారు అక్కడ, అని. శ్రీ బులుసు సాంబమూర్తి తమ స్పీకర్స్ గాలరీలోకి నాకు ప్రవేశము ఇప్పిస్తుండేవారు.

ఒకసారి ఇలా వెళ్ళినప్పుడే, శ్రీ టి.టి. కృష్ణమాచారిని కలుసుకున్నాను. ఆయన అప్పుడు పూర్తిగా విదేశరీతి దుస్తులతోనే ఉండేవారు. అంతేగాక, ఆయన మద్రాస్‌లోని ఆంగ్ల వాణిజ్యసంస్థల తరపున సభ్యులుగా వచ్చారు కూడా. ఆంగ్లేయులతో సమంగా వ్యవహరిస్తూ వారి మన్ననలను పొందుతూన్న ఆయనను చూడగా నాకు చాలా ముచ్చటైంది. సభలో మాట్లాడేటప్పుడు విపరీతమైన చాకచక్యమును ప్రకటించేవారు. అప్పుడు ఆయన 'ఇండిపెండెంట్'గా ఉండి ప్రభుత్వపద్ధతులలో కొన్నిటిని తీవ్రంగా విమర్శించడానికి జంకేవారు కారు. ఐనా, ఆయన అభిప్రాయాలను చాలా జాకరూకతతో వినేవారు అన్ని కక్షలవారూ. ఆయన మాట్లాడడము తీరున్నూ మిక్కిలి సొంపుగా ఉండేది. ఆయనతో అల్లా మాట్లాడుతూ ఉండిపోవాలనే నేను రెండు మూడు పర్యాయాలు ఆయనవద్దకు వెళ్ళేవాడను. వాణిజ్య సంస్థల తరపున సభ్యుడైనా, ఆయనకు ఇతర విషయాలందున్నూ చాలా ఆసక్తి ఉండేది. ముఖ్యంగా సంగీతసాహిత్యములందు ఆయనకు మిక్కిలి ప్రీతి.బహుశా ఈ సమాన అభిరుచే నన్ను వారిదెసకు ఇంకా తీసుకువెళ్ళినదేమో.వారున్నూ,నేను తమకంటే చాలా చిన్నవాడను ఐనా, అనేక విషయాలనుగురించి నాతో చర్చిస్తూ, మానసికంగా తమకు సమానునిగానే భావిస్తుండేవారు. ఆయనకు పుస్తకాలంటే తగని ప్రీతి. నాకున్నూ. తదుపరి, ఆయన ఒక బ్రహ్మాండమైన పుస్తక భాండాగారాన్ని సేకరింపకలిగారు. నేనూ కొన్ని కొన్ని అతి విలువగల పుస్తకాలను సంపాదించాను. మద్రాస్‌లో కొన్ని పెద్దపుస్తకాల షాపులవారు కొన్ని విలువగల గ్రంథాలను రెండే రెండు ప్రతులను తెప్పించేవారు: ఒకటి, కృష్ణమాచారిగార్కి, ఒకటి, నాకు. ఇటీవల వారిని కలుసుకున్నదికూడా, ఒక పుస్తకాలషాప్‌లోనే. క్రొత్తగావచ్చిన పుస్తకాలను పరిశీలిస్తున్నారు, ఆయన. క్షణం ఆ వ్యాపకము మాని

సాగుతున్న యాత్ర

ఏ సుముహూర్త మందుననో యీ
వరుదెంచి సువర్ణ పాద వి
న్యాసముతోడ, నా గృహము నంత
పునీతము జేతువంచు నే
నాసల మున్గిపోయి ప్రణయార్ద్ర హృదం
తర సీమయందు నీ
కై సఖి! దాచి యుంచితి సుఖంబుల
ప్రోవులు భావనామణుల్!

"సుఖంబుల ప్రోవులు భావనామణుల్"

క్షణంలో, పద్యాన్నంతా అద్భుతమైన అలౌకిక సుకుమార భావము ఆవహించివేసింది!

ఈ గీతములోనే, కవి అంటారు:

జీవిత మెల్ల నీకొరకు చేయుచునున్న
మహాతపస్సు; నె
త్తావుల గుమ్మరించు సుమదామము
నై భవదీయ కైశిక
స్థావరమూన జేతు!......అని

నిజమే! జీవితమంతా ఎందుకోసమో, ఎవరికోసమో చేస్తూన్న మహాతపస్సు.... మహాతపస్సే!

వస్తువు అట్టిది, రచన అట్టిది, ప్రదర్శన అట్టిది. అయ్యగారి వీరభద్రరావు సిద్ధార్థునిగా ఎంతో ఉదాత్తత ఒప్పించారు. యశోధర కొమ్మూరి పద్మావతీదేవి. సిద్ధార్థ నిష్క్రమణానంతరం ఉంచిన 'లేపనైనా లేపలేదే' అనే బసవరాజు అప్పారాయ కవి పాట పద్మావతి చాలా అనుభవిస్తూ పాడారు, ఎంతో జాలిగా. ఆమె ఆక్రందనము వింటూఉంటే కన్నులు నీరుగ్రమ్మాయన్నమాట!

పిలకా గణపతిశాస్త్రి సిద్ధహస్తుడు. ఈతరము భావకవులలో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రికీ,పిలకా గణపతిశాస్త్రికీ ఉన్నంత సంస్కృతభాషాజ్ఞానము మరెవ్వరికీ లేదు-నాకు తెలిసినంతమటుకు. హనుమచ్ఛాస్త్రికి సంస్కృతకావ్యాలు కొట్టిన పిండి.

పిలకా గణపతిశాస్త్రిని నేను మొట్టమొదట 1933లో అనుకుంట కలుసుకుంట.స్నేహితుడు జనమంచి కామేశ్వరరావు నన్ను ఆయనకు పరిచయము చేశాడు రాజమహేంద్రవరము గోదావరిఒడ్డున, మార్కండేయ దేవాలయము ప్రక్కన, ఒకనాటి ఉదయాన. అప్పుడు ఆయన ఒక విద్యాలయంలో సంస్కృత పండితులుగా ఉండేవారు. ఆదర్శబ్రహ్మచారికీ, ఉపనిషత్‌వేత్తకూ ఉండవలసిన గొప్పవర్చస్సు కనిపించింది, నాకు ఆయన ముఖములో, చూచీ చూడడముతోనే. ఆయన కంఠస్వరము ఎంతో ఆప్యాయంగా ఉంటుంది. ఆయన మాట్లాడేతీరున్నూ మనలను ఆయనకు ఎంతో దగ్గరగా తీసుకువెళ్ళుతుంది. ఆయన అంతరంగములో ఉన్న సద్భావమంతా వెంటవెంటనే వెల్లడి అవుతూ ఉంటుంది, ఆయన అల్లాచనువుగా మాట్లాడిన ప్రతిమాటలోనూ. ఆయన కళ్ళు మిక్కిలి అమాయకంగా ఉన్నా, ఏదో గొప్ప తీక్షణత ప్రకాశిస్తూ ఉంటుంది, ఆయన చూపులలో. మాటలసందర్భంలో, సంస్కృతభాషావిషయాన్ని గురించిన ఏదైనా ప్రస్తావనవస్తే ఒక విపరీతపు ఉద్వేగమూ వస్తుంది, ఆ చూపులలోకి.

నేటి భావకవులలో అంతటి లోతైన, విశాలమైన సంస్కృతభాషా జ్ఞానము అరుదు కాబట్టి సంస్కృతభాషలో ఏవిషయాన్నిగురించైనా తెలుసుకోవాలి అంటే నేను గణపతిశాస్త్రిని అడుగుతూ ఉంటాను, ప్రత్యక్షంగా కలుసుకొనిగాని, టెలిఫోన్‌లోగాని. ఒకసారి, ఉపనిషత్తులోని 'హిరణ్మయేన పత్రేణ'అనే సూక్తిని

న్నాను: మీరు ఏమీ అనుకోకపోతే ఒక చిన్నమాట చెప్పాలి. ఇప్పటివారు ఈ అభ్యంతరం పాటించడములేదు అంతగా; కాని, 'విరికన్నియ' స్త్రీలింగము కాబట్టి 'విశ్వమోహనము' అనడముకంటే 'విశ్వమోహిని' అంటే బాగుంటుందేమో ఆలోచించండి" అన్నారు. నేను వెంటనే ఆ సవరణ చేశాను: 'విశ్వమోహిని ఈ విరికన్నియ' అంటూ తతిమ్మా పద్యమున్నూ చదువుతూంటే:

కన్నులపండువ మాత్రమెంతో
మిన్నుమ్మన వెలసిన శతపత్రము!!

అనేసరికి, "ఏదీ మళ్లా చదువండి, ఒకసారి" అని, విని, "చాలా బాగా కుదిరించండి-చాలా బాగుందండి, భావము"అన్నారు. ఇలా పద్యం అంతా శ్రద్ధతో విని, శ్రమ అనుకోకుండా, మంచి సలహాలనిచ్చారు నాకు.

పిలకా గణపతిశాస్త్రీ, నేనూ ట్రామ్‌లోనో, బస్‌లోనో కలుసుకుంటూ ఉండేవారము, తరుచు. నాకు కార్ ఉన్నరోజులలో, ఒకొక్కప్పుడు ఆయన నాకు రోడ్ మీద కనిపిస్తే, కార్ ఆపి ఆయనను కార్‌లో ఎక్కించుకునేవాడను. ముందు ఆయన వెళ్ళవలసిన చోటికి ఆయనను తీసుకువెళ్ళి దిగబెట్టి, తరువాత నాపనిమీద వెళ్ళేవాడను. ఆయన కార్‌లో కూర్చున్న ఉత్తర క్షణమే, ఏదో ప్రాచీన సంస్కృత సాహిత్యవిషయాన్నిగురించే మా ప్రస్తావన ప్రారంభించేది. విశేషాలేమిటనిగాని, మీ రెలాఉన్నారు, వారెలాఉన్నారు అనే వ్యర్థ ప్రసంగముతోగాని కాలయాపన మయ్యేదిగాదు. వెంటనే ప్రారంభించేవాడు ఆయన: "మరండీ; రఘువంశంలో ఆ దిలీపచక్రవర్తి అంటాడుకదా"- అంటూ, నా కిదివరకు తెలియని అద్భుతవిషయాలను గురించి చెప్పుకుపోతూ. కొంతసేపయ్యాక, సమకాలిక సాహిత్యచర్చ వచ్చి: "మీరు బాగా చదివి ఉంటారు, టి. ఎస్. ఇలియట్ ప్రత్యేకత ఏమిటండీ-అతనిని అందరూ అంతగా మెచ్చుకుంటున్నారు?" అని, ప్రశ్నించేవారు నన్ను.

తనకు కొన్ని కొన్ని విషయాలు తెలియవు అనే నామోషీ లేదు, ఆయనలో, ఏమాత్రమూను. అందుచేతనే ఆయనంటే నాకు అంత ఇష్టము.

పనిగట్టుకు వచ్చిన ఫ్రెంచ్‌పండితులతోనూ, ఆ రాజ్యపు ప్రధాన ఉద్యోగస్తుల తోనూ, మద్రాస్‌లో ఉన్న ఫ్రెంచ్‌భాషాప్రియులతోనూ. రకరకాల తినుబండారాలు బల్లలపై పళ్లాలలో పరచి ఉన్నవి. తెల్లనిదుస్తులు ధరించి వెయిటర్‌లు, వచ్చిన వారికి వానిని అందిస్తున్నారు చల్లని, వెచ్చని పానీయములతో, వారివారి ఇష్టముల ననుసరించి. నేను ఆ హాలులో ప్రవేశించేసరికి ఒకమూల నక్కి నిలబడి ఉన్నారు. పిలకా గణపతిశాస్త్రి!

నాకు నవ్వువచ్చింది. "ఏమండీ! ఇలా ఒక్కరూ ఈ మూల నిలబడి ఉండిపోయారు!!" అన్నాను. ఆయనను సమావేశానికి తీసుకొనివచ్చిన మార్సెలా ఫ్రెంచ్‌కాన్సల్‌తో మాట్లాడుతూ ఉండిపోయినది చూస్తూ.

నన్ను చూడడముతోనే పిలకా గణపతిశాస్త్రికి ప్రాణం లేచివచ్చినట్టని పించింది."అమ్మయ్య!"అనలేదు కాని,అన్నట్టు వినిపించింది నాకు, "మీరొచ్చారు, ఇక ఫరవాలేదు!" అన్నట్టూనూ.

"ఏమోనండి! ఇంత హడావుడిగా ఉంటుంది అనుకోలేదు నేను. మీ రొచ్చారు, సంతోషము!" అన్నారు, ఆయన. మేమిద్దరమూ ఒకచోట కూర్చు న్నాము. వెయిటర్లు పళ్ళాలుతీసుకు మావైపు రావడముచూచి, భయపడుతూ భయ పడుతూ నాతో అన్నారు, ఆయన: "ఆ వస్తువులు నేను తినవచ్చో, తినకూడదో, మీరే చెప్పాలి!" అని. "మరేం ఫరవాలేదు! నేను రుచిచూచినవన్నీ మీరూ రుచి చూడవచ్చు, నేనున్నానుగా!" అన్నాను నేను నవ్వుతూ.

కాని, మేమిద్దరమూ అక్కడ ఎక్కువసేపు ఉండలేదు. ఆ వాతావరణం నాకు సహించలేదు, ఆయనకు అసలే సహించలేదు. కాస్సేపటికి ఇద్దరమూ బయ టకు వచ్చివేశాము. నా కార్‌లో ఎక్కి అలా సముద్రమువేపు వెళ్లాము. త్రోవలోనే ఆయన ఆమధ్య రచిస్తూవచ్చిన 'హృదయోపహారము' అనే కావ్యంలో కొన్ని పద్యాలు చదివారు:

ప్రేమశిరీష మోహానపరిమళ
మంతయు గోయబోవ, లో

అందమొక యెత్తు! ఆశ్చర్యమును గొలిపే ఒక వింత సొబగుఉన్నది గణపతి శాస్త్రి చిత్రించిన భావములో. "అంతా ఐపోయింది, ఇక, ఈ జీవితానికే స్వస్తి" అనిపించి, మరు నిమిషమే పునర్జన్మ కలిగిస్తారు, ఆయన ఈ పద్యంలో:

ఈవాక వేళ వచ్చుసరికీ మెయిజీవన
దీపమారిపోయే
పోవునో! దానికే తరలిపోయెదవో సుమి!
దివ్యదీప్తి! బా
ష్పావృతమైన నీ యధర మల్లన సోకిన
యంతలోనె తా
రావిచలత్కనీనిక లరాళత నిన్గని
చొక్కు నిర్వృతిన్!

బొమ్మ బాగాఉంది, భావమూ బాగుంది!

ఐతే, "ఆ తారుణ్యోజ్వల రాజకుమారా!" అనే పాట జ్ఞప్తికివచ్చినపుడల్లా నాకు ఒక విశేషము జ్ఞాపకమొస్తుంది. ఒక ప్రఖ్యాత సినిమాప్రొడ్యూసర్ నాకు స్నేహితుడు. మేము తరుచు కలుసుకుంటూ ఉంటాము. ముఖ్యంగా, ప్రతి రోజూ ఉదయం సముద్రపుషికారు వెళ్ళినపుడు, ఆతడు నాకు తటస్థమగుతూంటాడు. ఇద్దరమూ కలసి ఒక మైలో, ఒక క్రోసో నడుస్తూఉంటాము సముద్రపు ఒడ్డున, ఈమాటా ఆమాటా మాట్లాడుకుంటూ. తప్పనిసరిగా, అతను తీస్తున్న, తీయబోయే క్రొత్త పిక్చర్ నిగురించిన ప్రస్తావన వస్తూ ఉంటుంది. ఒక పర్యాయం అతను తను నిర్మిస్తూన్న ఒక కొత్తచిత్రంలోని సన్నివేశాన్ని గురించి వర్ణిస్తూ నాతో అన్నాడు: "ఇక్కడ, యువరాజును నర్తకి ప్రాపంచికవిషయాలదెస రంజింపచెయ్యాలి, ఇక్కడ ఒక మంచిపాట కావాలి నాకు; నీవేదైనా పాటను సూచింపకలవా?" అని. నాకు వెంటనే, పరిత్యాగము నాటికా, 'తారుణ్యోజ్వల

అసమర్థులై పాతకావ్యములను చదువలేక ఆ ధోరణిలో వ్రాయలేక ఇందులో దిగినట్టు కనబడలేదు. ఎందుచేతనంటేఎన్నో పూర్వకావ్యాలలోని సంస్కృతులు ఈనాటి కావ్యాలలో మెరుగులతో కనబడుతున్నాయి. మనుష్యుని రాగద్వేషాలూ, మోదఖేదాలూ,మానావమానాలూ, సుఖదుఃఖాలూ ఎప్పుడూ ఒకటే. వాటి నెవరూ మార్చరు. మార్చితే రసభంగం అవుతుంది. కవిత్వమునకు ఎప్పుడూ ప్రధానమైనది ఆనంద నిష్యందమూ, చమత్కారభావ ప్రదర్శనమూను" అన్నారు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి తమ రేడియోప్రసంగంలో.

కాని, ఆ రోజులలోనే, అనగా 1938 లో, 'నేటి తెనుగు కవితలో క్రొత్తపోకడలు' అనే విషయాన్నిగురించి రేడియోలో మాట్లాడుతూ శ్రీశ్రీ వెలిబుచ్చిన దృక్పథానికీ, హనుమచ్ఛాస్త్రి దృష్టికీ చాలా వ్యత్యాసమున్నది, మొదట్లో కొంతవరకు ఏకీభావమున్నా. శ్రీశ్రీ అంటారు:

"ఒకటిమాత్రము నిశ్చయం. నేటి కవులు అసమర్థతవల్ల, పూర్వసంప్రదాయాలను నిరసింపలేదు. ఒక అశాంతి, ఒక అసంతృప్తి ప్రబలి, అంచులను దాటే ప్రయత్నాలలో నానా ముఖాల వీరు పరుగెత్తుతున్నారు. తాము నిరాకరించి, వెనుక వదలిన సంప్రదాయాల నిజస్థితీ అంతస్తత్వం వీరికి తెలియనిది కాదు...."

ఆ మాటలలో శ్రీశ్రీ అప్పటి ధోరణి చక్కగా వ్యక్తమవుతుంది. ఆధునిక కవులు వాడుతున్న ఛందోరీతులనుగురించీ, భాషనుగురించీ వివరించి శ్రీశ్రీ ఆ రాత్రి వారి ప్రసంగములో ఇంకా ఇలా అన్నారు:

"నిస్సందేహంగా ఇకముందు పదిసంవత్సరాలూ వచనగమకాలలో పరిశోధనలకు వినియుక్తం కాబోతున్నవి....భావకవులలో అతివాదాభిప్రాయాలతో సానుభూతికలవారందరూ ఈ క్రొత్త వాహినులకు తమ బలం ఇచ్చి శ్రేణి తీరుస్తారని ఆశింపవచ్చును" అన్నారు శ్రీ శ్రీ.

శ్రీ శ్రీ ఇంకా ఇలా అన్నారు:

తదుపరి, రాజకీయ కారణాలవల్ల ఆయన ఆ బహుమతిని నిరాకరించి నాడు.

కాని, శ్రీ శ్రీ 1938లో ఆయన రేడియో ప్రసంగమును ఇలా ముగించారు: "ఆధునికకవిత్వము అర్ధముకాదనే అతనికి ఆధునికజీవితము అర్థము కాలేదన్నమాట. అతడు కళ్ళు మూసుకున్నాడు. వెనుకబడిపోయినాడు. అసలు, అతని ప్రపంచమే శిధిలమైపోయింది. అతనిని ఉన్నచోటనే వదలిపెట్టి నూతన జీవితము హుటాహుటిగా తరుముకువస్తున్నది. నవకవులు దీనినే ఆహ్వానిస్తున్నారు. దీనినే ఆరాధిస్తున్నారు!" అన్నారు శ్రీ శ్రీ ఒక ఇరవై ఏండ్ల క్రితము.

కాని, నేను చూచినంతమటుకూ, ఈ 'నూతనజీవితము' ఏమంత చెప్పుకోతగినంతగా మనమీద వచ్చిపడినట్టు తోచదు. ఈ ఇరవై ఏండ్లలోనూ. ఇరవై ఏళ్ళక్రితము శ్రీ శ్రీ మాటలలో, 'పతనోన్ముఖమైన' పాతసంఘమూ ఇంకా కూలిపోలేదు. ఎటొచ్చీ, సినిమా నాగరికత మాత్రము సంఘాన్ని పూర్తిగా ఆవరించింది. అందరూ, నవకవులుసహా అందరూ, సినిమానాగరికతనే ఆహ్వానిస్తున్నారు, అనిపిస్తుంది.

స్సున్నూ అతితీక్షణమైన చూపులతో మిక్కిలి కుశాగ్రమైన బుద్ధిగల మునికుమారునిగా కన్నులకు విస్మయానందాలను కలిగించాడు. అప్పటినుంచీ నాకు నచికేతస్సుఅంటే గొప్ప అభిమానమున్నది.

ఈ నచికేతస్సు వృత్తాంతమే చక్కని నాటకంగా రచించారు కన్నడ భాషలో శ్రీ హిరణ్యయ్య. ఈ నాటకమునే 1938 లో మద్రాస్ రేడియో కేంద్రము నుండి ప్రసారముచేశాము, మేము. నేను కొన్ని ఏండ్లు బెంగుళూర్‌లో ఉన్నందునా నాకు కన్నడభాషలో కొంత ప్రవేశమున్నందునా రేడియోలో క్రొత్తగా ఏర్పరచిన ఈ కన్నడనాటక కార్యక్రమాలున్నూ నేనే నిర్వహిస్తూండేవాడను, ఆ రోజులలో.

ఈ రేడియోనాటకములో యమునిపాత్ర నెల్లూర్ నగరాజరావు ధరించారు. వారికి తెలుగూ, కన్నడముకూడా చాలా బాగా వచ్చును. తెలుగునాటకరంగమున ఎంత గొప్పగా రాణించారో కన్నడమునకూడ, అంతటి ప్రతిభా ఉన్నది వారికి. మా ఆహ్వానమును అంగీకరించి,ఈ రేడియో మొదటి కన్నడ నాటకము విజయవంతముగా ప్రసారము అగుటకు చాలా తోడ్పడ్డారు, శ్రీ నగరాజరావు.

నచికేతస్సుపాత్రను ప్రసన్ అనే ఒక యువకుడు నిర్వహించాడు, మిక్కిలి నిపుణతతో. ప్రసన్‌ను నాకు పరిచయము చేసినవారు శ్రీ బళ్లారి రాఘవాచార్య. ఆ రోజులలోనే 'మండోదరి' అనే నాటకప్రదర్శన సందర్భాన అనుకుంటాను, ఆయన మా నిలయానికి వచ్చినపుడు ఈ కన్నడనాటక ప్రస్తావన వచ్చి నచికేతస్‌కు తగిన కుర్రవానిని పంపుతానని, ఆ అబ్బాయిని మావద్దకు పంపారు, శ్రీ రాఘవాచారి.

ఉపనిషత్‌గాధను చక్కని నాటకముగా చిత్రింపకలిగాము, మేము. ముఖ్యంగా, నచికేతస్సు జ్ఞానతృష్ణా యముని మహాజ్ఞానసంపదా చాలా చక్కగా వ్యక్తమైనవి. సంభాషణా చకచకా నడచినది. కొన్నికొన్ని సన్నివేశాలతో, శ్రోతలకు ఎంతో విభ్రాంతిగొలిపే రీతిని రేడియోనాటక పరికరాలను ఉపయోగించి, మంచి రక్తి గట్టింపగలిగాము. ఉపనిషత్‌వాక్య గంభీరతా, అచ్చటచ్చట ఉంచిన వేదఘోషా, ఒక విపరీతపు వాతావరణను కల్పింపకలిగినవి. అన్ని

సహితము ఈ రహస్యాన్ని తెలుసుకోలేకపోయారు, తొల్లి. ఇది తప్ప మరేదైనా వరము కోరుకో!" అంటాడు, యముడు. "అంతటి గొప్ప రహస్యమైతే నాకు తప్పకుండా తెలుసుకోవాలని ఉన్నది, నీ అంతటి గొప్ప గురువు నాకు మరెవరు లభిస్తారు. నీవే నాకు ఈ రహస్యమును ఉపదేశించాలి!" అని పట్టుపడతాడు, నచికేతస్సు.

యముడు నచికేతస్సును మరపించాలని ప్రయత్నిస్తూ ఎటువంటి వారినీ మభ్యపెట్టగల గొప్ప గొప్ప వరాలను ప్రసాదిస్తానంటాడు. ధనకనకవస్తు వాహన సమృద్ధీ, ఆయురారోగ్య ఐశ్వర్యాలూ, ఇటువంటివి ఎన్నో ఇస్తానంటాడు, ఆ రహస్యమును చెప్పడానికి బదులు. నచికేతస్సును మహాసామ్రాజ్యాధిపతిగా చేస్తానంటాడు. కాని, నచికేతస్సు వీనిని కామింపడు. 'నీవు చెప్పిన ఐశ్వర్యాలూ సిరిసంపదలూ సర్వభోగాలూ సర్వేంద్రియాల తేజస్సును హరిస్తవి. ఆయుః పరిమాణము ఎంతైనా, దేహము అనిత్యమే గదా! ఈ భోగాలతో నాకేమిపని? నాకు కావలసినది ఆత్మస్వరూపజ్ఞానము. ఆ జ్ఞానమును ప్రసాదింపుము, దేవా!" అంటాడు. చివరకు యముడు నచికేతస్సు శ్రద్ధకూ, విపరీతమైన పట్టుదలకూ సంతసించి అతనిని చాలా మెచ్చుకుంటూ ఆత్మస్వరూపాన్నిగురించి బోధిస్తాడు. 'అవ్యక్త స్వరూపాన్ని' గురించీ ఊహకి అందని 'పరమపురుష' స్వరూపాన్ని గురించీ నచికేతస్సు తెలుసుకుంటాడు యమునివల్ల:

ఉత్తిష్ఠత జాగృత ప్రాప్యవరాన్ని బోధత।
క్షురస్యధారా నిశితా దురత్యయా
దుర్గం పథ స్తత్కవయో వదన్తి॥

"సానబెట్టిన కత్తికంటే పదునైన మార్గముకలది ఈ ఆత్మతత్వసాధన, తెలుసుకో, నచికేతా!" అంటాడు, యముడు. 'అశబ్దం, అస్పర్శం, అరూపం, అవ్యయం, అరసం, నిత్యం, అనాది, అనన్త-ఐన, పరమాత్మ స్వరూపాన్ని తెలుసుకోకలిగిన అతడే జీవన్ముక్తుడు కాగలడు అని, యముని బోధనవల్ల తెలుసుకుంటాడు నచికేతస్సు.

టించాలిగాని సంకుచితబుద్ధితో, తమ ప్రేమను ఒక విలువగల స్థిరాస్తిగా భావించి, దానిని అంటిబెట్టుకు ఉండిపోగూడదు. ఎటువంటి సందర్భములోనూ ప్రేమ సంతోషాన్నీ, ఆనందాన్నీ ఇయ్యాలిగాని, నిస్పృహనూ, విషాదాన్నీ కలిగింప కూడదు. ఈ భావము నాలో అంతకంతకు కొంత పరిణతికి చెందుటవలన కాబోలు, రేడియోకోసము నేను రచించిన మొదటి సాంఘిక నాటిక ఆ ధోరణినే నడిచినది. 'ప్రేమపరీక్ష' అనుకుంటాను, ఆ నాటకము పేరు. ఆ నాటకము సామర్ సెట్ మామ్ 'సీజర్స్ వైఫ్'ను చదివాక వ్రాసినది. పాత్రల మాతృకలున్నూ మామ్ సృష్టించినవే. నా నాటకము వాతావరణ మాత్రము పూర్తిగా మన వాతావరణే. ఎటొచ్చీ, కథ షిల్లాంగులో జరుగుతుంది. దివాన్ విశ్వేశ్వరరావు మేధావి, ప్రతిభావంతుడు, ధర్మశీలి. అతను తన నలుబదిఐదవయేట తనకంటే పాతిక ఏండ్లు చిన్నదైన లలితను పెండ్లాడుతాడు. లలిత అతిరూపలావణ్య, సౌజన్యరాశి. విశ్వేశ్వరరావు ఆమెను మనసార ప్రేమించినా అతని సిరిసంపదలనూ హోదానూ కుటుంబప్రతిష్ఠలనూ చూచి అతనిని వివాహమాడిన లలిత మాత్రము మొదట అతనిని ప్రేమింపకున్నా, అతని మంచిగుణాలవల్లా, అతను చూపుతూ వచ్చిన అనురాగాతిశయంవల్లా అతనిని భర్తగా పూజిస్తూ అన్నివిధాల అతనికి సంతోషము చేకూర్చడానికి ప్రయత్నిస్తూంటుంది. ఇలా ఉండగా, విశ్వేశ్వరరావువద్ద ఆంతరంగిక కార్యదర్శిగా మిక్కిలి రూపవంతుడూ చాలా తెలివిగలవాడూ, ప్రయోజకుడూ ఐన మోహన్ వస్తాడు. మోహన్ విశ్వేశ్వరరావుకు దూరపుబంధువు. అందువల్ల, మోహన్ వీరింటిలో చనువుగా తిరుగుతూఉంటాడు. అంతేగాక, మోహన్‌కు వయొలిన్ బాగా వచ్చును. లలిత కొన్నాళ్ళు వయొలిన్ సాధకముచేసి, పెండ్లి ముందు మానివేసింది. ఆమెకు ఈ సంగీతమందున్న అభిరుచిని గుర్తించి, విశ్వేశ్వరరావే మోహన్‌ను తన భార్యకు వయొలిన్ నేర్పవలసినదిగా నియమిస్తాడు. సమానవయస్కులూ, సమానఅభిరుచులుగలవారూ ఐన లలితామోహనులు ఒకరినొకరు ప్రేమింపక తప్పదు. మోహన్ కాకపోయినా, లలిత ఈ ప్రేమను నిరోధించడానికి,శాయశక్తులా ప్రయత్నిస్తుంది. కాని,సుడిగాలివంటి ఆ ప్రేమను ఆమె అరికట్టలేకపోతుంది. పరిస్థితులు ఇలా పరిణమిస్తవని సందేహించిన మోహన్‌పినతల్లి అతనిని మరో రాష్ట్రానికి, ఇంతకంటే పెద్ద ఉద్యోగంలోకి పంపే యేర్పాటు

వెంటనే ఆమెను పెండ్లిచేసుకుంటాడు. ఈ వివాహము లలితకు బాధకలిగించక తప్పదు. కాని, ఈసారికిన్నీ భర్త ఆమెను ఓదారుస్తాడు, "లలితా! నీ కొకమాట చెప్పనా! మోహన్ ఆ క్రొత్త అమ్మాయిని అంత హడావిడిగా పెండ్లిచేసుకోడానికి కారణము ఏమిటో తెలుసా?........ఆ అమ్మాయిలో నీ రూపమును చూసుకుంటు న్నాడు మోహన్! పోనీ ఈ విధంగానైనా అతనిజీవితంలో పరిపూర్ణత్వం కలిగితే కొంతమంచిదే!" అంటూ. భర్త ఈ అతిఉదారస్వభావము లలితనుపూర్తిగా ఆమెభర్త దెస భక్తురాలిగా మార్చివేస్తుంది. నాటకములో అక్కడక్కడ మాత్రము విశ్వేశ్వర రావు అంత ఉదారవంతుడైనా అతనిజీవితము ఒంటరిజీవితమనీ, త్యాగమయు లకూ, సంతోషానికీ చాలాదూరమనీ, వ్యక్తమగుతూ ఉంటుంది. అతని ఉదారత్వా నికి అతనిని ఎంత మెచ్చుకుంటామో అతని ఏకాకి మనుగడకు అతనిపైన అంత జాలీ కలుగుతుంది మనకు.

ఈ నాటకము, పేరుకు, సాంఘిక నాటకమైనా ఎక్కువగా వ్యక్తుల భావపరంపరలను చిత్రిస్తూ, వారివారి అంతరంగములను ప్రస్ఫుటముజేసే మనస్తత్వ పరిశీలనగా పరిణమించినది. దివాన్‌గా అయ్యగారి వీరభద్రరావు, లలితగా కొమ్మూరి పద్మావతి చాలా బాగా నటించారు. ఆ యా సన్నివేశాలలో నేపథ్య సంగీతము చాలా అనువుగా కుదిరి ఇతర రేడియోనాటక పరికరాలున్నూ బాగా సమకూరినవి. ఒక్కొక్కచోట మాత్రము నేను ఆశించిన వాతావరణమునకూ తేగలిగిన వాతావరణకూ తేడా లేకపోలేదు. ముఖ్యంగా, మోహన్ లలితకు వయొలిన్ ఆఖరి పాఠము నేర్పే సన్నివేశంలో, అపట మాటలు మోహన్‌వి అయినా, వాద్యము నిలయవిద్వాంసుడు వాయించాలి. అతను సప్తతంత్రుల వయొలిన్‌పైన వాయించే గొప్ప నిపుణుడు. ఈ నాటకమునకు అంతటినిపుణత అవసరములేదు. కాని, అతనిని ఈ నాటికకు ప్రక్కవాద్యకునిగా నియమించారు. కాబట్టి, ఆ వయొలిన్ పాఠము అతనే చెప్పవలసి వచ్చింది. చాలా జాలిగా ఉండాలని నేను 'క్షీరసాగర శయనా' అనే దేవగాంధారి కృతిని ఉంచాను ఇక్కడ. లలితామోహన్‌ల ఇచ్చటి సంభాషణ మూడు నిముషాలలో అయిపోవాలి. కాని నిలయవిద్వాంసుని దేవగాంధారి ఆలాపనా, పల్లవీ, అనుపల్లవీ, వీనికి పదినిముషాలైనా చాలవు. ఆ సన్నివేశములో చప్పున దేవగాంధారి రాగముద్వారా విపరీతపుజాలిని స్ఫురింపజేసి లలిత వెక్కి-

చాము. ఆ ఉద్దేశముతోనే 'అనూరాధ' నాటికను నిలయపు నటీనటులచే చదివించానుకూడ. కాని, ఆ నాటకమును చదివించినకొద్దీ ఆ గొప్ప రచనను ప్రదర్శింపగల నటులూ లేరు, విని ఆనందింపగల శ్రోతలూ లేరు ఇంకా మన సమాజములో అని ఆ యత్నమును విరమించుకోవలసివచ్చింది.

జనవరి 1939లో నాకు తిరుచునాపల్లి బదిలీ అని ఉత్తరవు వచ్చింది, కొంత సంతోషమూ, కొంత విచారముకూడా. మరొక క్రొత్త రేడియోనిలయపు నిర్మాణములో నాకు అవకాశము కలుగుతూంది. మరొక భాషలోని అందచందాలను లక్షలాది జనులకు వెల్లడిచేయవచ్చును అని ఉత్సాహము. కాని, ఈ ఏడాదిలోనూ, మద్రాసు నాకు చాలా అలవాటైనది. ఎంత వద్దనుకున్నా నా వ్యక్తిగత జీవితములోకి కొన్ని కొన్ని క్రొత్త ప్రభావాలు ప్రసరించి, చీకటిమనుగడలో కొంత కాంతి నియ్యసాగినవి. ఈ ప్రభావములనుంచి దూరమగుట కష్టమే! కాని అది తప్పనిసరి; నాకు మంచిదీకూడా!

కావేరీతీరమున పవ్వళించిఉన్న శ్రీ రంగనాథస్వామి పిలుపు వినిపించింది. ఉత్సాహముతో సిద్ధమయ్యాను నేను.

భాగమంతా, గోడలపైనా, కృష్ణలీలలూ, భాగవత పురాణగాధలూ చిత్రించిఉన్నవి, మన బందరుకలంకారీ బొమ్మల తీరున. ఒక్కొక్కగాధనూ తెలియజెప్పుతూ తెలుగులో రచన! ఉత్సాహంతో కేకవేశాను నేను: "ఇదంతా తెలుగే!" అని. స్థానికులు పార్థసారధి అన్నారు:"అవును; ఇచ్చట దేవాలయఅలంకరణ అంతా తెలుగువారే చేస్తూ వచ్చారు. విజయనగరరాజుల పోషణంలో ఉండేవికావా, మరి, ఈ ఆలయాలు!"అని. నేను చాలాచాలా గర్వించాను తెనుగునాటికి ఇంతదూరాన, లక్షలాది నానాదేశ ప్రజలూ దర్శించి తరించే ఈ పుణ్యస్థలాన, పురాణగాధలను ఇలా తెలుగు భాషలో వర్ణించి చెపుతూ, ఇలా తెలుగు శిల్పులు చిత్రించి ఉన్నందుకు!

రంగనాయకి విగ్రహమును చూచి నేను అట్టే నిలచిపోయాను-ముందు అడుగువెయ్యడానికి కాలు కదులలేదు. ఆ కన్నులలోని చల్లని చూపులు నన్ను కట్టివేశాయి. తీర్చిదిద్దిన ఆ నాసికను అలంకరించిన నత్తూ, అడ్డబాసా నన్ను విస్మితునిచేసి, ఆ కనకాంబరపు చీర నాలో ఏవో ఏవో అనిర్వచనీయమైన ప్రేమతో కూడిన భక్తిభావాలను రేకెత్తించినది. సన్నని ఆ నడుముచుట్టూ వెడల్పైన బంగారపు వడ్డాణము. మువ్వల వడ్డాణము, దీపపు కాంతిలో ధగధగ మెరిసిపోతోంది. అప్పుడు నాకు ఒక వెర్రి ఆవేశం కలిగింది. దేవికి కుడివైపుఉన్న పళ్ళెంలోని గులాబీ పువ్వులను తీసికొని ఒక్కొక్క పువ్వూ ఆ వడ్డాణము చుట్టూ అలంకరించాలని! వెర్రిఊహ!.... అర్చకుని అష్టోత్తర పఠనము నన్ను మేలుకొలిపింది. ఆ తర్వాత హారతీ, ఇత్యాదులు. చిన్న వెండిగిన్నెలో శ్రీచందనమూ, కస్తూరీ, పచ్చకర్పూరమూ రంగరించి మనకు ఇస్తారు; అంటే, అతిముఖ్యులైన భక్తులకు.అది ఒక గౌరవము. నవనాగరీకులు ఈ చందనాన్ని కొనవ్రేలుతో తాకి నుదుట నుంచుకుంటారు. నేనుమాత్రము దోసిలిలో తీసుకుని చెంపలకూ, కంఠానికీ రాచుకున్నాను. మల్లెపువ్వులాంటి మల్లుచొక్కాకు గంధమవుతుందీ అని సందేహించక. చొక్కాబొత్తాములుతీసి ఒంటికీ రాచుకున్నానుకూడా ఘుమఘుమలాడే ఈ పవిత్రమైన శ్రీచందనాన్ని,

ఆచోటు విడువలేక, విడువలేక, విడిచివచ్చాను-రంగనాయకి సమక్షమునుంచి, బయటకు. కాని, ప్రాకారము మలుపు తిరిగానో లేదో, చిత్రము, నాకండ్ల

ఉండడు. సుకుమార్ మొదట రంగనాయకిని దర్శించి, తర్వాతనే వస్తాడు, సంపత్‌ని చూడడానికి. రంగనాయకిని సేవిస్తున్నప్పుడే సుకుమార్, దేవి సమక్షాననే, మంగళాన్ని మొదట చూస్తాడు. అతడామెను చూచి ఉండలేదు ఇదివరకు, సంపత్‌ద్వారా ఆమెనుగురించి విని ఉన్నాడు. దేవిసమక్షాన ఉండగా, రంగనాయకి ధరించిన అలంకరణే, మంగళాన్ని అలంకరించి ఉండడమూ, ఆ వడ్డాణమే ఈ భక్తురాలూ ధరించడమూ సుకుమార్‌ను ఆశ్చర్యనిమగ్నుని చేస్తుంది. విభ్రాంతుడై, అపరిచితవైపు అలా చూస్తూ ఉండిపోయిన అతని గురించి ఆమె కినుక వహింపదు. అతని చూపులలోని పరమపవిత్ర భావాన్ని ఆమె అర్థముచేసుకుని అతి సాత్వికమైన చిరునవ్వు ప్రసరిస్తుంది, అతనిపైన. ఆ చిరునవ్వును అతను తన హృదయాంతర హృదయంలో పదిలపరచుకోడానికి కళ్ళు రెండూ గట్టిగా మూసుకున్న నిమిషంలో ఆమె ఆ ప్రదేశంనుంచి వచ్చివేస్తుంది. మరునాడు ఉదయము సంపత్ ఇంటికి వచ్చిన సుకుమార్‌కు వారింటి మధ్యహాలులో ప్రత్యక్షమవుతుంది మంగళము—సుకుమార్ ప్రాణస్నేహితుడైనసంపత్ భార్యగా! తలంటుకోబోతున్న ఆమె తన వడ్డాణాన్ని మెళ్లో వేసుకుని ఉన్నది. తనూ, చిన్నప్పుడు వాళ్ళ అమ్మ వడ్డాణాన్ని తన మెళ్ళో వేసుకునేవాడు. తన తల్లి, చనిపోయేముందు, వణికేచేతులతో, అతని మెళ్ళో అమర్చింది ఆమె వడ్డాణాన్ని. ఇది ఎప్పటికీ మరచిపోలేదు సుకుమార్.

భర్త ఊళ్లో లేకపోయినా, సుకుమార్‌కూ, తన భర్తకూ ఉన్న అవినాభావ సంబంధమైన అపురూప స్నేహభావాన్ని గురించి తెలిసిఉన్న మంగళము సుకుమార్‌ని ఆదరించి అతిథిసత్కారము చేస్తుంది, అతనిని వారింటనే ఉండమని పట్టుబట్టి. మిక్కిలి సంస్కారవంతురాలైన మంగళము, మాటల సందర్భాన, సుకుమార్ జీవితఉదంతము తెలుసుకుని అతనియెడ అపరిమితమైన సానుభూతిని ప్రకటిస్తుంది. ఈ సానుభూతివల్ల ఆమె సుకుమార్‌కు మరింత సన్నిహితమవుతుంది. వారిద్దరి మధ్యా ఒక గొప్ప స్నేహము అవతరిస్తుంది. ఒక విచిత్ర సన్నివేశంలో మంగళము సుకుమార్ పీడితహృదయానికి కొంత శాంతినిచ్చే ఉద్దేశంతో, అతని తల్లి స్థానాన్ని అందుకోయత్నిస్తుంది! సుకుమార్ ఆమె ఎదుట

అప్పటికింకా నా జీవితప్రాంగణములో నా ఆరాధ్య దేవత, నా సుగుణాలరాశి, జన్మతరింపజేసే నా మొదటి ప్రేమరాణి, నా 'అప్రాప్తమనోహరిణి' అడుగుపెట్టి ఉండలేదు. హరిద్వారమున గంగానదిలో పూర్ణచంద్రుని చూచినప్పుడు ఒక్క నూ అమ్మ ముఖమే కనిపించినది ఆ బింబములో. ఇప్పుడు, కావేరీజలములో చిందు లాడే పూర్ణచంద్రునిలో అమ్మబొమ్మప్రక్కనే అంత ప్రస్ఫుటంగానూ,అంత లావణ్య వంతంగానూ ఆ అందాలరాశి బొమ్మ. హరిద్వారమున నా హృదయములో అమ్మలేని బెంగ ఉన్నా అది హృదయాన్ని తొల్చివేసే బాధ కాదు. ఇప్పుడు ఈ కావేరి ఒడ్డున చంద్రబింబాన్ని చూస్తూంటే భరింపరాని ఒంటరితనములో నా లోలోపలి లోతులను కలియబెట్టి, ఏకధారగా, కన్నీరు ప్రవిస్తుంది నా కన్నుల ముందు నిల చిన 'ఆమె' ఆకారాన్ని చెదరింపజేస్తూ.

ఈ బాధ ఎప్పటికీ ఇలా వుండవలసినదే! ప్రేమికులు చెల్లించే విధా యకమైన పన్ను ఇది. ఎటొచ్చీ ఈ కన్నీటిని ఎవరూ విలువకట్టలేరు; అంతే!

*　　*　　*　　*

తిరుచ్చినాపల్లి రేడియోకేంద్రములో తొలిరోజులలోనే ప్రసారమైనది నేను రచించిన 'కర్ణ, కుంతీ' అనే తమిళ రూపకము. ఈ నాటకము రవీంద్రుని రచ నకు అనుసరణ. "తమిళభాషకు నూతన అలంకారముగా రాణించదగినది. ఇది వరకు తమిళములో ఇటువంటి నాటికలు లేవు" అని లేఖకునిగా నాకు సాయము చేస్తున్న పండితుడు అయ్యం పెరుమాళ్ కోనార్ అన్నారు. కాని, నా రచనలో తమిళమున విల్లిపుత్తూర్ మహాకవి రచించిన భారత భాగాలనూ ఉపయోగించాను. కథాప్రారంభమునా, కుంతీదేవి సంభాషణలోనూ, కర్ణుని ప్రత్యుత్తరములోనూ, మిక్కిలి రసవంతమైనవి కొన్ని విల్లిపుత్తూర్ భారతవృత్తముల నుంచాను. ఈ వృత్తములు చాలా అందంగాఉంటవి. నడకలో ఒక చక్కని ఉద్వేగ ముంటుంది. మనము సాధారణముగా వింటూన్న వాడుకభాష తమిళానికీ, గ్రంథస్థ మైన ఈ తమిళభాషకీ చాలా తేడా ఉంటుంది. విశేషపరిశ్రమవలన నాకు ఈ గ్రంథస్థ తమిళభాషతో బాగా పరిచయమై ఆ భాష అంటే ఎంతో ప్రీతి కలిగినది.

లేక పోయిందినాకు. అందుచేత, వారిపేర ఉత్తరం వ్రాసి, ఈ విషయాలన్నీ వివరిస్తూ నా చర్యను గురించి ఏమీ అనుకోవద్దు అని ప్రార్థించాను వారిని. నా ఉత్తమును చూచి ఆయన ఏమనుకున్నారోగాని, రేడియోలో ప్రసారమైన నాటకమును విన్నాకమాత్రము, ఆయన నన్ను టెలిఫోన్‌లో పిలచి అన్నారు: "నాటకము విన్నాను, చాలా బాగుంది—మనము పడిన శ్రమ ఫలించినదనే అనుకుంటున్నాను, నేను" అన్నారు.

వారి ఈ 'మనము' అనే మాటలో ఎంతటి సహృదయత్వము ఇమిడి ఉన్నది! ఇటువంటి పైఅధికారులతో కలిసి పనిచెయ్యడము ఒక గొప్ప అదృష్టము!!

ఆధునిక తమిళనాటక రచయితలలో పేరుపొందినవారు శ్రీ కే.పి. రాజగోపాలన్. వారు రచించిన 'అభిమన్యన్' నాటికనున్నూ తిరుచ్చినాపల్లి రేడియో తొలిరోజులలో ప్రసారము చేశాము నేను. ఈ నాటికలో ఉత్తరగా విజయకుమారినే నియమించాను. కాని, ఎంత వెతికినా నాకు కావలసిన అభిమన్యుడు దొరకలేదు. ఈ అన్వేషణలో విసిగి, చివరకు, ఆపాత్రను నేనే నిర్వహింపడానికి నిశ్చయించాను. ఇది సాహసమే. అభిమన్యుడు ఉత్తరను విడిచి, శయ్యామందిరము నుండే తిన్నగా యుద్ధభూమికి వెళ్ళే భావము నాకు పూర్తిగా అవగాహము. అటువంటి తీవ్రమైన, అతిగాఢమైన అనుభవమూ కలిగినది నాకు, నా జీవితములో. కాని, తమిళభాష నేను ధారాళంగా చదువలేను. ఆ లిపి నాకు అంత అలవాటు లేదు. అందుచేత, నా పోర్షన్ అంతా, తమిళసంభాషణను, తెలుగులిపిలో వ్రాసికొని, పదిసార్లు, ఇరవైసార్లు రిహార్స్ చేసుకున్నాను, పండితుడు అయ్యం పెరుమాల్ కోనార్ ఎదుట. స్టూడియోలో, విజయకుమారినీ చాలా చాలా శ్రద్ధతో రిహార్స్ చేశాను. ఆమెకున్నూ ఇటువంటి పాత్రలు క్రొత్త. రవీంద్రరచనను అనుసరించిన ఈ నాటికలో ఉత్తరలో ఎంతో ఆర్ద్రత కనిపించాలి. స్టేజినాటకములో విపరీతపు శోకరసాన్ని అతి ఇదిగా ప్రకటించేవారు, ఇటువంటి మిక్కిలి సున్నితమైన పాత్రను నిర్వహించడము కష్టము. కొన్నాళ్ళకుముందు ప్రసారమైన 'కర్ణ, కుంతీ' నాటికలో ఎంతో కొంత అనుభవమున్నా విజయకుమారి

౧౫

బసోమేరే నైననమే నందలాల్
మోహనీ మూరత సోంవరీ సూరత,
నైనా బసే బిసాల్
అధరసుధారస మురలీ రాజత
ఉర బైజయంతీ మాల్.
క్షుద్ర ఘంటికా కటితట శోభిత
నూపురశబ్ద రసాల్.
మీరాప్రభు సంతన సుఖదాయీ
భగత బఛల గోపాల్.

విపరీతపు గాలీ, వానా; కటికచీకటిలో, ఉన్నట్టుండి ఉరుములూ మెరుపులూను. శ్రీకృష్ణప్రేమోన్మాదినిఐ, వెర్రిగా పరుగెత్తుతోంది, మీరా, యమున వైపు ఆ చీకటిలో, ఆ ఘోర గాలిలో, తళుక్కు తళుక్కుమనే మెరుపులే త్రోవచూపగా, 'ప్రేమోన్మాదిని మీరా!! ప్రేమోన్మాదిని మీరా!!' అని పాడుకుంటూ. "ఆగు, మీరా!" "ఆగు మీరా!!" అంటూ వెంబడిస్తున్నాడు భర్త, కుంభరాణా. పిలుపు వినిపించినా, ఆమె నిలువదు. ఒక్కటే పరుగు, యమునవైపు!

మీరా నదితీరాన్ని చేరనే చేరింది. కళ్ళు మిరుమిట్లుగొలిపే ఒక మెరుపు మెరిసి, ఫెళఫెళమంటూ ఒక ఉరుము ఉరిమి, మీరా యమునలో లీనమై పోయింది. ఆక్షణిక విద్యుత్కాంతిలో చూస్తాడు రాణా, నదిలో కొట్టుకు పోతున్న మీరా పావన స్వరూపాన్ని. దూరాన నుంచి యోగీశ్వరుని పాట వినిపిస్తుంది, 'జ్యోత్ మే జోత్ మిలా!' అంటూ.

తెలిసేసరికి ఎంతో ముగ్ధుడను అయిపోయాను. ఆ కవిత గురించీ, ఆ భక్తి పారవశ్యమును గురించీ.

కాని, నాటకానికి కథ కావాలి. కథ అల్లడానికి ప్రాతిపదికగా కజిన్స్ ఇంగ్లీషురచనకోసము వారికి ఉత్తరము వ్రాశాను. తిరుగుటపాలో వారు పంపారు తమ రచనను, సౌజన్యము వెల్లువారే ఆప్యాయమైన ఉత్తరము సహా! కథను మరింత రసవంతముగా చేయడానికి మీరాకు ఒక పెంపుడు కూతురును కల్పించాను నేను. ఆమె పేరు రాధ. మీరా నేర్పిన ప్రతి కొత్తపాటా శ్రావ్యంగా పాడు తూంటుంది రాధ. ఊరూ పేరూలేని రాధ ఈ పాటలు అలా ఎప్పుడూ పాడుతూండటము రాణాకు విసుగు కలిగిస్తుంది. పైగా, అతను గాఢముగా వాంఛించే వ్యక్తిగతమైన ప్రేమకు బదులు మీరా తన ఆత్మను పూర్తిగా శ్రీకృష్ణ పరముచేసి గోపాలుని గురించి పూట కొక క్రొత్తపాట పాడుతూ ఉంటుంది. ఈ పాటలు ఆనోటా ఆనోటా రాజ్యమంతా వ్యాపించి, రాణా తన రాచకార్యాల పైన ఎక్కడకువెళ్ళినా అక్కడ వినిపిస్తూ ఉంటాయి. పొలాల్లో పనిచేసే కూలి వారూ, మీరా పాటలే పాడుతారు; బాటసార్లూ, యాత్రికులూ మీరా పాటలే పాడు తారు; పడవవాండ్రూ చాకళ్ళుకూడా మీరా పాటలే పాడుతారు. ఇందరు 'తక్కువ జాతి' వారి నోళ్ళలో మహారాణి పేరు వినిపించడము కుంభరాణాకు మిక్కిలి కోపకారణ మవుతుంది. ఇందుకుతోడు ఒకనాడు మీరా భజనచేస్తున్న అంతఃపుర కృష్ణాలయములోకి మారువేషముతో అక్బరూ, తాన్సేనూ వచ్చారనీ, వర్తకుని వేషములోనున్న అక్బర్ తన మెడలోని అమూల్యమైన రత్నాలహారాన్ని మీరా చేతిలో నుంచాడనీ, తెలుస్తుంది రాణాకు. రాణా మండిపడతాడు. అసూర్యంపంస్య, తన భార్యను, మొగలాయి చక్రవర్తి కన్నెత్తి చూడడము అతనికి దుస్సహమెన అవమానము. ఒక్కనిమిషము రాణా మీరా శీలాన్ని శంకిస్తాడుకూడా. కాని, ఈ సందర్భములో రాధ అతనికి నచ్చచెపుతుంది మీరా పరమపవిత్రతను గురించి.

రాధఉద్బోధనవల్ల రాణామనస్సు మారుతుంది. కాని, అప్పటికే సమయము మించిపోయింది. అనుమానభూయిష్టమైన ఈ లోకంలో ఇక ఉండ లేదు, మీరా. రాణావంశముపై తనవలన కలిగిన కళంకాన్ని తుడిచివేసే నిమి

జెప్పడము సన్నిహితకారణమైనది. అంతేగాక, ఆ ప్రాంతాలలో అసహాయోద్యమ సందర్భంలో గొప్ప కృషిచేసిన మా పినతల్లి రుక్మిణమ్మగారిని బట్టిన్నీ, నాకు అనేకులు స్నేహితులయ్యారు. వీరందరూకూడా నేను తెలుగువాడనైనా తమిళ భాషలో చూపుతున్న విపరీతపుఆసక్తీ, నేర్పూ గుర్తించి చాలా సంతోషించేవారు. ముఖ్యంగా, పూజ్యులు టి. కె. చిదంబరనాథ ముదలియార్ - కంబరామాయణమున గొప్పకృషి చేశారు ఆయన - వాల్మీకిరామాయణమూ, కంబరామాయణమూ ఈ కావ్యములను పరస్పరముపోల్చి చూపుతూ ఎంతోసేపు గడిపేవారు ఆయన, నాతో. ఒకపర్యాయం నేను చదువుతూన్న 'ముత్తొళ్ళాయిరం' అనే ప్రబంధము లోని ఒకవర్ణనను ఆయనకు చూపాను: 'దట్టముగాపూచిన ఎర్రతామరలతో నిండిన ఈకొలని నీటిపైన జ్వాలాగ్ని రగులుతూన్నట్టున్నది!' అని. ఆ వర్ణనను చూచి ఆయన విస్తుపోయారు. "మీకెలా దొరకినవి ఈ పంక్తులు? మాలో చాలామందికి తెలియదు, ఇటువంటి వర్ణన ఉన్నట్లే!" అని, నన్ను ప్రశంసించారు, ఆయన. ఇటువంటివే ఎన్నోఎన్నో చక్కనివర్ణనలు చూచేవాడను నేను ప్రాచీన తమిళ సాహిత్యములో. నన్నెచోడుని కుమారసంభవములోని ఒకవర్ణనను జ్ఞాపకము చేసే వర్ణన, ఇది, అతిప్రాచీన తమిళసాహిత్యములో ఉన్నది :

'తొలకరివర్షపు చినుకులు గడ్డిచూరునుంచి క్రిందికి రాలుతూం డగా, పిచ్చుకలు చూరుఅంచులను తలక్రిందులుగా నిలచి ఆ నీటిచుక్కలను తనివితీర గ్రోలుచున్నవి!!' అని. తొల్‌కాప్యమ్ అనే మరీ ప్రాచీనకావ్య ములో ఈ వర్ణన ఉన్నది :

'ఒంటినిండా పూసుకునేవారికే తెలుస్తుంది మలయచందనగంధపు సువాసన! చెవియొగ్గి వినేవారికే తెలుస్తుంది శ్రావ్యమైనవీణాసుస్వనమాధు ర్యము. సంతోషముతో కంఠసీమను అలంకరించుకునేవారికే తెలుస్తుంది, ఆణిముత్యాలహారాల అందము!!' - అని.

మరొక ప్రాచీనకావ్యములో మహారాజు ప్రతిభను ఇలా వర్ణించారు :

సాగుతున్న యాత్ర

ఇప్పటికీ నాకు సంక్రాంతికి శుభాకాంక్షలు వస్తవి కావేరీతీరము నుంచి "తమిళప్రాంతములోనే ఉండి, తాను తెలుగువాడైనా, తమిళసంస్కృతిని రేడియోద్వారా లోకానికిచాటిన మా తెలుగుసోదరునికి ఆశీస్సులు" అంటూ.

....ఉదయమూ, సాయంత్రమూ చాలాదూరము నడుస్తుండేవాడను నేను. అప్పుడప్పుడు కాలినడకనే శ్రీరంగము వెళ్ళివస్తూ ఉండేవాడనుకూడా. ఈవిధంగా కావేరీతీరాన్ని ఆరు ఋతువులలోనూ చూచే మహాభాగ్యము కలిగినది నాకు. వర్ష ఋతువులో ఎంత భయంకరంగా ఉంటుందో ఆ మహానది, వసంతఋతువులో అంత శాంతివంతముగానూ, అంత మనోహ్లాదకరంగానూ ఉంటుంది.

కావేరీతీరాన తొలివసంత దర్శనము ఒక మరువరాని అనుభవము.

సేపటికి కుట్టాన్‌కు కోపము తగ్గుతుంది. అప్పుడనుకొంటాడు అతను: "అయ్యో! నా కీమె సహధర్మచారిణికదా! ఈమె నన్నువదలి ఎచ్చటికి బోవును? ఇన్నాళ్ళుగా నేను మాట్లాడకుండ నుండిన ఎంత శోషిల్లినదో! నాతో వొక్కమాట పలుకలేదే!.... స్త్రీ యెట్లు పలుకరించును!" అని.

మనలో కొందరికి ఈ సమస్య స్వానుభవమే: పెండ్లిచేసుకున్నవారిని ప్రేమింపలేకపోవడమూ, ప్రేమించినవారిని పెండ్లిచేసుకోలేకపోవడమూ. అందుకే, నా అంటివారికి ఏకవీర నవల అంత గొప్పగా ఉంటుందేమో! ఐతే, విశ్వనాథ సత్యనారాయణ ఆ ప్రేమికులను వట్టి భావుకులుగా విడిచిపెట్టక, వారిహృదయంలో విపరీతమైన సంఘర్షణ కల్పించి, వారిని సాధకులుగా జేస్తారు. ఒకానొక అద్భుతమైన తపఃఫలితంవల్ల, కుట్టాన్ తాను ప్రేమించిన జగన్మోహన విగ్రహమైన మీనాక్షిని తనచెల్లెలుగా జేసుకుంటాడు. ఆ తర్వాత తన ధర్మపత్ని ఐన ఏకవీరను మనసార ప్రేమింపకలుగుతాడు. కాని, ఇటువంటిసాధన చాలా కష్టము. సాధారణ మానవులకు చేతగాదు. కుట్టాన్‌విషయంలో, అతని స్నేహితుడు వీరభూపతి బోధన ఎంతో ఉపకరిస్తుంది. -నీ భార్యను నీవు తప్పక ప్రేమించాలి, ఆమె కన్నీరు ఒలుకరాదు, అంటూ ఎంతో ప్రాధేయపడే ప్రాణస్నేహితునిమాటలు వింటూ, కుట్టాన్ అంటాడు: "వీరా! ఎంత మంచివాడవు. ఇన్నాళ్ళు ఏమో వట్టి స్నేహితుడవనుకున్నాను. కాని, నేను నీవుగా ఊహించుకునేటంతటి ప్రేమ నాయందు నీకున్నదని తెలిసికొనలేకపోయాను. నిజంగా, ఇంతప్రేమకు నేను అర్హుడనుగాను....కాని, నేను ఆమెను ప్రేమింపలేకున్నాను. నీకోసం ప్రేమించమంటావా? ప్రేమిస్తాను, ప్రేమిస్తాను. ప్రయత్నిస్తాను. కొంతకాలము పట్టుతుంది. నీవు క్షమించాలి నన్ను!" అంటాడు. కాని, బాధ ఆపుకోలేక, వెక్కివెక్కి ఏడుస్తాడు.

ఇటువంటి ఘట్టాలు మా నాటకానికి ఎంతో వన్నెతెచ్చాయి. కుట్టాన్ వీరభూపతుల స్నేహము అపూర్వమైనది. అందుకే, తాను అంతగా ప్రేమించి అంతగా అరాధిస్తూన్న చిరకాలప్రేయసి ఆ అందాలరాశి, మరెవ్వరూ కాదు - తన మిత్రుడు వీరభూపతి, కొన్నేళ్ళతర్వాత, పెండ్లిచేసుకున్న మీనాక్షే అని తెలిసే

కొని, గుండె పగిలేటట్టు రోదిస్తూన్న కుట్టాన్‌కు సన్యాసియైన వీరభూపతి కని పిస్తాడు. భావగర్భితమైన ఉపనిషద్ నిర్వచనతో రేడియో నాటకము పూర్తి అగుతుంది.

ఈ రచనా ఈ నాటకప్రదర్శనా తమిళశ్రోతలలో వింత సంచలనము కలి గించినవి. "ఈభావాలు మాకు క్రొత్తవి; కాని, ఎంతటి నిజాయతీతో ప్రదర్శిం చారు!" అని వ్రాశారు కొందరు శ్రోతలు. కొన్నివారాల తర్వాత, నాటికను వినిన వారూ, వినని వారూకూడా మరీమరీ కోరగా, మూడు నెలలలోనే ఏకవీర నాటకాన్ని మళ్లా ప్రదర్శించాము. కొన్నికొన్ని సంభాషణలు శ్రోతలమనస్సులో శాశ్వతంగా ఉండిపోయాయి. కుట్టాన్ తనతల్లిని చూచాక అనుకుంటాడు :

"అందరూ నన్ను ఏకవీరను ప్రేమించమంటున్నారు. ప్రాణస్నేహి తుడు వీరభూపతి అదేమాట. ఈ ఊరు వస్తే మా అమ్మా అదేమాట. ఇందులో ఏదో రహస్యముంది! నేను మనసారా ప్రేమించిన ఆమెనుమాని, బలవంతంగా నా మెడకు కట్టపెట్టిన ఆమెనా, నేను ప్రేమించాలి? అదెలా సాధ్యం? ప్రేమించడమూ ప్రేమించలేకపోవడమూ నా స్వాధీనంలో ఉన్నవా?.... మరి, ఎవరిస్వాధీనంలో ఉన్నవి? భగవంతునిస్వాధీనంలో ఉన్నవి. మరి, నేను ప్రేమించడము ఎవరి స్వాధీనములో ఉన్నదో ఆ భగవంతుడే నేను ప్రేమించిన వ్యక్తికిబదులుగా ఈ స్త్రీని తెచ్చి ఎందుకు పెళ్ళిచెయ్యాలి నాకు? భగవంతుడుకాదు - పెద్దవాళ్ళుచేశారు, ఈ పెళ్ళి. కాని, భగవంతునికి ఇష్టంలేకపోతే పెద్దవాళ్లుమాత్రము ఎలా పెళ్ళి చెయ్యగలరు? ఈమెకూ నాకూ ఏమి సంబంధము? ఏ సంబంధమూ లేకపోతే మేము ఆచార్యరీత్యా భార్యాభర్తల మెందుకయ్యాము?" అని వితర్కించుకుంటాడు కుట్టాన్.

ఈ సమస్య ఒక్క కుట్టాన్‌దే కాదు. యుగసంధిలోపడి నలిగిపో తూన్న అనేక యువకహృదయాల ఆత్మలను దహిస్తున్న విచారము, ఇది.

*   *   *   *

నేను చాలా ఆలోచించాను. గతమును త్రవ్వుకోవడమువల్ల మరింత భరింపలేని బాధేగాని, సాధించేది ఏమీలేదు, అనుకొని, అన్నీ మరచిపోవాలని ప్రయత్నించాను. విపరీతమైన సానుభూతి విపరీతమైన ప్రేమగా పరిణమిస్తుంది ఒక్కొక్కప్పుడు. కాని, ఎంతటిసానుభూతిని ప్రకటించినా, ఆ ప్రకటించడము మనకు ఏవిధమైన అపకారమూ చెయ్యదు. ఆ సానుభూతి ప్రేమగా మారినప్పుడే వస్తుంది బాధ. ప్రేమ కొంతైనా ప్రతిప్రేమను కోరుతుంది. ఇది తప్పదు. కానీ, మనము ప్రేమించినవారు మనముప్రేమించినరీతిని తిరిగి మనలనుప్రేమింపలేకపోతే చేసేది ఏముంది? ఆ ప్రేమను మరచిపోవాలి. మరచిపోలేకపోతే? నరకమే, ఇక.

........నేను టెలిఫోన్‌చేసి, వారి ఊరు వెళ్ళాను.

తాము నీరుపోసి పెంచినచెట్టు పెద్దదై పువ్వులు పూస్తూంటే ఎవరికి సంతోషము ఉండదు! ఉద్యోగముచేస్తూన్న సౌదామినిని చూచి, చాలా సంతోషించాను, ఎన్నో తుపానులను ఎదుర్కొని, ఈనాటికి ఆమె జీవితపునొక గమ్యస్థానము చేరినది అని. ఆ ఊళ్లో, ఇంటింటా ఆమెపేరు చెప్పుకునేవారే! సంపన్నులూ సాధారణులూ అనే వ్యత్యాసములేకుండా, అందరికీ వైద్యసహాయము చేస్తూన్నది ఆమె. కొన్నికొన్ని మరీ కష్టమైన శస్త్రచికిత్స విషయాలనుగురించి చెపుతూ, "ఇవన్నీ చేయకలిగాను నేను, ఈ ఊళ్లో!" అన్నది, సౌదామిని, సకారణమైన గర్వంతో. ఇంకా ఏమిచెప్పేదో, ఇంతట్లోకీ, అర్జెంట్ బాలింతకేస్ వచ్చి, ఆమె వెళ్ళిపోవలసివచ్చింది.

శ్యామల చాలా మాట్లాడింది, నన్నుగురించే, ఎక్కువగా. ఈ ఏడేళ్ళలోనూ నాజీవితములో కలిగిన మార్పులనుగురించి ఆమెకు తెలియదేమో అనుకున్నాను. కాని, ఆమెకు తెలుసును. అసలుస్వరూపము అలభ్యమని నిర్ధారణ చేసుకొని, ఎంతో కొంత ఓదార్పు అనే వెర్రిభ్రమతో, భౌతికంగా ఆ స్వరూపానికి కొంచెం దగ్గరగాఉన్న మరొక ప్రతిరూపానితో నేను పొత్తు కలిగించుకొనినట్టూ అనేకకారణాలవల్ల ఆ సాంగత్యమూ విచ్ఛిన్నమైనట్టూ, శ్యామలకు తెలుసు. ఆ మాట తప్పక వచ్చింది, మా మాటలలో.

సాగుతున్న యాత్ర

త్రోవలో పుదుక్కోటలో దిగాను - నా స్నేహితుడు నాగరాజన్‌ను చూడడానికి. నాగరాజన్ గొప్ప రచయితగా పేరుపొందారు. ఇంగ్లీషులో రచించిన 'అట్టవార్ హవుస్' అనే సాంఘికనవల అప్పటి తమిళప్రాంత సాంఘికచరిత్రను వర్ణించే గ్రంథము, ఇంగ్లండ్‌లో అచ్చుకాగా ఆయనరచన చదివి ఆయనను హిల్టన్ బ్రవున్ అంటివారు చాలా పొగిడారు, నాగరాజన్ కొన్నాళ్ళు ఇంగ్లండ్‌లో ఉన్నాడు కూడా. ఇంగ్లీష్‌వారంటే ఆయనకు చాలా గొప్ప. వేషభాషలలోనూ వారిని అనుకరించాలని ప్రయత్నిస్తాడు. కాని, సంస్కృతమందూ మాతృభాషలోనూ మంచి ప్రవేశము. అన్నామలై విశ్వవిద్యాలయంలో గొప్ప హోదాలో ఉన్నాడుకూడా ఆయన. ఆమధ్య, నేను తిరుచ్చి కేంద్రంలో ఏర్పాటుచేసిన ఒక ప్రసంగం చక్కగా చెప్పారు. విచిత్రవ్యక్తులు అనే శీర్షికను 'గోపురాన్ని భరిస్తున్న గబ్బిలములు' అనే విషయం. గోపురం పైకప్పునుంచి తలక్రిందులుగా వ్రేలాడుతున్న ఈ జంతువులు గోపురపు భారమంతా తామే వహిస్తున్నామనీ తమవల్లనే గోపురం అలా నిలిచిఉన్నదనీ అనుకుంటాయి. కొందరు మనుష్యులూ అంతే! అటువంటివారిని గురించి చెప్పారు, నాగరాజన్ చాలా చమత్కారంగా. ఆ సందర్భంలో నాకూ ఆయనకూ పరిచయమై, అనేక సమానఅభిరుచులవల్ల, ఆ పరిచయము స్నేహముగా అభివృద్ధి అయి, ఆయన పిలువగా వచ్చాను, వారింటికి.

పుదుక్కోట ఊరు బాగానే ఉంటుంది. ఒకప్పుడు ఇక్కడ తెలుగు సంప్రదాయము ఎక్కువగా ఉండేది. పాలకులు తెలుగువారే కొన్ని శతాబ్దాలు. నిన్న మొన్నటివరకూ స్వదేశసంస్థానంగా వర్ధిల్లుతూ, రాజులు 'విజయ' అనే తెలుగుఅక్షరాలతో నాణెములు ముద్రింపిస్తుండేవారు. చిన్నప్పుడు నా సహపాఠి పుదుక్కోటవాసి నాకిచ్చిన 'విజయ' నాణ్యాన్ని చాలారోజులు దాచుకున్నాను నేను. పుదుక్కోటలో క్షత్రియ కుటుంబాలవారు ఇప్పటికీ ఉన్నారు. ఈ 'రాజుల'లో ఒకరు, సమీపాన ఉన్న 'సిత్తన్నవాసల్' అనే చోట పురావస్తుపరిశోధన చాలా చేశారు. సిత్తన్నవాసల్ వద్ద ప్రాచీన బౌద్ధ ఆరామమూ, తదుపరి వెలసిన జైనమత సూచనలూ చూడవచ్చు, మనము. ఇచ్చటనే ఒక గుహలో అద్భుతమైన కుడ్యచిత్రాలు ఉన్నవి. ఇవి ఇంచుమించు అజంతాగుహల శిల్పముల

"అదుగో! ఆ ఉద్యోగము, అతని తరువాత, నాది!" అని. ఎంత అదృష్టమూ, పైన తారకలు, మినుకుమినుకు మంటూండగా దేవీసమక్షాన ఒకొక్క దీపమూ వెలిగించడము!....అల్లాగే, తంజావూర్ వెళ్ళినపుడు అక్కడ పువ్వులవారు ఎడ తెగని కదంబపు సరులు కడుతూంటే చూచి నేను స్నేహితునితో అనేవాణ్ణి: "ఈ ఉద్యోగమునుమాని నేను పువ్వులు గ్రుచ్చుతూ ఉండిపోతాను!" అని. కాని, ఒక్కటే బాధ: అందమైన అమ్మాయిచేతిలో ఇంత కదంబపు దొంతరా, ఇన్ని సంపెంగలూ, ఇన్ని గులాబీలు ఈ చేతితోఉంచి, ఆ చేతితో ఖరీదు పుచ్చుకోవడము —నాచేతగాదు....ఏమిటో, వెర్రిఊహలు!

నేను రైలుకు వెళ్ళేముందు శంకరన్ అనే స్నేహితునిఇంట గొప్ప విందు చేశారు. నామెళ్ళో గులాబీదండలు వేశారు - పన్నీరులో ముంచెత్తారు నన్ను, స్నేహితులు - చొక్కా విప్పించి ఒంటినిండా గంధము పూశారు. కాని. ఇంకా వారికి తనివి తీరలేదు. ఎంతో శ్లాఘించారు, నేను ఇంతవాడను, అంత వాడను అని. ఈ ఆర్భాటము అంతా చూచి, అక్కడికి అతిధిగా వచ్చిన సినీమా డైరక్టర్ సుబ్రహ్మణ్యమ్ అన్నారు: "నిన్నుగురించి ఎరుగుదునుగాని నీవు ఇంత వాడ వనుకోలేదు. నీవు మద్రాస్‌కు వచ్చాక ఇంతకంటే బ్రహ్మాండమైన విందు చేస్తాను నీ గౌరవార్ధము!" అని. అల్లాగే, మద్రాస్‌లో సుబ్రహ్మణ్యము ఇంట విందుకు వెళ్ళాను. ఆ విందులోనే నన్ను డైరక్టర్ శాంతారామ్‌కు పరిచయము చేశారు, సుబ్రహ్మణ్యము.

స్టేషన్‌కి సామానులు ముందుగా తీసుకువెళ్ళాడు, హెడ్‌ప్యూన్ రహీంతుల్లా. మా నిలయపు అధికారి గోపాలన్ తనకార్‌లో నన్ను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. రైలు కదిలేవేళకు నిలయపు కార్యక్రమాలు నడుపుతూన్న నలుగురైదుగురు తప్ప నిలయపు యావత్తుబృందమూ నన్ను సాగనంపడానికి స్టేషన్‌కు జేరారు - ఉద్యోగులూ, నౌకర్లూసహా. డ్రైవర్, పెరుమాళ్ రాజా - అతని మాతృ

సాగుతున్న యాత్ర

మద్రాస్ వచ్చి, హోటల్‌లో బసచేసి, సరిగ్గా పదిగంటలకు హాజ రయ్యాను రేడియో ఆఫీస్‌వద్ద. నాకు ఎదురుసన్నాహంతో వచ్చిన ఆఫీస్ పిల్లవాడు బాద్షా చేతికి నేనుతెచ్చిన తామరపువ్వుల సజ్జ నిచ్చాను: "ఇవి అందరికీ ఇస్తావా?" అంటూ. అందరూ మీటింగ్‌లో ఉన్నారు.

మరి పావుగంటయ్యాక మళ్ళీ వచ్చి, తిన్నగా ప్రోగ్రామ్ డైరక్టర్ మూర్తివద్దకు వెళ్లాను. లేచి నిలచి, తన రెండుచేతులలోకి నాచేతులను పుచ్చు కుంటూ అన్నారు, మూర్తి; "మీరిచ్చిన తామరపువ్వులే చెప్పాయి, మీరు వచ్చా రని. చాలా సంతోషము!" అన్నారు.

మళ్లా మద్రాస్ - మళ్లా తెలుగు కార్యక్రమాలు - మళ్లా 'మనవారు'. కాని, నిజానికి మనవారు కానివారెవ్వరు? అందరూ మనవారే; అందరూ నా వారే!!

సూట్ తీసి, వేసుకున్నా - ఆఫీస్‌వారిచ్చిన నెక్‌టై సహా. వెంటనే, తిరుచినాపల్లి డైరక్టర్ - నా స్నేహితులు - వారికి టెలిగ్రామ్ ఇచ్చాను : ఐ యామ్ టైడ్!" అని - అంటే నా అర్థము : "ఇచ్చట పనిలో హాజరయ్యాను ఇచటి నిబంధనలను పాటిస్తున్నాను," అని. కాని, జీవితములో అంతవరకూ నేను పడిన ఇకార ప్రకారమంతా తెలిసిన గోపాలన్ ఇదేమో హృదయసంబంధమైన క్రొత్తలంకె అనుకుని, ఇంకా ఎన్ని కష్టాలను తెచ్చిపెట్టుకుంటాడో ఈ వెర్రిమనిషి అనుకున్నారట!

వెంటనే, పనిలో నిమగ్నుడనైపోయాను. మూర్తిగారు ప్రోగ్రామ్ డైరక్టర్‌గా మారినందున తెలుగు కార్యక్రమాలన్నీ ఒక్క వీరభద్రరావే చూస్తున్నారు. ఆయన ఎంతో శ్రద్ధతో, ఎంతో చురుకుగా పనిచేస్తున్నా, తలమునిగి పోయేటంత పని మిగిలిపోయింది. "దేవునిలా వచ్చావు! మిగిలిపోయిన ఈ పని అంతా, నీవు చక్కచెయ్యాలి. చేస్తావనే నా నమ్మకము" అన్నారు, పరంజ్యోతి.

ఆరోజు కూర్చుని నూటఏబది నాటకరచనలను పరిశీలించాను. వీనిలో ప్రసారార్హమైనవానిని అంగీకరించాలి. పనికిరానివి రచయితలకు పంపివేయాలి వారిమనస్సును నొప్పింపకుండే ఉత్తరాలను జతపరచి. ఇతరఆఫీస్‌పనీ, ప్రోగ్రాములపనీ కూడా ఎంతో ఉన్నది. ఐనా, రాత్రి పదిగంటలవరకూ కూర్చుని, ఈ పరిశీలన పూర్తిచేశాను. ఆపనిలో నాకు ఎంతో ఆసక్తి ఉన్నది కాబట్టిన్నీ, ఎంతో కొంత విచక్షణను అలవరచుకున్నాను కాబట్టిన్నీ, ఆపని నాకంత కష్టమనిపించ లేదు సరికదా, మీదుమిక్కిలి, ఇన్నాళ్ళూ దూరప్రాంతములో ఉండి, తెలుగు వారితో సంపర్కములేని నాకు, ఈ తీరున, ఒక్కసారిగా, ఇంతమంది యువకరచయితలతో పరిచయము కలగడము చాలా సంతోషదాయకమే ఐనది. ఆ రచనలలో చాలాభాగము కావలసిన పరిణతిని చెంది ఉండకపోయినా, రచయితల హృదయాలలో ఏదో ఆరాటమూ, జీవితములో తమకు కలిగిన ఏదోఒక అనుభవాన్ని ఇతరులతో పంచుకోవాలి అనే యాతనా స్ఫురించాయి నాకు.

లించే సంకెళ్ళూ - అవి ఎంత బంగారపు సంకెళ్ళు ఐనా - అతనికి నచ్చలేదు. ఇది తెలియవచ్చిన నేను అతను మంచిపనిచేశాడు అనుకున్నాను. దేవులపల్లి కృష్ణశాస్త్రి గేయము స్ఫురణకు వచ్చింది :

"పక్షినని పాడగలనని ప్రణయవీధి
నిత్యలీలావిహారముల్ నెరపుదునని
పక్షముల దూల్చి బంధించి పంజరాన
గానమును ప్రాణము హరింప బూనినారు !"

—అని.

చందూర్‌కు ఈ గండము తప్పడము మంచిదే ఐనది. చిత్రం ఏమిటంటే, కృష్ణ శాస్త్రి మాత్రము, తానే వెళ్ళి పంజరంలో కూర్చున్నాడంటారు. ఎంత నిజమో?

ఆ చందూర్‌కు స్నేహితురాలూ, మంత్రీ, భార్యా, మహిళాప్రపంచక మంతా మమతతో మెచ్చుకునే మాలతీ చందూర్. ఈనాడు ఆమె ఇంటింటా ఒక ప్రేమపాత్రురాలైన స్నేహితురాలుగా వెలసినదీ అంటే అది వారిద్దరి మానవ సేవాపరత్వమూ, నిరంతర కార్యదీక్షా సూచిస్తుంది. అనేకసందర్భాలలో, మాలతీ చందూర్ మరీ మరీ జ్ఞాపకము చేసుకోవలసిన వ్యక్తి. అపరిమితమైన సర్వజన స్నేహభావమూ మితిమీరిన హితజనప్రేమా ఉన్నా, ఆమె ఇతరులలోని లోపాలను-ముఖ్యంగా. తనకు.ఆప్తులైనవారిలోని లోపాలను - ఆవగింజంతైనా సహింప లేదు. ముఖప్రీతికోసము, మాలతి, నలుపును తెలుపనలేరు, ఎన్నటికిని. నలుపు నలుపే, తెలుపు తెలుపే - మనకు ఇష్టమైనాసరే, కష్టమైనాసరే. ఎటొచ్చీ, ఆ చెప్పేతీరులో కొంతతీవ్రత ఉంటుంది. నావంటివానిని ఆ తీవ్రత కాస్త బాధ పెడుతుంది.

చర్చ. ఇటీవల వెలువడిన సినిమాల గురించిన్నీ చర్చ సాగుతుంది. ఎప్పుడో ఒకప్పుడుగాని, మా అభిప్రాయాలు ఏకీభవింపవు. ఏకీభవిస్తే ఆశాభంగముకూడా నేమో, ఆమెకు!

....తిరుచ్చినుంచి మద్రాసుకు వచ్చిన ఆరోజే సాయంత్రము గ్రామస్తుల కార్యక్రమములో వివరాలు చూడవలసివచ్చింది, నేను. 'త్యాగరాయకృతి - జంత్రసమ్మేళనము' అని ఒక అంశము ఉండగా "ఏమికృతి?" అని ప్రశ్నించాను నేను, సంగీతనిర్వాహకుడు లింగప్పను. ఆయన "ఇంకా ఏదీ ఆలోచింపలేదు" అనగా, నేనన్నాను: "ఎంతని నేవర్ణింతు, శబరీ భాగ్యము బాగుంటుందేమో"నని. లింగప్ప నావేపు నిదానించి చూచారు. "ఎందుకలా చూస్తారు?" అనేసరికి ఆయన నన్ను కౌగలించుకొనే టంతటి సంతోష ఉత్సాహములతో అన్నారు: "ఇన్నాళ్ళకు కనిపించారు, పాతసాంప్రదాయములందు ప్రీతిగలవారు. నాకూ, ఆ కృతి చాలా ఇష్టము. వాద్యబృందాన్ని తర్ఫీదుచేస్తాను, వెంటనే!" అని. ప్రసారము చాలా చక్కగా నడిచింది. ఆ భక్తిపారవశ్యము ఒక వింతఅనుభూతి!

ఆ తర్వాత, కొన్నాళ్ళకు, త్యాగరాయకృతులతో కూర్చిన 'గోవింద మారార్' అనే రూపకము ప్రసారము చేశాము. గోవిందమారార్ అనే తిరువాన్కూర్ రాజాస్థాన ప్రధాన సంగీతవిద్వాంసుడు తిరువాయూరునందున్న త్యాగరాజస్వామిని చూడడానికి వస్తారు. ఆయనకు షట్కాల గోవిందమారార్ అనే బిరుదు. వీణపైన ఆయన షట్కాలమున వాయించేవారట. ఈ నేర్పుగలవారు ఆయన ఒక్కరే. కన్యాకుమారినుండి కావేరీతీరమువరకూ ఆయన దాటివచ్చిన ప్రతిపల్లెలోనూ త్యాగరాయకృత సంగీతమును వింటూ గోవిందమారార్ త్యాగరాయ ప్రతిభను గురించీ ఆ ప్రతిభ అశేష జనానీకపు ఆదరణను పొందిన దానిని గురించీ విస్తుబోతారు. తామ్రపర్ణినది దాటుతూఉంటే పడవవారు 'రామచంద్ర నీదయా!' అనే త్యాగరాయగేయమును పడవపాటగా పాడుతారు. బాటప్రక్కన ఉన్న చిన్న ఆలయంలో 'తులసీ దళములతో' అనే కీర్తన వినిపిస్తుంది. మధుర రాజాంతఃపురములో 'ఉయ్యాలలూగవయ్యా' అనే జోలపాట వింటారు గోవింద మారార్. తంజావూరు ప్రవేసిస్తుంటే 'సుఖి యెవ్వరో' అనే కీర్తన పాడుతూ

మిస్తాడు తన కుటీరములో. ఆమె జిలిబిలి మాటలూ తేనెలొలుకు పాటలూ అతనిని ఆకర్షింపక తప్పదు. కాని, ముక్తికాముడైన ఆ సన్యాసి తన్ను కట్టివేయబూనిన ఆ మమకారపు సంకెళ్ళను త్రెంపుకోవాలని బదరీయాత్రకు వెళ్ళుతాడు అమ్మాయిని తనశిష్యుని పోషణలో ఉంచి. కాని, కృష్ణా గోదావరీ కెరటాలలో అతను ఆ బాలిక ముఖమేచూస్తాడు. ప్రయాగ సంగమస్థానంలోనూ ఆ పాప చిరునవ్వే అతని కళ్ళయెదుట తాండవిస్తుంది. ఋషీకేశంలో గంగానదిలో మునుగుతూండగా అమ్మాయి తన రెండుచేతులూ చాచి "దాదా! రావా?....రావా? దాదా!!" అని గొంతెత్తి పిలచినట్లనిపిస్తుంది అతనికి. ఆ మతిభ్రమను అరికట్టలేక, అతడు వెంటనే తన ఆశ్రమానికి వచ్చివేస్తాడు అంచీలపైన. వచ్చేసరికి, తీవ్రజ్వరముతో బాధపడుతూన్న ఆ అనాధబాలిక అతనికోసము ప్రలాపిస్తూ ఉంటుంది. "దాదా! రావా?....రావా? దాదా!!" అంటూ. "వచ్చాను తల్లీ! ఇక నిన్నువిడిచి వెళ్ళను!" అంటూ, సన్యాసి ఆమెను బ్రతికించుకుంటాడు. ఈ ఘట్టమున విమలకుమారి చాలా నేర్పుతో నటించినది. చాలాచాలా జాలిగా పిలచింది నన్ను. నేను ఏడుపు ఆపుకోలేకపోయాను, మైక్రొఫోన్‌ముందు!

ఆమధ్య ఎప్పుడో, పిల్లలతల్లిగా ఒకరింట పేరంటానికివచ్చిన విమలకుమారి, బయట కార్‌లో కూర్చున్న నన్ను చూడడానికి గుమ్మందాకావచ్చి "బాబయ్య! చిన్నప్పుడు నన్ను పెంచుకుంటాను అనేవారు!" అన్నదట మా వాళ్ళతో!

వరలక్ష్మికిన్నీ నేనంటే ఎంతో ఆప్యాయము. ఎన్నో రేడియోనాటకాలలో మిక్కిలి ప్రవీణతతో నటించిన ఆమె, తరువాత, గొప్ప సినిమాతారగా రాణించినది. కాని, నాయందు అభిమానము అల్లాగే ఉన్నది, ఆమెలో. ఇప్పటికీ ఆమె నటిస్తూన్న ఏ సెట్‌పైకి ఐనా, నేను రావడం తటస్థిస్తే, వెంటనే, తనపని ఆపి, నావద్దకువచ్చి ప్రణమిల్లుతుంది, ఎంతో భక్తితో ఆమె. మారువేషంలో ఉన్న ఆమెను నేను వెంటనే గుర్తింపలేకపోతే "ఏమండీ! నన్నే మరచిపోయారా!!" అంటుంది ఎంతో ఆప్యాయంగా, కొంత అధిక్షేపణగా. ఆమె కంఠస్వరము వినగానే, కాలచక్రము ఒక్కసారి రివ్వుమని ఇరువదేళ్ళు వెనక్కు తిరిగి

నా శేషజీవితములో. గోపీచంద్‌కూ నాకూ అనేకవిషయాలలో ఐక్యభావము ఏర్పడ్డది - అప్పటి మా ఇద్దరి దృక్పథాలలో ఏమంత తేడా లేకపోబట్టి. అప్పటికి అతనికి సినిమాప్రపంచకము క్రొత్త. అందువల్ల మానవనైజముపై అపనమ్మకము అతని మనస్సును పాడుచెయ్యలేదు, ఇంకా. సాహిత్యవిషయాలలోనూ పరిసరప్రపంచకమును గురించిన విమర్శలోనూ, మేము, తరుచు, ఒకే అభిప్రాయాన్ని ఇంచుమించు ఒకే మాటలలో, ప్రకటిస్తూ ఉండేవారము, ఒకరితో నొకరు. అప్పటి మా రచనా పద్ధతులలోనూ విపరీతమైన పోలిక ఉండేది. నాకు బాగా జ్ఞాపకము: ఈపోలిక ఎంత గొప్పగాఉండేదీ అంటే: మానవజీవితాన్ని ఒకానొక మహానది చరిత్రతో పోల్చి చిత్రించే ఒక చక్కని రూపకమును అతని చేత రచింపించాను నేను రేడియో ప్రసారముకొరకు. మిక్కిలి పనితొందరలలో ఉన్న అతనికి తగినంత అవకాశము లేక, ఆ రూపకములో కొన్నిభాగాలు నేను రచింపవలసి వచ్చింది. ఇప్పుడు ఆ రచనను తీసిచూస్తే, అతనిమాటలు ఏవో, నామాటలు ఏవో, నేను చెప్పుకోలేను! అంతటి సమైక్యత కుదిరింది ఆ రోజులలో, మా భావాలలోనూ ఆ భావాలను వ్యక్తపరచే పద్ధతిలోనూ.

ఐతే, ఒక చిన్న వ్యత్యాసము మాత్రము కన్పించసాగింది క్రమక్రమంగా. అతను, జీవితంలో ఉండే మంచినీ, చెడుగునూ కూడా వివరంగా చూడకలిగి, ఆ చెడుగును నిర్మూలించాలనే ఉద్దేశంతో తన కథానికలలోనూ, తన వ్యాసాలలోనూ ఆ చెడుగును ప్రస్ఫుటంగా చిత్రింపసాగాడు - ఒకొక్కప్పుడు కొట్టవచ్చినంత ప్రస్ఫుటంగా ఉండేది ఆ వాస్తవికత! మాటవరుసకు, అతను ఒక కథలో, బిచ్చగాండ్లు తాము ఇంకా బాగా తిరిపెమెత్తుకోడానికి వీలుగా, తాము డబ్బిచ్చి కొనుక్కున్న పసికందుల కళ్ళు వాతబెట్టి, ఆ పాపలను గ్రుడ్డివారిని చేస్తారనీ, ఆ గ్రుడ్డిపిల్లలను ప్రదర్శించడమువల్ల వారు ఇంకా ఎక్కువ సంపాదిస్తారనీ, గోపీచంద్ ఒక కథలో వ్రాశారు. ఇది నిజమే కావచ్చును. కాని, ఒళ్లు కంపరము కలిగించే ఈ సత్యాన్ని గురించి, నేను అలా వ్రాయలేను. అసలు అట్టివిషయాన్ని గురించి వ్రాయాలనే తోచదు నాకు. అతని వ్రాతవల్ల ఆ దురాచారము మారిందనీ నమ్మలేను, నేను - ఎవరైతే ఆ దురాచారానికి ఒడిగట్టుతున్నారో వారికి అతనిమాటలు వినబడవు కాబట్టి.

గాహన, ఆయనకు, తెలుగు రచనావిధానము; ఇంగ్లీష్ రచనలూ చాలా చదివిన వారు ఆయన – ఆయన ఇలా 'రిమార్క్' వ్రాశారు!

"ప్రసిద్ధి గాంచిన జరాల్డ్‌కర్ష్ రచనలు ఏమీ చదువలేదు నేను. గోపీచంద్ తెలుగును గురించి నాకు కొంత తెలుసు. జరాల్డ్‌కర్ష్ రచన గోపీచంద్ రచనలాఉంటే, కర్ష్‌ప్రతిభ గొప్పదే అయివుండాలి," అని.

....కాలక్రమేణా, తప్పనిసరిగా, గోపీచంద్ జీవితమూ నా జీవితమూ వేరు వేరు మార్గాలను అనుసరించాయి. అప్పుడప్పుడు ఏదో ఒక మజిలీలో ఈ మార్గాలు ఒకానొక సాయంత్రపువేళ, కలుసుకుంటాయి. కాని, తెల్లవారేసరికి అతనిదో త్రోవ; నాదో త్రోవ.

పోలికలు గుర్తించడము సాహసమే కావచ్చుగాని, మా ఇద్దరిజీవితాలను పోల్చి చూచుకుంటే, మా ఇద్దరిజీవితాలున్నూ వింత వింత అనుభవాలతో నిండి ఉన్నా, అతనిలో ఉన్న 'అన్వేషణాసక్తి' నాలోనూ ఉన్నా, నాకంటే జీవితములో ఎక్కువ సుఖాన్ని పొందకలిగాడు, గోపీచంద్, అనవచ్చు.

కాని, గోపీచంద్‌కంటే ఎక్కువ మనశ్శాంతిని పొందకలిగాను, నేను; ఇది వట్టి భ్రమకాదు; నిజము!!

ఉండాలిగాని, పరిచయమై, కొన్ని సమాన అభిరుచులూ కొన్ని సమాన ఆశయాలూ స్ఫురించాయా అంటే, ఇక అంతే! వారు నాకు ఇట్టే స్నేహితులై పోతారు. కొందరు తమ స్నేహవర్గములో ఆంతస్థులను నిలబెట్టుకోగలరు. కాని, నేను అలా హెచ్చు తగ్గులను పాటింపలేను. ఎవరో ఒకరిద్దరు మరీ ముఖ్యమైన వారు మినహా, ఇక అందరినీ ఏక రీతినే మిత్రులుగా భావిస్తాను. నా జీవితంలో కలసిపోతారు వారు - వారి జీవితంలో నేను కొంతవరకే కలసినా. అతిశీఘ్రకాలములో వారు నాకు మిక్కిలి ఆప్తులైపోతారు. కొన్ని ఆదర్శ పరిస్థితులలో, ఇందులో ఏమంత ప్రమాదములేదు. కాని, ప్రస్తుతము, ఇలా, చప్పున, మిక్కిలి ఎక్కువగా స్నేహము కావడము అనేకమైన ఇబ్బందులను కొని తెచ్చుకోవడమవుతుంది.

ఇంకో విషయం : అపరిమిత సానుభూతివేరూ ఆప్తస్నేహము వేరూ. ఇందు మొదటిది రెండవదానికి కారణము కావచ్చు. కాని, బుద్ధిమంతులు వానిని వేరువేరుగా ఉంచకలుగుతారు. నావంటివారు ప్రయత్నించరు అలా ఉండాలని.

లక్ష్మీదేవి జీవితవిశేషాలను తెలిసికొనినకొలదీ, నాకు ఆమెయందు విపరీతపు సానుభూతి కలిగింది. పద్మాకరంలో దట్టపునాచులో చిక్కుకుపోయిన సుకుమారపద్మములా కనిపించినది నాకు, ఆమె. ఎల్లాగైనా, ఆమెను ఆ వాతావరణమునుంచి బయటకు రప్పించాలనే సంకల్పము కలిగింది, నాలో. మాబావ బాపిరాజున్నూ ఈ యత్నముచేసి, ఆమెలో విపరీతపు సంస్కారమును కలుగజేయ కలిగారు కాని, ఆమెను పరివేష్టించి ఉన్న పరిస్థితులనుండి ఆమెను తప్పింప లేక, విఫలులైనారని నాకు చాలా తరువాతగాని తెలియలేదు.

రేడియోనాటికలలో పాల్గొంటూ, ఎంతో వన్నెతెచ్చేది, లక్ష్మీదేవి, మా కార్యక్రమాలకు. ఎటువంటి సన్నివేశాన్ని ఐనా, ఇట్టే అర్థముచేసుకో కలిగేది, ఆమె. రేడియో తొలిరోజులలో, మేము ప్రసారము చేసిన 'కచదేవయాని' నాటికను మళ్లా ప్రసారంచేస్తూ, అందు దేవయానిపాత్రను లక్ష్మీదేవికిచ్చాము, వినేవారు బొటబొట కన్నీరు కార్చారు, దేవయానిగా ఆమె వ్యక్తపరచిన భగ్న

కాని, అప్పటికి నా ఆశ్రమము మారి, నాకు నేనే నియమించుకున్న సాంఘికమైన ఒకానొక కట్టుబాటువల్ల, ఆ సమయములో, మృత్యుముఖమున ఉన్న ఆ వ్యక్తిని, వెళ్ళి, చూడలేకపోయాను, నేను.

ఆ నిమిషపు పిరికితనానికి జీవితమంతా బాధపడుతున్నాను, నేను.

కాని, మళ్లా అనుకుంటూ ఉంటాను, ఏలోకములోఉన్నా, ఆ ఆత్మకు నా పరిస్థితులు అవగతమనీ, నా పొరపాటును ఇదివరకే, ఆ నిర్మలాత్మ క్షమించి ఉంటుందనీ.

అపరిమిత స్వార్థత్యాగానికి ఆనవాలుగా ఉండిపోయింది, ఆ సుకుమారి జీవితము!

* * * *

తిరుచినాపల్లిలో ప్రసారమైన కొన్ని నాటికలనూ రూపకాలనూ తెలుగు చేసి మద్రాస్‌నుంచి ప్రసారము చేశాము. వీనిలో మొదటిది 'వీరఅభిమన్య'. ఇచ్చటా అభిమన్య నేనే. ఉత్తరకోసము స్నేహితుడు రామబ్రహ్మం వద్దకు వెళ్ళగా, ఒక 'తార'ను నాకు పరిచయముచేస్తూ "ఈమె వృద్ధిలోకి రాతగిన ఆమె. రేడియోవారే తరిఫీదు చెయ్యాలి!!" అన్నారు, రామబ్రహ్మం. రేడియోవాచక మన్నా రేడియోప్రసారపద్ధతి అన్నా అంతటి విలువ ఉండేది రామబ్రహ్మానికి. ఉత్తరపాత్రను ఆమె చాలా చక్కగా నిర్వహించారు. కంఠస్వరమూ మంచి కంఠస్వరము. మహనీయ ప్రేయసిగానూ, మహావీరపత్నిగానూ చక్కగా ఒప్పించారు.

ఆమె అంత ఎక్కువగా రేడియో కార్యక్రమాలలో పాల్గొనలేదుగాని, సినీమాలో మాత్రము చాలా గొప్పపేరు తెచ్చుకున్నారు. ఆమె నటించిన 'ఇల్లాలు' చిత్రమును నేను చాలా ప్రశంసిస్తూ సమీక్షచేశాను కూడా. ఇటీవల ఆమె నటించిన 'ముద్దుబిడ్డ' చిత్రపు 'ప్రీవ్యూ' చూచిన నేను, ప్రదర్శన ఐనవెంటనే, ఆమె

నట్టే ఉంటుంది, ఆమెను చూస్తే. మొన్న ఈమధ్య వారి అమ్మాయికి పెండ్లి ఐనప్పుడు, పనికట్టుకు వచ్చి, నన్ను పెళ్ళికి పిలచి వెళ్ళారు ఆమె, ఎంత పని ఉన్నా, మీకోడలు పెళ్ళికి మీరు రాక తప్పదు అంటూ.

మంచి సమయస్ఫూర్తి ఉన్నది, ఋష్యేంద్రమణికి. ఒక పర్యాయము, మేము అనుకున్న ఒక నాటకము, ఏదో కారణమువల్ల, ఆఖరి నిమిషంలో మాని వేసి, ఆ నాటకానికి బదులు, వరూధిని నాటకము వెయ్యవలసి వచ్చింది. ఆ అసలు నాటకములో కథానాయకిగా నియమితురాలైన ఋష్యేంద్రమణి అప్పటికప్పుడు, ఏమాత్రమూ రిహర్సల్ లేకనే, వరూధినిమాటలూ ఆ పద్యాల్తూ చదువవలసి వచ్చింది. కాని, తన అసమాన చాకచక్యం వల్లనూ, సమయస్ఫూర్తివల్లనూ ఆవేళ మాట దక్కించారు, మాకు, ఆమె. ఇదివరకు ఏమాత్రము పరిచయమూ లేక పోయినా మనుచరిత్రలోని పద్యాలు, ఒక్కతప్పు లేకుండా, చాలా రసవంతంగా చదివారు ఆమె.

నేను రచించిన తెలుగుమీరాలోనూ మీరాబాయిగా అద్భుతంగా ఒప్పించారు ఆమె. వచనమూ బాగా చదివారూ, మీరా కీర్తనలూ హిందీలో చాలా బాగా గానము చేశారు. ఆమెలో ఒక గొప్ప నేర్పు ఉన్నది: అవసరమైన భావోద్రేకాన్ని అర నిమిషములో తెచ్చుకోగలరు ఆమె. ఈ గుణము రేడియోకు అమూల్యమైనది.

ఋష్యేంద్రమణి స్నేహితురాలూ, ఇటీవల బంధువూ, శ్రీమతి కన్నాంబ. కన్నాంబను మొట్టమొదట రేడియోకి నేను తీసుకొనివచ్చినది, 'వెండి తెర' అనే శీర్షికను, సినీమావిషయాలు గురించి విమర్శించడము కోసము. చాలా బాగా మాట్లాడుతారు, ఆమె. ఆ ప్రసంగపు సందర్భంలో కొన్ని పద్యాలున్నూ చాలా బాగా చదివారు ఆమె. ఆమె నటించిన సినీమాలు నేను కొన్ని చూచినా, సినీమాలో ఆమెనేర్పు అంతా ఒక ఎత్తూ, ఎన్నో ఏండ్లక్రితము, నాటకరంగము పైన ఆమె చూపిన నటనాకౌశల్యము ఒక ఎత్తూను.

కున్న బంగారపుబొమ్మను ఆరాధిస్తూనే ఉన్నాను. ఆ సంగతి అవతల వారికి తెలుసు కూడాను.

ఆ రోజులలోనే నేను 'వడ్డాణము' అనే కథ వ్రాసింది. ఈ కథలో శ్రీరంగములోనూ కావేరీతీరానా, నాకు కలిగిన కొన్ని అనుభవాలు కథకు కావలసిన వాతావరణము కల్పించినా, కథావస్తువు మాత్రము జీవితములోని ఒక అధ్యాయమే. వడ్డాణానికి తరువాత కథగా 'మంగళము' అనే కథకూడా వ్రాశాను.

'వడ్డాణము'లో సుకుమార్ అనే ఆదర్శజీవి, తన ప్రాణమిత్రుడైన సంపత్ భార్య, మంగళాన్ని చూచి, ఆమెను తన ఆదర్శ స్త్రీ మూర్తిగా భావించుకుంటాడు. సంపత్తూ మంగళమూ మిక్కిలి ఉదారమనస్కులు. వారు సంపూర్ణమైన సానుభూతితో సుకుమార్‌ని తమవానిగా గ్రహిస్తారు. సంపత్ దృష్టిలో అతని జీవితంలో, భార్యయైనమంగళానికి యెంత గొప్ప స్థానమున్నదో ఆప్త స్నేహితుడైన సుకుమార్‌కీ అంత స్థానమూ ఉన్నది. స్నేహమంటే అదే అతనికి. ఆ స్నేహానికి స్త్రీపురుష భేదములేదు - ఆ అనురాగము పూర్తిగా ఆత్మసంబంధమైనది కాబట్టి. మంగళమున్నూ భర్త అభిప్రాయాలని అర్థము చేసుకుని వానిని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తుంది - ఆమెకూడా చాలా సంస్కారము గల వ్యక్తి కాబట్టి.

ఒక విచిత్ర సన్నివేశంలో, సుకుమార్ మిక్కిలి గాఢంగా ప్రేమిస్తున్న అతని చనిపోయిన తల్లి స్థానాన్ని వహింపజూస్తుంది మంగళము - తద్వారా, గాయపడిన అతని హృదయానికి కొంత ఉపశమనమును కలిగింపవచ్చును అనుకుంటూ. సుకుమార్ తన కన్నీటితో మంగళము నడుమున ఉన్న వడ్డాణానికి అభిషేకము చేస్తాడు. ఆమెపాదాల పసుపుని తీసి కనుల కద్దుకుంటాడు. కాని, ఉత్తరక్షణము, ఏదో గొప్ప తప్పుచేసినవానిలా అక్కడనుంచి పారిపోతాడు. తర్వాత, సంపత్తూ మంగళమూ అతనికొరకు చాలా బాధపడతారు. సుకుమార్‌కి వడ్డాణమంటే తగని ప్రేమ అని తెలిసిన వారు మంగళము నడుమున ఉంచుకున్న వడ్డాణాన్ని తీసి సుకుమార్‌కి పంపుతారు. వడ్డాణాన్ని అందుకున్న సుకుమార్ :

సాగుతున్న యాత్ర

ఈ రెండు కథలూ నాచేత వ్రాయించినవారు ఆప్తస్నేహితులు ఎస్. జి. ఆచార్యా. ఏదో ఒక రేడియో ప్రసంగపు సందర్భంలో నాకాయన పరిచయము కలిగినది. అదివరకు వారు నన్నుగురించి చాలా వినిఉండడమువల్లా, నేనూ వారి దేశసేవాతత్పరతను గురించి తెలిసిఉన్నందువల్లా, చప్పున స్నేహితులుగా మాట్లాడుకున్నాము. తర్వాత, ఆయనభార్య అన్నపూర్ణాదేవితోనూ పరిచయమైనది నాకు. వారిద్దరూ బాగా చదువుకున్నవారు. మిక్కిలి సంస్కారవంతులు. ఆయన అప్పుడు 'ప్రజాబంధు' అనే పత్రికను నడుపుతూండేవారు. ఇదివరకు నేను రచించిన కథానికలూ, రేడియోనాటికలూ వ్యాసాలు చదివిఉన్నారు వారిద్దరునూ. ఆచార్య నన్ను మరీమరీ అడిగారు తమ ప్రజాబంధు విశేషసంచికకు ఏదైనా వ్రాయమని. వారి ప్రోద్బలమువల్లనే 'వడ్డాణము' అవతరించింది. తరువాత, కొన్నాళ్ళకు, అన్నపూర్ణాదేవి తాను నడుపుతూన్న 'చిత్రాంగి' కోసము ఏమైనా వ్రాయాలి నేను, తప్పదు, అంటే, 'మంగళము' కథ వ్రాశాను. ఈ రెండురచనలనూ వారు చాలా మెచ్చుకొన్నారు. 'చిత్రాంగి'కి ఇంకాకొన్ని రచనలూ ఇచ్చాను నేను, ఆ తర్వాత. వానిలో ముఖ్యం 'మెయిల్ అగని స్టేషన్' అనే రచనా 'జ్ఞాపకాలు' అనే రచనా.

'మెయిల్ ఆగని స్టేషన్'లో, "మా ఊరిస్టేషన్‌లో మెయిల్ ఆగదు. కాని, తీగ సంపెంగపువ్వులు పూస్తాయి" అంటూ ప్రారంభించి, మెయిల్ ఆగని స్టేషన్ హృదయము, పాపము, కొందరి జీవితాలలాగే, బిక్కు బిక్కు మంటూ ఉంటుందని వర్ణించాను.

'జ్ఞాపకాల' లో మన జ్ఞాపకాలయొక్క విలువా, అవి మన జీవితాన్ని ఎంత విపరీతంగా కమ్మివేసేదీ వివరించాను.

ఎస్. జి. అచార్యతోటి నాస్నేహమును ఈ జన్మలో మరచిపోలేను, నేను. ఉత్తమ పురుషుడు అతను. అతనివంటివారు చాలా అరుదు. దేవుడు మంచి వారిని ముందుగానే తనవద్దకు లాక్కుపోతాడు, అంటారు. అల్లాగే, ఎస్. జి. ఆచార్య పిన్నవయస్సులోనే మనలను విడిచి వెళ్ళిపోయారు.

౧౯

పరిపరి వ్రాయు హస్తమది, వ్రాసిన నావల
బోవు; నీ చమ
త్కారణముగాని ధర్మరతిగాని మరల్పగ
లేదు దానిలో
నరసగ మేనియుం దుడువ! ఆ లిఖితం
బున నొక్క ముక్కయున్
చెరగదు నీదు భాష్పములు చెర్వాయి
వాగయి వెల్లి వోయినన్!!

రాయప్రోలు సుబ్బారావు

"విరుచుకుపడే సముద్రకెరటపు శిఖరంలాగ విరగబడి నవ్వుతూ పెనుగాలికి అల్లలాడే పోకమొక్కలాగ ఇటూ అటూ ఊగిపోతూ అట్టహాసంతో అడిగింది చంచల నన్ను; 'మీరు నవ్వరేమి'? అని. ఆమె విపరీతపు నవ్వును ఆ గదిలో ఉన్న నలుగురైదుగురు మొగ గొంతుకలూ ప్రతిధ్వనించాయి. చంచల మళ్లా అడిగింది నన్ను: 'మీరు నవ్వరేమి?' అని.

ఏమని చెప్పను? 'చంచలా! నీవు ఇక్కడనుంచి వెళ్లిపో! ఈ వాతావరణం నీకు సరిపోదు. కాకినాడ వెళ్లిపో, చంచలా! అక్కడ మళ్లీ నా కాదంబరివి కావచ్చును నువ్వు' అని ఎలా చెప్పను?"

—నా కథచదువుతున్నాను స్నేహితులముందు. నేను రచించిన కథ, నా కథ. అవి యుద్ధపు రోజులు. చీకటిపడేసరికి బొగులుమెగులుమంటూ ఉంటుంది

చంచలను లేపకుండా, ముందుకువంగి, మంచిముత్యాలను ముద్దుపెట్టు కున్నాను. కళ్ళు తెరవకుండానే, "వచ్చారా!" అంటూ, తన రెండుచేతులూ పైకి చాచి దగ్గరకు తీసుకుంది, నన్ను, చంచల. నన్ను గట్టిగా కవుగిలించుకుంది, చంచల.

క్షణంలో మామిడిచెట్టును అల్లుకుపోయింది, మాధవీలత.

దూరాన, ఎంతోదూరాన, మరోలోకంలోంచి, ఐనా, స్పష్టంగానే, విని పిస్తున్నాయి ఒకొక్కమాటా :

మామిడి చెట్టునూ అల్లుకొన్నదీ మాధవీ
లతొకటి;
ఏమూ రెండిటి ప్రేమా, ఇతింతన లేమూ !

....అని.

కాని, మరుక్షణములో ఆ మాటలకంటే ఇంకా బిగ్గరగా, ఏదో సము ద్రపు రొదలాగ మనస్సును కలవరపెడుతూ వినిపించింది, మరీ బిగ్గరగా :

చూడలేని పాపిష్టితుపానూ ఊడబీకె లతనూ
...మోడై, మామిడిచెట్టూ, మాధవీలతతో
మాయలో కలిసిందీ !...

....అంటూ.

"....మళ్ళీ శుక్రవారం వస్తాను" అంటూ వెళ్ళిపోయింది, చంచల. శుక్రవారం, రాలేదు. ఆ పై శుక్రవారమూ రాలేదు. తరువాత ఎన్నాళ్ళకో ఉత్తరం వచ్చింది. ఒక్క పంక్తే: "అమ్మ రానియ్యలేదు. మేము ఇప్పుడు కరాచీలో ఉన్నాము. నన్ను మరచి పొండి!" అని,

నేను గట్టిగా నవ్వుతాను, మరీ గట్టిగా!

నా నవ్వు వినిపించడములేదూ ?

మీరు నవ్వరేమి ?

....కథ ముగిసిన ఒక్క-క్షణము నిశ్శబ్దము. వెంటనే, గది అంతా ప్రతిధ్వనించింది, కరతాళ ధ్వనులతో. లలిత చప్పట్లు కొడుతోంది, ఎంతో ఉత్సాహంతో. కథ వింటూన్న అందరూకూడా ఆమెతో కలసి చప్పట్లు కొడుతున్నారు. నా కథ చదువడములో నిమగ్నుడనై ఉన్న నేను అప్పుడు, మళ్ళీ, ఈ లోకంలోకి వచ్చాను, కాశ్మీరపు పద్మాకారము నుంచి.

"ఎంత బాగా వ్రాశారండీ!" అన్నది, లలిత. అందరూ అమాటే అన్నారు.

నన్ను సాగనంపడానికి నాతో క్రిందికివచ్చిన దుర్గాబాయ్ నన్ను వేరే పిలచి, కూర్చోమని చెప్పి; "నిజం చెప్పు!....ఆ అమ్మాయి ఎవరో. వెంటనే నీకామెను పెళ్ళిచేయిస్తాను!!" అన్నారు. నేను చిరునవ్వు నవ్వాను.

దుర్గాబాయ్ అన్నారు: "నవ్వుకాదు. నీవు నిజముగా ఆమెను గాఢంగా ప్రేమిస్తున్నావు. ఆమె అదృష్టవంతురాలు. ఎవరో చెప్పు. నాకుతెలిసిన అమ్మాయే ఐ ఉంటుంది, తప్పకుండా. మిమ్మల్ని, ఇద్దరినీ ఓ ఇంటివారినిచేసే బాధ్యత నాది! చెప్పు!!....నీవు సుఖపడడమే మాకందరికీ కావలసినది. నీవు ఇలా ఆరాటపడడము మేము సహింపలేము!" అని.

ఇంతటి ఆప్యాయత ఉంటుందా లోకంలో! కన్నులు చెమ్మగిల్లాయి నా కొరకు ఆమెపడే ఆదుర్దాను గుర్తించి. లేనిచిరునవ్వును తెచ్చుకుంటూ అన్నాను, ఆమెతో :

అని పడుకున్నాము - ఆఫీస్ బిల్లింగ్‌పైననే. గదిలో ఉన్న స్పీకర్‌పైన చర్చిల్ ఉద్బోధన వినిపిస్తోంది. మరీ క్లిష్టపరిస్థితులైనా, అతని అతి గంభీరసింహనాదము ఎంతో ఉత్సాహాన్ని కల్పిస్తోంది. ఆ మాటలు వింటూ, నేను మాగన్నుగా నిద్ర పోసాగాను.

ఇంతల్లోకి, నైట్‌వాచ్‌మన్ క్రిందనుంచి కేకవేశాడు : రేడియోనిలయానికి ఫర్లాంగుదూరాన ప్రవహిస్తున్న కూవమ్‌నది పొంగి నీరు మా కాంపౌండ్‌లోకి వస్తోంది, వెల్లువగా.

గోపాలనూ నేనూ క్రిందికివెళ్ళి చూతుముకదా మహా జలార్ణవమై ఉన్నది ప్రదేశమంతా. రోడ్‌మీదుగా లోనికివచ్చే నీరేగాక, బిల్డింగ్‌చుట్టూన్న ప్రదేశంలోంచి గుడగుడమంటూ పైకి ఉబ్బుకు వస్తోంది, నది, పాతాళగంగలాగ! పైన ఎక్కడో ఏదో చెరువు గండిపడి ఆ నీరంతా కూవంలోకి వస్తోందని తెలుసు, మాకు. కాని, ఇలా ఆ ప్రళయము మాపైన విరుచుకు పడుతుందనుకోలేదు మేము. నిమిషనిమిషమూ నీరు ఎక్కువవుతోంది. ఇక, ఒక అరగడియలో స్టూడియోలోకి నీరు రాసాగింది. అప్పుడు, గోపాలన్ చప్పున ఫోన్‌వద్దకువెళ్ళి ఏ. ఆర్. పి. మాప్లా బెటాలియన్‌వారిని పిలిపించారు. వారు వచ్చేలోగా స్టూడియోలోఉన్న వస్తువులను అన్నిటినీ మేడమీదికి జేరవేయసాగాము మేమిద్దరమూను, వెల్లువతో పోటీ చేస్తూ. మాప్లాలు వచ్చి పియోనోవంటి బరువైనసామానులను అతివదిలంగా మేడమీదికి మోసుకువెళ్ళారు. స్టూడియోలు ఖాళీచేసేపని వారికి ఒప్పగించి, కంట్రోల్‌రూమ్‌కు వెళ్ళి, అక్కడున్న ఇంజనీయర్‌నులేపి గోపాలన్ ట్రాన్స్‌మిటర్ యంత్రాన్ని బల్లలపైకి ఎత్తిపెట్టి భద్రపరచారు. నీరు ఇంకా ఇంకా ఎక్కువవుతోంది. కంట్రోల్‌రూమ్‌కు అంత దిట్టమైన కట్టడములేదు. వెల్లువ ఎక్కువై ఏ నిమిషమైనా కూలిపోవచ్చును. అందుచేత, గోపాలన్ ట్రాన్స్‌మిటర్ యంత్రాలలోని వివిధభాగాలనూ గబగబా విప్పివేసి, మిక్కిలి విలువగల ఆయంత్రపరికరాల్ని తానే స్వయంగా కొంతదూరాన ఉన్న మరో భవనము పైభాగాన భద్రపరచారు. మిగిలిన రాత్రి, ఒక్క నిమిషము నిద్రలేదు, మాకు. కోడికూసే సరికి, స్టూడి

డం కష్టం. ఎన్నోసీలలు బిగించాలి, అతి జాగ్రత్తతో. కాని, గోపాలన్ సమయ స్ఫూర్తి అద్వితీయము! అన్నిచోట్లా తానేఐ అందరకూ తానే సలహాలనిస్తూ సూర్యోదయ సమయానికి, తీసివేసిన ట్రాన్స్‌మిటర్‌ను మళ్లా నెలకొల్పారు!

నాకు బాగా జ్ఞాపకము: ఆల్ ఇండియా రేడియో నిలయప్రసారాలను గుర్తుపరచే 'సిగ్నేచర్‌ట్యూన్' గల రికార్డ్‌ను సిద్ధంగా ఉంచుకున్నాను నేను, - ప్రసారసమయానికి ముందుగా రెండునిమిషాలు శ్రోతలకు వినిపించడానికి. ఇంజనీయర్లు అందరూ వారివారి పనులలో నిమగ్నులై ఉన్నారు, ఒక్కొక్క-మరా సరి జూచుకుంటూ. ఏడుగంటలకు ఇక ఐదు నిమిషాలు. గోపాలన్ ఇంకా ఏదో సీల బిగిస్తూనే ఉన్నారు....ఇక మూడు నిమిషాలు....గోపాలన్ కళ్ళలో ఒకవంక గొప్ప ఉత్సాహము; ఒకవంక 'ఏమవుతుందో' అనే గొప్పబెంగ!....ఇక రెండు నిమిషాలు. నాకు సైగచేశారు గోపాలన్. వణికే చేతులతో, తిరుగుతూన్న రికార్డ్‌పైన ముల్లు ఉంచాను. సరిగ్గా ఆ నిమిషానికే, చూరులోంచి త్రోవజేసుకొని ఉదయసూర్యుని కిరణజాలము ఒకటి పెళ్ళుమంటూ ప్రకాశించింది రికార్డ్‌పైన! ఆ నిమిషానికే వయెలిన్ తంబూరా సమ్మేళనమైన దివ్య నినాదము చేరువనే ఉన్న రేడియోసెట్‌పైన వినిపించింది. మాస్టేషన్!! గోపాలన్ కళ్ళు మెరిసిపోతున్నాయి. ఆయన ఆస్తికుడుకాడు; కాని, ఆ నిమిషం 'థాంక్ గాడ్!' అన్నారు ఆయన, స్పష్టంగా!!

నేను సరేసరి. విపరీతమైన ఉత్సాహముతోనూ అనిర్వచనీయమైన కృతజ్ఞతా భావముతోనూ పులకాంకితుడనై పోయానన్నమాట....రేడియో గడియారము టంగుటంగున ఏడుగంటలు కొట్టింది. మైక్రొఫోన్ దగ్గరగా ముఖాన్ని ఉంచి, విశ్వప్రయత్నాన నా తొట్రుపాటును కప్పిపుచ్చుకొని, మామూలు కంఠస్వరంతోనే, ఎంతో ఆనందంతో అన్నాను : "ఆల్‌ఇండియా రేడియో మద్రాస్ కేంద్రము. ఉదయప్రసారము ప్రారంభము" - అంటూ. ఇక ఆ తర్వాత రికార్డ్‌ల కార్యక్రమమూ తెలుగులో వార్తలూ అనుసరించాయి. స్టూడియోలు జలమయమైనందున చాలావరకు రికార్డ్‌లూ రిలేలూ ఏవో కొన్ని అతి ముఖ్యమైన ప్రసంగాలూ కంట్రోల్ రూమ్‌నించే ప్రసారము చేశాము.

సాగుతున్న యాత్ర

బరువు బెడదతోనే ఢిల్లీ వెళ్ళాను. స్టేషన్‌కు మాచెల్లెలు ప్రమీళవచ్చి నన్ను తన బసకు తీసుకువెళ్ళింది. త్రోవలోనే అడిగింది "అలా ఉన్నావేమి అన్నయ్యా!" అని. నేను ఏమీ అనలేదు.

ఢిల్లీలోఉన్న స్నేహితులువచ్చి నన్ను కలుసుకున్నారు. క్రొత్త రేడియోకేంద్రానికి కావలసిన ఏర్పాట్లు తీవ్రంగా సాగుతున్నాయి - నేను మాత్రము ఇంట్లో ఏడుస్తూ కూర్చున్నాను. ప్రమీళ నాపై కోపగించింది. ఆమె కనుక్కొంది, ఇది ఏదో హృదయసంబంధమైన బాధ అని. ఆమె అన్నది: లోకంలో ప్రేమికులు లేరా? వారు విరహం అనుభవింపరా? ఎక్కడా చూడలేదు, ఈ విపరీతపు భీరుత్వము!" అని.

"ఇక ఈ ఊళ్ళో ఒక్క నిమిషం ఉండలేను ప్రమీళా!"అంటూ రైలుకు ప్రయాణమయ్యాను, నేను.

నాకు సెలవు ఎలా ఇచ్చారో, ఎలా వెళ్ళనిచ్చారో ఆఫీస్‌వారు, నాకు తెలియదు. నాలో ఒక్కటే ఆలోచన: వాయువేగాన మనప్రాంతాలకు వచ్చి వ్రాలాలని - ఏది ఎలా పోయినా సరే! మళ్ళీ ఒక పర్యాయము నాలో మనస్సుకీ హృదయానికీ వచ్చిన సంఘర్షణలో హృదయమే జయించినది.

ఆ ప్రయాణములో పూజ్యులు శ్రీ ఎస్. సత్యమూర్తీ ఆయన కుమార్తె లక్ష్మి, నాతో ఉన్నారు. సత్యమూర్తి మాపిన్ని రుక్మిణమ్మగారికి సన్నిహితులు; లక్ష్మి మా చెల్లెళ్ళనిద్దరినీ బాగా ఎరుగును. ప్రయాణము కులాసాగానే గడిచి పోయింది. త్రోవపొడుగునా చాలాచాలా మాట్లాడాను సత్యమూర్తితో. సమకాలిక రాజకీయ విషయాలను గురించీ, కాంగ్రెస్ చరిత్రను గురించీ, మన స్వాతంత్ర్య సమరాన్ని గురించీ ఆయనకు తెలిసినంత శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్యకు తెలుసు; అంతే. ఎటొచ్చీ, ఆ విషయాలను గురించి చెప్పేతీరు వేరు వేరు, వారిద్దరిలోనూ. సత్యమూర్తి గొప్ప వక్త ఐనా, ఆయన మాట్లాడుతూంటే మనము మధ్యమధ్య ఒకొక్కమాట, మనకు తోచినది, అంటూ ఉండవచ్చును. పట్టాభి

కాని, ఒక ఆలోచన మెరవులా మెరసింది : 'ఎప్పుడో ఒకప్పుడు, ఈ విపరీతపు పరిస్థితులు మారి, అవతలవారికి నేను అవసరమైతే, అప్పుడెల్లాగ ? ఆ పిలుపు నేను వినలేకపోతే, ఆ అవతలవారేమై పోతారు! అప్పుడు, నా లేమి, వారి శేషజీవితాన్ని చీకటిమయము చేయదూ? నన్ను క్షమిస్తారా ఇక, అప్పుడు?' అని.

ఆ ఆలోచనే బలమై, తీయబోయిన రైలుతలుపును గట్టిగా బిగించాను. కాని, తలుపుపక్కనే నిలుచున్నాను, మిగిలిన రాత్రంతా.

ఐతే, ఆ నిమిషం కొండంత బలము కావలసివచ్చింది - చనిపోవడానికి కాదు, బ్రతుకడానికి!!

పల్లి స్టేషన్ డైరక్టర్ శ్రీ శాస్త్రికి. ఒకటి, మద్రాస్ స్టేషన్ డైరక్టర్ శ్రీ గోపాలన్‌కి. శ్రీ శాస్త్రియెడ నాకు ఉద్యోగరీత్యానే గాకుండా, వ్యక్తిగతంగాకూడా మిక్కిలి భక్తిభావమూ ఎంతో అనురాగమున్నూ. వారికీ నాయందు గొప్ప సద్భావము. కాని, నాలోని లోపాలున్నూ వారు అతినిశితంగా విమర్శించేవారు. ధర్మనిర్వహణయందు ఉండవలసింత ఆసక్తి నాకు లేదని వారి నిశ్చితాభిప్రాయము. అంతేగాక, ఏవేవో పిచ్చిపిచ్చి ఊహలతో మనస్సును కలతపరచుకుంటూ ఏకాగ్రతను పోగొట్టుకుంటున్నానని వారి అభిప్రాయము. అది చాలవరకు నిజమే. ఏపని ఐనా ఎంతబాగాచేసినా, అంతకంటె ఇంకా కొంచెము బాగాచేసి ఉండవచ్చును అనేవారు. కాని, కొన్ని ముఖ్యమైన పనులు నిర్వహించడానికి నన్నే నియమిస్తూండేవారు. కొన్నేళ్ళ తర్వాత, వల్లభ్భాయి పటేల్ మద్రాస్‌కు విచ్చేసిన తరి, వారు ఉపన్యసించే బహిరంగసభలో, సభావేదికపైన వల్లభ్భాయి ప్రక్కనే నిలచి ఆయన మాట్లాడవలసిన మైక్రొఫోన్‌ను వారిఎదుట అమర్చేపని నాకు ఒప్పగించారు శాస్త్రి. ఈపని చాలా సున్నితమైనది. ఉపన్యాసకుని ఏమాత్రమూ ఇబ్బంది పరుపకుండా, వారిమాట ఒక్కమాట పోకుండా, మైక్రొఫోన్ అమర్చాలి. వల్లభ్భాయి ఉపన్యసిస్తూంటే చీమ చిటుక్కుమన్నా, వారు మండిపడతారనే భావముండేది - అంతటి చండశాసనుడు ఆయన. అటువంటివారి ప్రక్కన నిలబడే బాధ్యతా, గౌరవమూ, నాకు అందజేశారు శ్రీ శాస్త్రి. ఆ నిమిషాలు నేను చాలా గర్వింపతగిన నిమిషాలు. నా ఉద్యోగపు దుస్తులలో మైక్రొఫోన్ చెంత నిలుచున్న నన్నుచూచి వల్లభ్భాయి చిరునవ్వు నవ్వారు. మైక్రొఫోన్ వారి ఎదుట అమర్చగా, మిక్కిలి సౌజన్యంతో వారు అడిగారు నన్ను: "ఇంత దగ్గరగా కూర్చుంటే సరేనా?" అని.

శ్రీ శాస్త్రికి తాను అన్ని విషయాలలోనూ తన విద్యుక్తధర్మాన్నే పాటించాలి అనే గొప్పదీక్ష విపరీతంగా ఉండేది. ఈ ధర్మపరిపాలనలో చుట్టాలనీ, స్నేహితులనీ, అధికారులనీ ఏమాత్రము పక్షపాతముగాని, దాక్షిణ్యముగాని పనికిరాదు వారికి. తనవద్ద ఉన్న ఉద్యోగస్థులు, ముందు, ఆఫీస్‌పని ఏమాత్రము లోపమూ లేకుండా చెయ్యాలి - ఆతర్వాతనే కబుర్లూ, కులాసాలు. ఒకపర్యాయం

సాగుతున్న యాత్ర

గోపాలన్ ఒక్క వాక్యమే వ్రాశారు : "నీతో నా ఇన్నాళ్ళ పరిచయముబట్టి నీవు నీ వ్యక్తిగత సమస్యలకంటె ఉద్యోగరీత్యా నీ విద్యుక్తధర్మానికే ఎక్కువ విలువనిస్తావనీ ఎటువంటి పరిస్థితులలోనూ రేడియోసంస్థయెడగల నీ బాధ్యతలను పాటిస్తావనీ అనుకున్నాను నేను" అని.

ఈమాట వాడిసూదిమొనలా గ్రుచ్చుకున్నా. నేను తిరిగి ఢిల్లీకి వెళ్ళడానికి సంసిద్ధుడను కాలేకపోయాను. అప్పటి నా మనోదౌర్బల్యం అటువంటిది!

మైసూరులో ఉండగా ఆ ఊరి రేడియోనిలయపు నిర్వాహకుడు శ్రీ గోపాలస్వామిని చూచాను. వారు నాకు చాలా ఆప్తులు. అప్పటికి మైసూరు 'ఆకాశవాణి' ఇంకా ఏ. ఐ. ఆర్. లో చేరలేదు. గోపాలస్వామితో రోజూ రేడియోనిలయానికి వెళ్ళి వాస్తుండేవాడను నేను. అనేక విషయాలలో నా సలహాను తీసుకుంటూన్న ఆయనతో ఒకసారి నేను నామనస్సు విప్పి, అన్నాను , "ఈ పరిస్థితులలో నేను బహుశా ఏ. ఐ. ఆర్. ను వదులుకోవలసి వస్తే, మీసంస్థలో పని జేయనిస్తారా నన్ను" అని. ఆయన అన్నారు : "అలా ఎప్పటికీ జరుగదు. ఐనా నిన్ను మేము భరింపగలమా?" అని.

మైసూరునుంచి శ్రీరంగపట్టణము వెళ్లాను. కావేరీనదిలో ద్వీపము ఏర్పడిన ప్రతిచోటా శ్రీరంగనాధస్వామి దేవాలయము ఉంటుంది. ఇచ్చట రంగనాధుని దర్శించేసరికి నాకు తిరుచ్చినాపల్లికి సమీపాన ఉన్న శ్రీరంగములోని రంగనాధస్వామి స్మృతికివచ్చి, ఆ రోజులూ ఆ వాతావరణమూ పెల్లుబికివచ్చింది నాలో. నేను వివశుడనైపోయాను. ఏదో వెర్రిగా ప్రార్థించాను రంగనాథుని సమక్షన ఇచ్చట. అల్లాగే రంగనాయకి ఎదుటకూడా మోకరిల్లి, నా హృదయవిదారగాధను చెప్పుకొని, మొరబెట్టుకున్నాను. మన ఇష్టదేవతను ప్రార్థించేటప్పుడు ఇది సబబు, ఇది సబబుకాదు అనే ఆలోచనేలేక, మన మనస్సులోని కోరికను నెరవేర్పమని వెర్రిగా, అతివెర్రిగా అర్థిస్తాము. అమ్మను అడిగినట్టే దేవినీ, మొండిపట్టుతో! అప్పటి పరిస్థితులలో నేను ఆశించినది జరుగుట అసంభవమని నా మనస్సు చెపుతుంది. కాని, హృదయము? హృదయము కోరే కోరికకు హద్దు నియమాలున్నాయా?

డానికీ మధ్య ఎంత లేదన్నా ఒక చంద్రసంక్రమణము కావాలి - అదీ, ఎంతో పోరితేనే. ప్రతినాటకమూ ఒక గండము - కాని, ప్రతినాటకమూ అద్భుతంగా పరిణమిస్తుంది. అతని వద్దనుంచి నాటకము రాదు, రాదు, అని నిరాశచేసుకునే నిమిషంలో అతను అవతరిస్తాడు మన ఎదుట. అతనితోకూడా అతని ముద్దుల పట్టి, కుమార బుజ్జాయిన్నీ. చేతిలో ఎంతపని ఉన్నా, అనంతా వదలి అతనివద్దకు రావాలి, నేను. కుశలప్రశ్నలతోటీ, ఎత్తిపొడుపులతోటీ, వెటకారపు మర్యాదల తోటీ కొంత కాలయాపన జరుగుతుంది. ఇంతసేపూ బుజ్జాయిని సినిమాకు తీసుకు వెళ్ళనందుకు అతనికి లంచముగా ఏమియ్యాలో అనే బేరము ఒక ప్రక్కన సాగు తూనే ఉంటుంది.

ఇంతట్లోకి "శర్మిష్ఠపాడే పాట ఎంత బాగా వచ్చిందనుకున్నావు!" అంటూ, పాడ నారంభిస్తాడు, కృష్ణశాస్త్రి. అది పాటకాదు; అమృతధార! అద్భుత కవనము!! ఆ పాట వ్రాయడానికి సాధారణ కాగితము పనికిరాదు. నేను ప్రాణతుల్యముగా దాచుకున్న సుందరాతిసుందరమైన లెటర్ పేపర్‌ను తెచ్చి అతని ముందు ఉంచితే, కాగితాన్ని మెచ్చుకుంటూ, నేను తొడుగుకున్న మస్లిన్ చొక్కా అందాన్ని మెచ్చుకుంటూ, వ్రాస్తాడు, అతను, ఆపాట. నాలుగుపంక్తుల్లో, ఆరు పంక్తుల్లో, అవతరిస్తాయి, ముత్యాలకోవలవంటి అక్షరాలతో. అంతే! ఇక ఆవేళకు అంతే !!

నాటకంలో వచనభాగం కృష్ణశాస్త్రి చెప్పగా వ్రాయడానికి అతనికి ప్రియమైన లేఖకుడు కావాలి. అందరూ పనికిరారు అతనికి. కృష్ణశాస్త్రియందు అభిమానముగల అతని మేనల్లుడో మరెవ్వరో కావాలి. వారు దొరకరు, ఆ నిమిషము. కనుక, మరునాడు అదే వేళకని వాయిదా పడుతుంది. కాని, మరునాడు అదేవేళకు కార్‌లో అతనికోసము వెళితే, "ఎక్కడికో వెళ్లారు. కాటూరి వెంక టేశ్వరరావు గారితో; ఆపని చూచుకుని, తిన్నగా, రేడియోస్టేషన్‌కే వస్తానన్నారు!" అంటారు, ఇంట్లోవారు. కాని అతను ఆవేళ రాడు. మరునాడూ రాడు.

ఇక, ఇల్లా కాదని, ఈసారి ఎల్లాగైనా అతనిచేత కాస్త ముందుగానైనా వ్రాయించాలి నాటకము అనీ, నాటకప్రదర్శన సక్రమంగా జరిపించాలీ అనీ,

ఆ నాటకములో పద్మావతి నటనా నైపుణ్యము పరమావధి నందుకొన్నది. నాటకాభినయనములో, నటించేవారు తాము నిరూపించేపాత్రలో ఎంత వరకు తాదాత్మ్యమును పొందవలెను అనేది ఎప్పటికీ చర్చనీయాంశమే. కాని, ఆరాత్రి రేడియోప్రదర్శనలో పద్మావతి నూటికినూరుపాళ్ళూ దేవయాని ఐయారు! యయాతిని విడిచి వెళుతూన్నప్పుడు ఆమె ప్రకటించిన దైన్యభావము రాళ్ళను సైతము కరగింప శక్తికలది!!

నాటకము అంత గొప్పగా రాణించినందులకు తబ్బిబ్బైపోయాను, నేను. ప్రదర్శన ముగిసినవెంటనే, ఇందరితోనూ, అయ్యగారి వీరభద్రరావూ, సూర్యనారాయణమూర్తీ, నేనూ కలసి మా బసకువెళ్ళి, అక్కడ బ్రహ్మాండమైన విందు అమర్చినాము. నా జీవితములో ఒకానొక పున్నమరాత్రి, శర్మిష్ఠ నాటక ప్రదర్శన !

* * * *

తోటమాలి కదలలేదు....ఉషాబాల కన్నులలోకి అలాగే చూస్తున్నాడు.

....రాజమాత కూతురుభుజాన చెయ్యిఉంచి మళ్లా అన్నది : "ఎవరితను?" అని.

"ఎవరు నువ్వు!........మాట్లాడవేమి!!....ఎవరు నువ్వు?"

—ఎవరివీ మాటలు? ఉషాబాలే! ఉషాబాలే! బిగ్గరగా :

"ఎవరు నువ్వు!....ఎవరు నువ్వు!!" అని, పాలగచ్చు అంతా ప్రతిధ్వనించింది. తోటమాలి కదలలేదు.

రాజకుమారుడు ఓ అడుగు ముందుకు వచ్చాడు.

సాగుతున్న యాత్ర

తోటమాలి క్రిందటి రేయి విపరీతపు గాలివానకు నేలకువ్రాలిన మాలతీ తీగను మామిడిచెట్టుపైకి ఎక్కించడానికి ఎత్నిస్తుండగా రాజకుమార్తె ఉషాబాల అవతరిస్తుంది, అతని కట్టెదుట. దేవతాస్త్రీ ఏమో ఆమె అనుకుంటాడు తోటమాలి, మొట్టమొదట. కాని, ఆమె అతనిని పలుకరించి, మాలతీతీగెను మామిడికొమ్మపైకి ఎక్కించడానికి సాయపడుతుంది. ఇలా కలసిన వారి స్నేహము నానాటికి అతిశయిల్లి, పున్నమరాత్రి వచ్చేసరికి వారిద్దరూ తోటలోని వాగు ఒడ్డున ఇసుకతిన్నెలలో పిచ్చుకగూళ్ళు కట్టుకుంటూ ఆడుకునేటంతటి ఆప్యాయతగా అభివృద్ధిజెందుతుంది. ఆ పున్నమవెన్నెలలో రాజకుమార్తె తొడుగుతుంది తోటమాలి వ్రేలున వెలలేని తన వజ్రపుటుంగరాన్ని. తోటమాలికి తల్లి లేదు. తల్లి ఐనా తండ్రిఐనా పెద్దమాలే. పెద్దమాలి కొడుకువ్రేలున వజ్రపుటుంగరాన్ని చూచి కొడుకును ఆవహించిన ఆ విపరీతపు ప్రేమను గురించి శంకిస్తాడు. కొడుకును వారింప యత్నిస్తాడు. కాని, అతనిమీది పితృవాత్సల్యంవల్ల ఏమీ అనలేకపోతాడు.....మళ్ళీ పున్నమరేయి. తోటమాలి వాగువద్ద వెన్నెలలో కూర్చుని రాజకుమార్తెను తలచుకుంటూ ఈ గుప్పిటిలో ఇసుక ఆ గుప్పిటిలో పోసుకుంటూ ఉండగా రాణివాసమునుంచి పరిచారిక చంపకము సందేశమును తెస్తుంది, "దేవిగారి సెలవైనది; దక్షిణపువేపు కోటద్వారము తెరచి ఉంటుంది; నేను అక్కడే ఉంటాను" అంటూ. ఆ సందేశాన్ని పాటించి తన తోటలోని పువ్వు లన్నిటిలోనూ మిక్కిలి శ్రేష్టమైనవానిని దండలుగా గ్రుచ్చి తీసుకొని, తోటమాలి రాణివాసమువైపు బయలుదేరుతాడు. తండ్రి కొడుకును వారింపజూస్తాడు. కాని "నాయనా!" అనకలుగుతాడు. ఇక మాట రాదు. తండ్రివైపు దీనంగా చూస్తూ వెళ్ళిపోతాడు తోటమాలి. తోట పొలిమేరవరకూ సాగనంపుతుంది నిద్దుర కళ్ళతో పెంపుడు లేడి అతనిని.

కోటలో ప్రవేశించిన తోటమాలి అనేక ప్రాకారాలుదాటి, రాజకుమార్తె ఉన్న సౌధమునుజేరి, తనకై నిరీక్షిస్తూన్న ఉషాబాల దోసిలిలో తా నల్లిన దండలనుంచుతాడు. అతనుతెచ్చిన దండలను ఆమె తన తలలో సంతరించుకుంటూం

సాగుతున్న యాత్ర

నిజమే! అతనికి నా కథ వినిపించాక ఎక్కడలేని మనశ్శాంతి కలిగింది నాలో!!

'తోటమాలి' కథను భారతివారు ప్రచురించారు, ఆ తర్వాత కొన్నాళ్ళకి. రేడియోలోనూ ప్రసారము చేశాము మరికొన్నాళ్ళకు, అచ్చటచ్చట అందమైన సంగీతపు హంగులు ఏర్పరచి.

ఆ రోజులలో పూజ్యులు శ్రీ రాయప్రోలు సుబ్బారావుకు ఉత్తరం వ్రాశాను నేను, రేడియోకార్యక్రమాల సందర్భంలో. "భారతిలో 'తోటమాలి' చదివే ఉంటారు" అన్నాను ప్రస్తావవశంగా.

శ్రీ సుబ్బారావు జవాబువ్రాస్తూ అన్నారు :

"తోటమాలి చదువకుండా ఉంటానా?....కాని మనకూ అంతే; నిరంతర నిరీక్షణే మనవంతున్నూ; మనకూ నిద్దురలేదు. ఉదయభానుని చూస్తూ, వజ్రపుటుంగరముతో మన ఎర్రని కళ్ళను తుడుచుకుంటూ ఉండవలసినదే మనమున్నూ, ఇప్పటికీ, ఎప్పటికీని" అని వ్రాశారు, శ్రీ రాయప్రోలు సుబ్బారావు.

అతను విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు కాబట్టి, పాశ్చాత్యసాహిత్యరీతుల లోనూ మంచిపరిచయము అలవడినది. సంస్కృతజ్ఞానము సరేసరి. ఇంతటివాని హృదయములో అవతరించిన చండీదాస్‌కావ్యము ఎందుకు బాగుండదు!

రేడియోప్రదర్శన కూడా చాలా గొప్పగా రాణించినది. రాజేశ్వరరావు సంగీత నిర్వహణకు పూనుకున్నాడు. అతను సాధారణ మ్యూజిక్-డైరక్టర్‌గా పనిచెయ్యలేదు. ఈ ప్రదర్శనలో పాటలలోని ప్రతిఅక్షరమూ మళ్ళా మళ్ళా చదివించుకుని ప్రతిమాటా పూర్తిగా అవగాహనచేసుకునే ఆ అభిప్రాయాలకు తగినట్లు రాగవరుసలకు రూపకల్పన చేయసాగాడు, ఎంతో భక్తితో, ఎంతో ఉత్సాహంతో. పాత్రధారులున్నూ చాలా శ్రద్ధతో, పూర్తిగా అనుభవిస్తూ, నిర్వహించారు.

నాకు సంగీతములో చాలా అభిరుచి ఉన్నా, శాస్త్రమురాదు కాబట్టిన్నీ, ఈసంగీత నాటక దర్శకత్వము పూర్తిగా రజనే స్వయంగాచూస్తున్నాడు కాబట్టిన్నీ ఆఫీస్‌లో నా ఇతరపనులను చూచుకొని చండీదాస్‌నాటకము ఇంకొక్క పదినిమిషాలకు ప్రారంభమవుతుంది అనగా లేచి నాబసకు బయలుదేరాను - అక్కడే, నా రేడియోలో నాటకమును వినవచ్చుగదా అని. కాని, మేడమెట్లు దిగుతూండగా, మా అసిస్టెంట్ డైరక్టర్ త్యాగరాయశాస్త్రి ఎదురై "ఎక్కడికి వెళుతున్నావు? ఇంక ఒక్క క్షణములో చండీదాస్‌నాటకము ప్రారంభమవుతోంది! స్టూడియోలో ఉండవలసినవాడవు ఇక్కడున్నావేమి? వెళ్ళు, వెంటనే, స్టూడియోలోకి!" అన్నారు.

నన్ను చూడగా రజనిముఖ మింతైంది. నేను చేయతగినది ఏమీలేదు, నిజంగా, ఈ నాటకములో! కాని, నేను అతనితోకూడా ఉండడమే రజనికి కొండంత ధైర్యాన్ని ఇస్తుంది. నాకూ అంతే! రజని నాతోటిఉంటే కృష్ణుడు కలసిన అర్జుననిలా ఎంతైనా సాధింపగలను, నేను.

చండీదాస్ సంగీతనాటకము అద్భుతంగా రాణించినది. ఆఖరి బృందగానము పూర్తిఐ స్టూడియోలో ఎర్రదీపము ఆరిపోవడమే తడవుగా రజని స్టూడియో

చెప్పించాము. మనుచరిత్ర, పారిజాతాపహరణము, ఆముక్తమాల్యద, వీటి లోని పద్యాలను తీసుకున్నాము. శ్రీకృష్ణదేవరాయలు పారేపల్లి సుబ్బారావు; తిమ్మరుసు ముంజులూరి కృష్ణారావు; పెద్దనామాత్యుడు పారేపల్లి సత్యనారాయణ: తెనాలిరామకృష్ణుడు ప్రయాగ నరసింహశాస్త్రి. పోర్చుగీస్ రాయబారిగా విప రీతపు యాసతో నేను మాట్లాడాను. రాయలను వైతాళిక బృందము మేలుకొలిపే దృశ్యమూ, తిమ్మరుసుతో మంత్రాలోచనమూ, సభారంగమూ, యుద్ధరంగములూ, ఉత్తరదిగ్విజయయాత్రా, తదుపరి ధనుష్కోటివరకూ దక్షిణదిగ్విజయయాత్రా ఇవన్నీ కన్నులకు కట్టినట్టు చిత్రింపకలిగాము. చివరకు, భువనవిజయమున కవి ఘన్మానమూ, వినోదాలూ వేడుకలూ జగజ్జేగీయమానంగా జరిగినవి.

ప్రసారమైన ఒక్కొక్క రేడియోకార్యక్రమమును గురించీ డ్యూటీ ఆఫీసర్ తన అభిప్రాయాన్ని వెంటవెంటనే క్యూషీట్‌పైన పొందుపరచడము, రివాజు. ఈప్రదర్శన జరుగుతూండగా, మధ్యలోనే త్యాగరాయశాస్త్రి మేడ దిగి వచ్చి "ఏదీ క్యూషీట్!" అని, అడిగి పుచ్చుకుని, శ్రీకృష్ణదేవరాయలు - సంగీత రూపకము అనే అంశానికి ఎదుపగా బీ ప్లస్ అనేగుర్తు ఉంచి తన సంతకాన్ని పొందుపరచి, వెళ్ళిపోయారు. 'ఏ ఒన్' ఒక ఆశయముమాత్రమే కాబట్టి ఆ మార్కు ఎవరికీ లభింపదు. ఈ ప్రదర్శనానికి అందరికంటే పైఅధికారి అతను స్వయంగా అంత గొప్పమార్కు ఇవ్వడము ఎంతో గొప్ప. అందుకు తగినట్లు గానే, ఆ మరునాడూ ఆ తరవాతరోజూ ఎంతలేవన్నా ఒక నూటఏబది ఉత్త రాలు వచ్చాయి, ప్రదర్శనను ప్రశంసిస్తూ. ఆంధ్రదేశము నాలుగుమూలలనుండి వచ్చిన ఈ అభివందనములు మమ్మెంతగానో హర్షింపచేసినవి.

ఆ తరువాత కొన్నాళ్ళకు, కాకతీయాభ్యుదయమూ రచించి ప్రసారము చేశాము. ఈ రచనకు అందమిచ్చే మంచిమంచి పాటలు వ్రాశాడు రజని. కాక తీయవైభవాన్ని చాలా చక్కగా చిత్రింపకలిగాము.

జీవితమును ఇందుకొరకే వినియోగిస్తాడు అతను. ఇక, మానవసేవాతృష్ణా త్యాగ తృష్ణా. జీవితంలో మనము పాటింపవలసిన కొన్ని కొన్ని ముఖ్యమయిన విలువ లను చాలా చక్కగా నిరూపించగలిగాము ఈ రూపకముద్వారా. శ్రోతలున్నూ ఈ రూపకాన్ని తరువాత అనేకపర్యాయాలు జ్ఞాపకంజేసుకున్నారు.

ఆరోజులలో, ఒకనాడు, మధ్యాహ్నము నేను డ్యూటీలో ఉండగా, మాపై అధికారి శ్రీ సూరి నారాయణమూర్తి నాకుఫోన్‌చేశారు: "చూడండి! 'తిష్యర క్షిత' అనే ఏకాంకికను చూచారుకదూ? ఆ నాటికను ప్రసారము చెయ్యడము లేదన్నారు, మీరు. సరే; ఆ నాటికను రచించిన శివరాజు సుబ్బారావు అనేఆయన వస్తున్నారు మీ వద్దకు. ఆయన వ్రాతప్రతి ఆయనకు ఇచ్చివేస్తూ, ఎందువల్ల మనము ఆ నాటికను వినియోగింపలేకపోతున్నామో ఆయనకు తెలియచెప్పండి. ఆయన బాగా చదువుకున్నవారు. ఇంకా ఎన్నో రచనలు ఉన్నాయట వారివి. వానిలో మనకు ఏవైనా పరిశీలనార్థము పంపిస్తారేమో కనుక్కోండి" అంటూ.

శివరాజు సుబ్బారావు నా ఎదుట వచ్చి నిలబడ్డాడు. ఆయనే 'బుచ్చి బాబు'. ఆయనను ఉచితరీతిని సత్కరించి, ఈమాటా ఆమాటా మాట్లాడసాగాను ఆయనతో. అప్పటికే ఆయన కథానికలు కొన్ని నమ్మాళ్వార్ పుస్తకంగా అచ్చు వేశారు. ఆ సంపూటాన్నిగురించి శ్రీశ్రీ విమర్శ చదివాను. కాని, పుస్తకం చదువలేదు, నేను....బుచ్చిబాబునుగురించి కొన్ని వివరాలు కనుక్కున్నాను. అతను ప్రెసిడెన్సీ కాలేజ్‌లో ఆనర్స్ చదివాడనీ, ప్రస్తుతం, అనంతపురం కాలే జ్‌లో లెక్చరర్‌గా ఉన్నాడనీ తెలుసుకున్నాను. ఆతరువాత, ఆతను రచించిన 'తిష్యరక్షిత' ను గురించి చెబుతూ అన్నాను: "శైలీ రచనాశిల్పమూ చాలా గొప్పగా ఉన్నవి. ఇంగ్లీష్ ఏకాంకికకు కావలసిన హంగులన్నీ ఉన్నాయి. కాని కథావస్తువుమాత్రం కొంతవరకు సారంగధరను పోలివున్నదేమో. సారంగ ధర నాటకము అట్టే అంత ప్రదర్శనాయోగ్యంకాదు, మరి. మహారాజుభార్యకు సవతికుమారునిపై మోహము జనించడము ఏమంత ప్రదర్శింపతగిన అంశము కాదు. అందుకు ఆమె పశ్చాత్తాపపడినట్లూ కనుపించదు, మీ రచనలో. ఈ సన్ని వేశాన్ని రేడియోలో ప్రదర్శించడము సాహస మవుతుందేమో" అన్నాను.

ధాలూ చాలా ఏకీభవిస్తూండేవి. మేము ఆప్తస్నేహితుల మయ్యాము. నాతో మిక్కిలి మనసిచ్చి మాట్లాడనారంభించాడు, అతను. నేనూ ఆతనిని తరుచు కలుసు కుంటూ, ఎటువంటి దాపరికమూ లేకుండా నా గురించి సర్వమూ చెప్పివేశాను, అతనితో. జీవితంలో నేను ఆశించిన ఆశలూ, నేను పొందే నిరాశా, నేను చేసిన పొరపాట్లూ, అంతా వివరించాను ఆతనితో. ఒకసారి అన్నాడు అతను: "నాకు తెలియనే తెలియదు మీ జీవితంలో ఇంత చరిత్ర ఉందని!" అని.

తదుపరి జీవితంలో కొన్నికొన్ని విశేషాలకుగాను నేను బుచ్చిబాబుకు మిక్కిలి బాధ్యుడనై ఉన్నాను. అందు ఒకటి: చిత్రరచనలో నాకు ఆసక్తి నేర్పా కలుగుట అతనిమూలాననే. ఆ రోజులలో అప్పటికే అతను మంచిమంచి బొమ్మలు చిత్రించేవాడు. ఒకరోజు ఆ ప్రస్తావనవచ్చి, అతను అన్నాడు నాతో "మీరుకూడా ప్రయత్నించవరాదా? చిత్రకళను గురించి మీకు చాలా తెలుసు. మీరు కాస్త ఎత్నిస్తే, మీరూ మంచిబొమ్మలు చిత్రిస్తారేమో" అని. మరునాడు, చిత్రరచ నకు కావలసిన కొన్నిపరికరాలనుతెచ్చి ఇస్తూ వానిని ఎలా ఉపయోగించాలో చెప్పాడు కూడా. ఆవిధంగా నేను ప్రారంభించిన చిత్రరచన నా జీవితానికే ఎంతో వన్నె తెచ్చింది.

రెండవ విషయము: బుచ్చిబాబే నాకు టి. ఎస్. ఎలియట్‌ను గురించి నిజంగా పరిచయము చేస్త. మానవునికీ మానవునికీ మధ్యఉన్న ఆప్యా యత ఇంకాఇంకాఎక్కువకావాలి, అని బుచ్చిబాబూ నేనూ అనుకుంటుండగానే ఒకపర్యాయం అతను అన్నాడు: "అన్నట్లు, ఈవిషయాన్నిగురించి టి. ఎస్. ఎలియట్ ఎంతో చక్కగా చెప్పాడు. మీరు ఎలియట్ రచన లేమైనా చది వారా?" అని.

నేను అంతకుముందే ఎలియట్‌ను గురించి కొంత వినిఉన్నాను. ఢిల్లీలో ఉండగా అందరి చేతులలోనూ ఎలియట్ రచనలే చూచి "ఇదేదో కొత్త ఫేషన్" అనుకొని, ఉదాసీనతతో ఆవైపు వెళ్ళలేదు నేను. బుచ్చిబాబు చెప్పాక, ఎలియట్ రచనలు ఒక్కొక్కటే శ్రద్ధతోచదివి, అవగాహనచేసుకో నారంభిం

శైలి ఇంగ్లీష్‌శైలిలా ఉంటుంది. మాఅందరికంటే ఎక్కువగా, మీరు ఇంగ్లీష్‌లోనే ఆలోచిస్తూ ఉంటారు; అందువలననే ఇంగ్లీష్‌తీరున ఉంటుంది, మీరచన," అనేవాడను.

కాని, కొన్నికొన్ని చోట్ల, 'చివరకు మిగిలేది.' నవలలో వచనము పద్యమంత అందంగానూ ఉంటుంది.

"కన్నీటితో గడ్డిపోచలు తడిసినవి. ప్రాణానికి ఎట్టివిలువ ఉంది? గడ్డిపోచకు ఎంతో, అంతే!

....సముద్రాలను సహితం ఇముడ్చుకున్న కన్నీటిబిందు; ఆకాశాన్ని ముంచివేసే కన్నీరు, ఆనందంతో ఉబికిపోతోంది....

....కోమలి కనుబొమ్మలో కోపం పెదవుల మీదికి దిగజారి, నవ్వుకోసం బుగ్గలు ఆశ్చర్యంతో కదిపింది.

....అతనిదగ్గరకెళ్ళి, తలవంచి అతని రెండు కళ్ళల్లోకి చూచింది. నీళ్ళకు బదులు, రక్తం పోసి పెంచిన రోజాపుష్పంలా కనిపించింది ఆమె మొహం! —

....అట్లా గడ్డిపోచలమధ్య గంతులేస్తూ ఆకాశాన్నీ భూమినీ బుజ్జగిస్తూ, స్నేహం చేసుకుంటూ ఉండవలసిన వ్యక్తి కోమలి! ....ఆకలి దాహాలు లేని అయోమయపు ఆశ, దారుణాలు ఎరుగని దైవత్వం, హద్దులు లేని అనుభవం ఆమె.

....పరిమళం బరువుకి, ఒత్తిడికి తట్టుకోలేక ఊడిపడిపోయిన అడవి పువ్వు; పర్వతశిఖరాల్నుంచి జారి విడిపోయిన మంచుముద్దలోని నిర్మలత్వం; నిశీధిలో సృష్టి వేసుకున్న మంటలో నడిజ్వాల; అర్ధరాత్రి, జీవులుకన్న స్వప్నంలోని మూగబాధ....

౨౨

ఇదిగో! ఇంకా నిద్రలేవని
మంచుతడి ఆరని పారిజాతాలు!!
ఈ ధవళిమ నా భావాల స్వచ్ఛత,
ఈ ఎరుపు నా అనురాగపు రక్తిమ,
ఈ పరిమళము మన స్నేహసౌరభము!!
అందుకోవూ!
నీ వెక్కడున్నా నీవద్దకే వస్తాను -
భిక్షాపాత్రతోగాని,
నవరత్నాలుకూర్చిన కంఠమాలతోగాని!

జానకిరామ్

సత్యవోలు కామేశ్వరరావుతో నా స్నేహము మిక్కిలి ఆర్ద్రవంతమైన మధురస్మృతి. అతను నా జీవితములో అడుగుపెట్టిన రోజును పండుగరోజుగా భావిస్తాను, నేను, ఇప్పటికీ!

ఆవేళ దుర్గాబాయ్ పినతల్లికూతురు లలితాబాయ్‌గారి ఇంటికి వెళ్లాను నేను. లలిత నాకు కబురుచేశారు: "మాఅన్నయ్య మీకథ 'మీరు నవ్వరేమి?' వినాలంటున్నాడు, నాకూ మరోపర్యాయం వినాలని ఉన్నది. మాఇంటికి మీరు ఎప్పుడూ రాలేదు, ఒకసారి వస్తారా?" అని. కబురు అందుకుని, నేను వెళ్లాను వారి ఇంటికి. అవతల కచేరీసావడిలో వాళ్ళ అన్నయ్య ఏదో చదువుకుంటున్నారు.

సాగుతున్న యాత్ర

నేను ఆరోజులలో ఆఫీస్‌లో రాత్రి చాలాసేపటివరకూ పనిచేస్తూ ఉండిపోయేవాడను. అతను ఏ సాయంత్రపువేళనో మా ఆఫీస్‌కువచ్చి అలా నా ఎదుటనే కూర్చొని ఉండిపోయేవాడు. నేను నా ఆఫీస్‌పని చూచుకుంటూనే అతనితో మాట్లాడుతూండేవాడను. కాదంబరినిగురించీ, కుందమాలనుగురించీ, మేఘసందేశాన్ని గురించీ.

అతను సంస్కృతంలో ఎమ్. ఏ. ప్యాసైయ్యాడు. అతని తాతగారు గొప్ప పండితులు. ఆయన కాదంబరికి చక్కనివ్యాఖ్య వ్రాశారు. కావ్యవిషయాలనుగురించి కామేశ్వరరావుకు తెలియనిఅంశము లేదు.

మా పరిచయమైన కొద్దిరోజులలోనే అంతవరకూ నేను రచించిన రచనలన్నీ చదివాడు కామేశ్వరరావు. దానికితోడు, రాత్రింబవళ్ళు నాకథ వినేవాడు, నేను చెప్పగా. అప్పటి నా శిథిలజీవితములోని విషాదాన్ని పూర్తిగా పంచుకున్నాడు, నాతో, కామేశ్వరరావు.

తనకథా చెప్పాడు, నాతో, అతను : ఎంతో అందమైన ఫలశ్రుతిని పొందవలసిన అతని ప్రేమగాథ. కాని, ఎక్కడో, ఎవరో పొరపాటు చేయడమువల్ల - అంటే, అవసరమైన నిమిషాన ఉదాసీనత చూపడమువల్ల - అలా జరుగలేదు. నాలాగుననే అతనికీ ఒక స్వర్ణసీత.

ఆ రోజులలోనే నేను 'స్వర్ణసీత' వ్రాశాను:

స్వర్ణసీత ఒక ఆరాధన; అనుభవ పరంపర,
స్వర్ణ సీత.
...స్వర్ణ సీత ఒక తీరనికోరిక; ఒక ఎడతెగని
అన్వేషణ.
ఒక అంతమేలేని ఆవేదన స్వర్ణ సీత !

అంటూ.

"చంద్రునిలోని మచ్చ అల్లా వెండిపళ్ళెమంతా వ్యాపించిపోయిన ఆ రాత్రిని ఎన్నటికినీ మరువలేడు తోటమాలి. సెలయేటి ఇసుక తిన్నెలలో, పిచ్చుకగూళ్లను కట్టుకుంటూ ఆడుకుంటూండగా, రాజకుమార్తె తన వ్రేలిని తొడిగిన వజ్రపుటుంగరము, ఎంతమరచిపోవాలన్నా ఆమెను మరచిపోనియ్యదు," - అంటూ ప్రారంభించింది కథ.

పెద్దమాలి చాలా ప్రయత్నిస్తాడు. కొడుకును ఎల్లాగైనా మన ప్రపంచములోకి మరల్పడానికి; కాని, లాభంలేదు. కొడుకు పలుకడు. నిట్టూర్పు ఐనా లేదు. గంటల తరబడి వజ్రపుటుంగరములోకి అల్లాగేచూస్తూ ఉండిపోతాడు తోటమాలి....కాలమే మాన్పాలి ఈగాయాన్ని!

ఉన్నట్టుండి, ఒకనాడు తోటమాలికి, ఏదో స్ఫురించి, అతను చటుక్కునలేచి, గంగగోవును పాలుపితికాక, తోట త్రవ్వడము ప్రారంభిస్తాడు. మిట్ట మధ్యాహ్నము ఒక అరగడియసేపు విశ్రమించాడో ఏమో అంతే! - ప్రొద్దు గ్రుంకేసరికి, పూలమొక్కలన్నీ త్రవ్వివేస్తాడు తోటమాలి. ఒక్క మొక్కైనా ఉండదు, ఇక, తోటలో!

"మాలతీతీగవద్ద మాత్రం, ఒక్కక్షణం అనుమానిస్తాడు. ఎంతో ప్రయత్నాన, ఆవేళ, మామిడిమొక్కపైకి రాజకుమార్తే తనూకలిసి ఎక్కించిన తీగ. ఆకాస్తపనికే అలసిపోయింది, ఆమె....ఒక్కదెబ్బతో తెగిపోయింది, తీగ. ఒక్క గునపపుపోటుతో పెల్లగిలి వచ్చింది, వేరు.

....మళ్లా పున్నమ్మ వచ్చేసరికి, తోటంతా పువ్వులతో నిండిపోతుంది. అన్నీ ఎర్రటిపువ్వులే, ఏవంక చూచినా ఎర్రటిపువ్వులే! అదీ, అప్పుడు తగిలిన గాయములోంచి ద్రవించే రక్తపు ఎరుపు!

ఆ నదీగర్భంలో ఒక చలువరాతి మందిరాన్ని నిర్మిస్తాడు తోటమాలి. ఆమందిరంలో "రత్నఖచితమైన ఆమెగాజుల మ్రోతను వింటూనే నిర్మిస్తాడు తోటమాలి ఆమెలాంటి ప్రతిమనే....వాడి, నేలకు వాలిన తీగను పైకిఎత్తుతూ

పైనున్న గవాక్షమునుంచి రెండు జంటకిరణాలు వెలుతురు బాణాలులా వేదికపై ప్రసరిస్తున్నాయి. ఆ వెలుతురుకు ఒక్క-క్షణం కళ్ళుమూసుకుంది రాజమాత!....

కళ్ళువిప్పి, చూచింది, రాజమాత.

వేదికపైన ప్రతిమలేదు!

జీవకళ ఉట్టిపడుతోంది అనుకున్న తనకూతురి విగ్రహంలేదు! !

విగ్రహము ఉండవలసినచోట గుబ్రనికాంతిలో ఉన్నవి, రెండు దోసిళ్ళ పారిజాతపు పువ్వులు.

దగ్గరకు వెళ్ళిచూచింది, రాజమాత.

తెల్లటి రేకలపైన మంచుముత్యాలు - వేయికన్నీటి చుక్క-లు. పారిజాతపు గొట్టాలన్నీ ఆమె కేసే చూస్తున్నాయి - వేయి ఎర్రని సూది మొనలలాగ! ఎర్రని సూదిమొనలలలాగ !!

రాజమాత పెదవులు అదరినవి.

"ఇంతటి త్యాగమా!....ఇంతటి త్యాగమా!!" అన్నది రాజమాత - అని, నాకథ ముగించాను నేను.

మరెదో ప్రపంచంలోంచి భూమికి దిగివచ్చినట్టు, కళ్ళుతెరచి, కామేశ్వరరావు అన్నాడు నాతో! "రాజామాతనుకాదు; నన్ను గ్రుచ్చుకున్నాయి ఎర్రని సూదిమొనలలాగ ఆపారిజాతపు గొట్టాలు! అబ్బ! ఎలా వ్రాయకలిగారండీ ఈ కథను!" అని,

ఈ నిస్పృహను పోగొట్టుకోడానికి ఏమార్గమూ కనిపింపలేదు, నాకు, ఎంతవరకనీ నా ఉద్యోగపుపనిలో లీనమైపోవడము! అందుకూ ఒక మితి అంటూ ఉంటుంది, కూడా.

ఒకరోజు, మరీ పిచ్చిఎత్తినట్లుఐతే, ఆలా పార్థసారథిగుడికి వెళ్ళాను గుడిలో దేవీవిగ్రహము ఎలా ఉంటుందో చూచివద్దామని.

సాగుతున్న యాత్ర

డ్యాన్స్‌నుంచి, తిన్నగా వారింటికి తీసుకువెళ్ళారు నన్ను గోపాలన్, "ఈపూట మాఇంట్లోనే భోంచేద్దువుగాని, నువ్వు!" అని.

భోంచేస్తూంటే అన్నారు, ఆయన, ఆయన భార్యతో: "మన జానకిరామ్‌కి ప్రమోషన్ వచ్చింది, తెలుసా!" అని. మూర్తీభవించిన సౌజన్యరాశి, ఆమె, అన్నారు: "అయ్యో! ఒక్కమాట ఫోన్‌లో చెప్పలేకపోయారా, పరమాన్నమైనా చేసేదాన్ని! అని. మా అమ్మ జ్ఞాపకం వచ్చింది, నాకు.

....ఇన్నేళ్లయినా, పరమాన్నమును రుచిచూచినపుడల్లా, గోపాలన్ భార్య, ఆ సాధ్వీమతల్లి, జ్ఞప్తికి వస్తూంటారు, నాకు.

కాని, అంత మంచిమనిషి నడువడానికి ఈలోకము తగదని, దేవుడు ఆమెను తీసుకు వెళ్ళిపోయాడు, తనవద్దకు, మరికొన్ని నెలలలోనే. మా అమ్మ చనిపోయిన జబ్బువల్లనే, ఆమె చనిపోయారు - ధన్వంతరులవంటి వైద్యులు విశ్వప్రయత్నము చేసినా, ఫలింపక. ఆమె భౌతికదేహము పంచభూతములతో కలసిపోతుండగా నేను ఉన్నాను, అక్కడ.

ఎలా భరింపగలిగారో గోపాలన్, ఈ దారుణవియోగాన్ని! వారిద్దరూ సాధారణ భార్యాభర్తలు గారు. వారి జీవితములో ప్రతినిమిషమూ వారు కలసి జీవించేవారు. 'కరము కరమున గీలించి, కలసిమెలసి మనిన సహధర్మచారిణి, మధురమధురమూర్తి, ప్రియురాలు, సఖురాలు, పూర్ణరాగకలిత,' ఆమె. అతని బహిర్ప్రాణము! ఆ ప్రాణమే పోయినప్పుడు ఆయన ఎలా బ్రతుకకలిగాడో - ఎంతటి ధైర్యం కావాలి!!

ఆయన మహాయోగి అనుకున్నాను, నేను - లోకాచారరీత్యా పదకొండురోజులు సెలవుమీద ఉండి, పన్నెండవరోజున, ఎప్పటిలా ఉదయమే ఆఫీస్‌వేళకు ముందుగానే, రేడియోనిలయములో ఆయన నవ్వుమొఖము కనిపించేసరికి. ఏమీ జరుగనట్లు, నిన్నరాత్రి ప్రసారమైన విశేషకార్యక్రమాన్ని గురించి ప్రశ్నించారు నన్ను, గోపాలన్!....అంతటి ధీరస్వభావము నాకెప్పటికన్నా అలవడుతుందా?

కథలలో రాజకుమార్తె ఏడుమల్లెపువ్వుల ఎత్తే - కుసుమ్ ఒక్క మల్లెపువ్వు ఎత్తే ఏమో!" అని. ఆమె కిలకిలా నవ్వేది. ఒకసారి, భోజనాలయ్యాక, "కుసుమ్ నీకు తన నగలను అన్నిటినీ చూపించాలంటోంది. నీవు కళాశీలివిగా, రా!" అంటూ తమ పడకగదిలోకి తీసుకువెళ్లాడు నన్ను, రసిక్‌లాల్. మల్లెపువ్వు లాంటి చిరునవ్వుతో ఒక్కొక్కనగా చూపించింది నాకు కుసుమ్ : "ఇది చంద్ర హారము; ఇది ముత్యాలపేరు; ఇది పచ్చల పతకము - ఇవన్నీ మా పుట్టింటివారు నాకు ఇచ్చినవి" అంటూ. వారి పురాతనరీతి నగలు అచ్చంగా మనప్రాంతపు క్షత్రియస్త్రీలు అలంకరించుకునే నగలలా ఉంటవి : చామంతిపువ్వు; రాగిడీ; నాగ రము; బావిలీలు; నత్తు; అడ్డబాస; దండకడియములు; వంకీలు. "ఇవన్నీ మా పుట్టింటివారిచ్చినవే!" అంటూ గర్వంగా చెప్పింది నాతో, మళ్లా, కుసుమ్, భర్త కేసి కొంటెగా చూస్తూ.

రసిక్‌లాల్ నవ్వుతూ అన్నాడు ఆమెతో : "నీ ఏడువారాల సొమ్ములు చూపవేమి" అని. "అవి వీరిచ్చినవి! అందుకే అంత ఆసక్తి!!" అంటూ, తన ఏడువారాలసొమ్ములూ చూపించింది,కుసుమ్ ఒకొక్కరోజుకూ వేరువేరుగా అమ ర్చిన సందుగాలలోంచి తీస్తూ. నేను నవ్వుతూ అన్నాను : "మీకు వేరే క్యాలెం డర్ అక్కరలేదు. ఇవ్వాళ గజ్జలవడ్డాణము పెట్టుకున్నాముగనుక, ఇవ్వాళ శుక్ర వారం! - అనవచ్చు. అంతేనా!" అని. ఇన్ని చిన్ని ముత్యపుచిప్పలు కలబోసి నట్లు కిలకిలా నవ్వింది. కుసుమ్. ఆ నవ్వు ఈ నిమిషమూ ప్రతిధ్వనిస్తోంది, నా హృదయంలో.

నేను వచ్చివేస్తూంటే స్టేషన్‌కి వచ్చారు, వారిద్దరూను. రైలు కదల బోతూంటే నేను అడిగాను వారిని : "మా ఊరినుంచి ఏమి పంపను మీకు?" అని. అతను ఆమెకేసి చూశాడు ఏమంటుందో అని. కుసుమ్‌బెన్ అన్నది : "నాకు ఆంధ్రాఖద్దరు చాలా ఇష్టము. పంపడముకాదు; నీవే స్వయంగా తీసుకు రావాలి, పొందూరు ఖద్దరుచీర - ఐదుగజాల చీర చాలు నాకు, నీవే తీసుకు రావాలి, త్వరలోనే, నాకోసము!" అని.

నేను మళ్లా బొంబాయ్ వెళ్ళలేదు. వెళ్ళితేమాత్రము తప్పకుండా తీసుకువెళతాను పొందూరు ఖద్దరుచీర కుసుమ్‌బెన్ కోసము.

సాగుతున్న యాత్ర

వాస్తవిక జీవితము ఊహాజీవితముకంటే విచిత్రంగా ఉంటుంది, ఒకొకప్పుడు:

నేను ఢిల్లీచేరిన మరునాడే, ఆఫీస్‌కు వెళ్లేసరికి, నాకు ఒక ఉత్తరాన్ని అందించారు. కానీకార్డు! ఆ కానీకార్డూ ఇద్దరి జీవితాలను పూర్తిగా మార్చివేసింది!! సందేశము నందుకొని, ఆ సాయంత్రమే మళ్ళీ రైలుఎక్కాను. ఇది రెండవసారి, నేను ఢిల్లీనుంచి పారిపోయి రావడము. కాని, ఈ సారిమాత్రం, నాఆశ నిరాశ కాలేదు. వేదవల్లికి నాపైన పరిపూర్ణమైన అనుగ్రహం కలిగింది.

మన జీవితములో సుఖదుఃఖాలు పూర్తిగా దైవ నిర్ణయమే!........మళ్లా, ఇన్నాళ్ళకు మళ్లాగృహస్థాశ్రమము - నా నలుబది ఐదవఏట.

నాకోసము కాకపోయినా, ఆ అవతలవారికోసము, జరిగిన నాజీవితము లోంచి ఒక ఇరవై ఏళ్ళు తీసివేస్తే!....జీవితము ఎంతబాగుంటుందీ అప్పుడు! పాతిక ఏండ్ల వయస్సులో, నేను!!

కాని, ఏ ఇరవై ఏళ్ళు తీసివెయ్యను?

అనీబిసెంట్ ప్రభావం నాపై ప్రసరించిన ఆ ఏళ్లు తీసివెయ్యనా?.... అరవిందునితో సల్లాపించిన ఆఏళ్లు తీసివెయ్యనా? మహాత్మునితో ఆ క్షణిక పరి చయమూ కల్గిన ఆ ఏళ్ళు తీసివెయ్యనా?....అన్నీ కావలసినవే! అన్నీ ఆప్యా యంతో దాచుకోవలసినవే!!

ఇరవై ఏళ్ళుకాదు, ఇరవై నిమిషాలు తీసివెయ్యలేను, ఈ జీవిత లోంచి! ప్రతినిమిషమూ విలువైనదే! ప్రతినిమిషములోనూ ఏదోఒక అమూల్య మైన అనుభవము ప్రకాశిస్తున్నది!!

ఎటువంటి జీవితము! ఎటువంటి జీవితము!!

* * *